www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 8-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 264 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: నవమి మ. 2.26 తదుపరి దశమి; నక్షత్రం: అశ్విని సా. 4.29 తదుపరి భరణి; వర్జ్యం: మ. 12.42-2.13, రా. 1.32-3.02; దుర్ముహూర్తం: ఉ. 11.59-12.43; అమృతఘడియలు: ఉ. 9.41-11.11; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.52 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# ప్రగతి ప్రదాతకు స్వాగతం

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఇంధన, రైల్వే, రోడ్లు, ఔషధ & పారిశ్రామిక రంగాలకు సంబంధించి **రూ. 2 లక్షల కోట్లకు పైగా** విలువైన ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు & జాతికి అంకితం చేస్తున్న కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈరోజు విశాఖకు విచ్చేస్తున్న...

## గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారికి

## ఆంధ్రప్రదేశ్ ప్రజలందరి తరపున స్వాగతం!... సుస్వాగతం!!

### శంకుస్థాపన ప్రాజెక్టులు - అంచనా వ్యయం




పూడిమడక దగ్గర NTPC గ్రీన్ హైడ్రోజన్ హబ్
రూ. 1,85,000 కోట్లు



విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణం - రూ. 149 కోట్లు



రోడ్ల నిర్మాణం/విస్తరణ (10 ప్రాజెక్టులు)
రూ. 4,593 కోట్లు




కృష్ణపట్నం పారిశ్రామిక పార్క్
రూ. 2,139 కోట్లు

### ప్రారంభోత్సవం/జాతికి అంకితం



6 రైల్వే ప్రాజెక్టులు
రూ. 6,028 కోట్లు



నక్కపల్లి దగ్గర బల్క్ డ్రగ్ పార్క్
రూ. 1,877 కోట్లు



234.28 కి.మీ.ల రోడ్లు (7 ప్రాజెక్టులు)
రూ. 3,044 కోట్లు




323 కి.మీ.ల - 3 రైల్వే లైన్లు (2 రాయలసీమ ప్రాజెక్టులు)
రూ. 5,718 కోట్లు

**సాయంత్రం 4:45 గంటలకు**

విశాఖపట్నంలోని వేంకటాద్రి వంటిల్లు రెస్టారెంట్ నుండి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వరకు **రోడ్ షో**

**సాయంత్రం 5:30 గంటలకు**

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో **భారీ బహిరంగ సభ**



**ప్రగతి బాటలో కలిసి నడుద్దాం... స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను చేరుకుందాం**



## లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు

లాస్ ఏంజెలెస్, జనవరి 8: అమెరికాలోని లాస్‌ఏంజెలెస్ నగరంలో కార్చిచ్చు చెలరేగింది. హాలీవుడ్ నటులు, ప్రముఖులు నివాసం ఉండే అత్యంత సంపన్న ప్రాంతం పసిఫిక్ పాలిసేడ్స్ పూర్తిగా మంటల్లో చిక్కుకుపోయింది. హాలీవుడ్ స్టార్లు టామ్ హాంక్స్ రీస్ విథర్స్పూన్ వంటి నటుల ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. అగ్ని కీలలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్నాయి. దీనికి తోడు గాలులు బలంగా వీస్తుండటంతో మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. కార్చిచ్చు ఇప్పటికే 3వేల ఎకరాలకు విస్తరించింది.

## రఘురామ కేసులో తులసిబాబు అరెస్టు

- 6 గంటల విచారణ అనంతరం అదుపులోకి

ఒంగోలుక్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రఘురామకృష్ణ రాజు సీఐడీ కస్టడీ హింస కేసులో ప్రైవేటు వ్యక్తి కామేపల్లి తులసిబాబును పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఆయన్ను ప్రశ్నించిన ప్రకాశం ఎస్పీ దామోదర్.. ఆ తర్వాత అదుపులోకి తీసుకున్నారు. తులసిబాబును గురువారం ఉదయం గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచనున్నారు. కాగా, సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 వరకు తులసిబాబు, పోలీసు కస్టడీలో ఉన్న రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను ఒకేచోట కూర్చోబెట్టి ఎస్పీ విచారించారు. ఇద్దరూ దాటవేత ధోరణిలో సమాధానాలు చెప్పినట్లు తెలిసింది. అయితే పక్కా సమాచారంతో పలురకాలుగా పశ్నించి కొంత సమాచారం రాబట్టినట్లు తెలిసింది. 9.30 తర్వాత విజయ్‌పాల్‌ను స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం తులసిబాబును ప్రత్యేకంగా ప్రశ్నించినట్లు సమాచారం.

## ఆడ దోమల అంతానికి మగ దోమల్లో విష జన్యువు

సిడ్నీ, జనవరి 8: రాజును చంపడానికి విలన్ విషకన్యని ప్రయోగించే కథ చాలా సినిమాల్లో చూశాం. అదే టెక్నిక్‌తో.. ఆడ దోమలను అంతం చేసేందుకు ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు 'టాక్సిక్ మేల్ టెక్నిక్' పేరుతో ప్రయోగాలు చేస్తున్నారు. అందులో భాగంగా.. మగ దోమల వీర్యాన్ని విషపూరితం చేసే జన్యువును వాటిలో ప్రవేశపెడుతున్నారు. ఆ విషపూరిత దోమలు ఆడ దోమలతో కలిసినప్పుడు.. వాటి వీర్యంలో ఉండే విష ప్రొటీన్లు సదరు ఆడదోమల ఆరోగ్యం క్రమంగా క్షీణించిపోయేలా చేసి చివరికి వాటిని చంపేస్తుందన్నమాట. ఈ ప్రయోగం వల్ల ఆడదోమల జీవితకాలం 60% తగ్గినా.. దోమకాటు బాధితుల సంఖ్య తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## చంద్రయాన్-4, గగన్‌యాన్‌పై దృష్టి

- ఇస్రో కొత్త చైర్మన్ నారాయణన్ వెల్లడి.. 14న బాధ్యతల స్వీకరణ

సూళ్లూరుపేట, బెంగళూరు(ఆంధ్రజ్యోతి), జనవరి 8: ఇస్రో ప్రస్తుతం విజయపథంలో దూసుకెళ్తోందని ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రోకు నూతన చైర్మన్‌గా ఎంపికైన వి నారాయణన్ అన్నారు. ఇప్పుడు ఇస్రో ముందున్న ప్రధాన మిషన్లలో చంద్రయాన్-4, గగన్‌యాన్ ముఖ్యమైనవని పేర్కొన్నారు. అంతరిక్ష శాఖ కార్యదర్శిగా, ఇస్రో చైర్మన్‌గా తాను చేపట్టనున్న కొత్త బాధ్యతల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ పదవీకాలం 13న ముగియనుంది. 14న సోమనాథ్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

## బ్లాక్ లిస్ట్ కంపెనీలకు అనుమతిచ్చారు

- హోలోగ్రామ్ స్కాంలో వాసుదేవరెడ్డికి పెద్దమొత్తంలో డబ్బు ముట్టింది
- హైకోర్టుకు నివేదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం బాటిళ్లపై అతికించే సెక్యూరిటీ హోలోగ్రామ్‌ల తయారీ, సరఫరా కాంట్రాక్ట్ టెండర్ అప్పగింత కుంభకోణంలో ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి పాత్రపై మరిన్ని ఆధారాలు లభించాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ హైకోర్టుకు నివేదించారు. నిబంధనలు ఉల్లంఘించి బ్లాక్ లిస్ట్‌లో ఉన్న కంపెనీలకు టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు అనుమతిచ్చారన్నారు. అందుకుగాను పిటిషనర్‌కు పెద్ద మొత్తంలో సొమ్ము ముట్టిందని చెప్పారు. ఆధారాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. వాసుదేవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

## సజ్జల భార్గవరెడ్డి చెప్పినట్లు చేశా!

- సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టా
- మా పేరు చెప్పి భార్గవే సొమ్ములు కొట్టేశారు... రవీంద్ర రెడ్డి వెల్లడి

కడప, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా అప్పటి ఇన్‌చార్జ్ సజ్జల భార్గవరెడ్డి, ఆయన తండ్రి, అప్పటి ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారెడ్డి చెబితేనే సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినట్టు ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రరెడ్డి చెప్పినట్టు తెలిసింది. వారి ప్రోద్బలంతోనే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, అనిత, షర్మిల, విజయలక్ష్మి ఇతరులపై అసభ్య పోస్టులు పెట్టినట్టు వైసీపీ సోషల్ మీడియా కడప జిల్లా కోకన్వీనర్ వర్రా పోలీసులకు వెల్లడించారని సమాచారం. కోర్టు అనుమతితో వర్రాను రెండురోజులపాటు పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ నేతృత్వంలో బుధవారం కడప సెంట్రల్ జైలు నుంచి వర్రాను సైబర్ స్టేషనుకు తీసుకువచ్చి విచారించారు. "సజ్జల భార్గవరెడ్డి, రామకృష్ణారెడ్డి సూచనల మేరకే పోస్టులు పెట్టాం. మాకు డబ్బులు ఇవ్వలేదు. మా పేరు చెప్పి సజ్జల భార్గవరెడ్డే సొమ్ములు కొట్టేశారు. రాజకీయ భవిష్యత్తు ఉంటుంది, పార్టీ అండగా ఉంటుందని హామీ ఇవ్వడంతో పోస్టులు పెట్టాను. అయితే, వీటిలో 18 నావి కాదు. నా పేరిట ఫేక్ ఖాతాలు సృష్టించి పోస్టులు పెట్టారు" అని విచారణలో వర్రా చెప్పినట్లు తెలిసింది.

## గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా ఏపీ: మంత్రి లోకేశ్

విశాఖపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్, ఏపీ డిజిటల్ టెక్నాలజీ లీడర్‌షిప్ ఫోరం విశాఖలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఏపీ డిజిటల్ టెక్నాలజీ సదస్సు-2025ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచానికే తలమానికంగా నిలిచే డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుందన్నారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా 2ట్రిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యంతో ఐటీ రంగాన్ని ముందుకు తీసుకువెళ్లనున్నామన్నారు. ఇన్నోవేషన్, డీప్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంచుకుంటే ఆర్థిక అభివృద్ధితో పాటు సామాజిక పురోగతి సాధ్యపడుతుందన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో విశాఖలో ఏర్పాటుచేసిన మెడ్‌టెక్ పార్కు వైపు ప్రపంచమంతా చూస్తోందని, ఇది ఎంతో గర్వకారణమని అన్నారు. ఏఐ వర్సిటీని విశాఖలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుకు 21 రోజుల్లోనే అనుమతి ఇస్తామన్నారు. రాష్ట్రంలో విద్యా విధానాలను కూడా మారుస్తామని లోకేశ్ చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన నిపుణులను విద్యాసంస్థలు అందించలేకపోతున్నాయని, ఈ అంతరాన్ని పూడుస్తామని చెప్పారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఏపీ ప్రస్తుతం తొమ్మిదో స్థానంలో ఉందని, దీనిని మూడో స్థానానికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డ్రోన్లను కొందరు మిస్సైళ్లను చేరవేయడానికి ఉపయోగిస్తుంటే ఏపీ ప్రభుత్వం విపత్తు సహాయ కార్యక్రమాలకు ఉపయోగిస్తోందన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమలో కియా మోటార్స్ ఏర్పాటు చేయడం వల్ల ఇప్పుడు ఆ జిల్లా ఉభయ గోదావరి జిల్లాలతో తలసరి ఆదాయంలో పోటీ పడుతోందన్నారు. కర్నూలును పునరుత్పాదక ఇంధన కేంద్రంగా, చిత్తూరు, కడపను ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా, గోదావరి జిల్లాలను ఆక్వా హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద కెమికల్ పార్క్ ఉత్తరాంధ్రలో రాబోతుందన్నారు.

### పారిశ్రామికవేత్తలకు బాసట..

పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా సాయం అందిస్తామని లోకేశ్ అన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించామని తెలిపారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖలో ఐటీ అభివృద్ధికి అవసరమైన వాతావరణం ఏర్పాటు చేస్తామన్నారు. పరిశోధన, అభివృద్ధి రంగాలపై ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు.

# ట్రంప్ విస్తరణ కాంక్ష!

**కెనడా, గ్రీన్‌ల్యాండ్, పనామా కాలువను అమెరికాలో విలీనం చేసుకుంటామని ప్రకటన**

- మెక్సికోపైనా తెంపరితనం..
- మండిపడ్డ ఫ్రాన్స్, పనామా
- కెనడా ఎన్నటికీ విలీనం కాదు: ట్రూడో



అమెరికా, కెనడాను కలుపుతూ అమెరికా జెండాతో ట్రంప్ పోస్టు చేసిన ఫొటో

వాషింగ్టన్, జనవరి 8: అమెరికా అధ్యక్షుడిగా ఈ నెల 20న బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్ భూవిస్తరణ కాంక్షతో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా పేర్కొంటూ ఆ దేశంపై తమ జెండా ఎగురుతున్న మ్యాపుల ఫొటోలను షేర్ చేయడం, డెన్మార్క్ స్వయం ప్రతిపత్తి ప్రదేశమైన గ్రీన్‌ల్యాండ్, పనామా కాలువను విలీనం చేసుకుంటామని పేర్కొనడం, గల్ఫ్ ఆఫ్ మెక్సికోను 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తానని చెబుతూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలపై ఆయా దేశాలు తీవ్రస్థాయిలో మండిపడగా.. అగ్రరాజ్యాల మధ్య చిచ్చు మొదలవుతోందని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత.. ఎన్నడూ తలపడని అగ్రదేశాల మధ్య ఇప్పుడు మాటల ఉద్రిక్తత మొదలవుతోందని అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు.. నాటోలో భాగస్వామ్య దేశాలే.. ట్రంప్ వ్యాఖ్యలపై మండిపడడం పరిస్థితుల్లో తీవ్రతకు నిదర్శనమని చెబుతున్నారు. ట్రంప్ మంగళవారం తన మారి-ఎ-లాగో ఎస్టేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కెనడా, మెక్సికో, గ్రీన్‌ల్యాండ్(డెన్మార్క్), పనామాలపై మాట్లాడారు. సైనిక శక్తిని ఉపయోగించి విలీనం చేస్తారా? అని విలేకరులు అడగ్గా.. "లేదు..! ఆర్థిక శక్తిని వాడుతాను" అని స్పష్టం చేస్తూనే.. పనామా కాలువ, గ్రీన్‌ల్యాండ్ విలీనంపై సైనిక, ఆర్థిక శక్తిని వినియోగించనని హామీ ఇవ్వలేనన్నారు. పనామా కాలువను సైనిక అవసరాల కోసం అమెరికా నిర్మించినట్లు వ్యాఖ్యానించారు.

### కెనడాపై మరింత కఠినంగా..

ట్రంప్ గతంలో కెనడాతో ఎలాంటి సత్సంబంధాలను కొనసాగించలేదు. 2016 ఎన్నికల సమయంలోనే.. కెనడా-అమెరికా మధ్య గోడ కడతా అని ప్రకటించారు. ఇప్పుడు ఆ దేశంపై ఆర్థిక యుద్ధాన్ని ఇప్పటికే ప్రారంభించారు. కెనడా నుంచి జరిగే దిగుమతులపై 25% టారిఫ్ విధిస్తానన్నారు. నిజానికి కెనడాకు అమెరికా అతిపెద్ద వినియోగదారు. అమెరికాకు సహజవాయువులు, ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్‌ను కెనడా ఎగుమతి చేస్తుంది. వీటిపై 25% టారిఫ్ విధించడం కెనడాకు శరాఘాతంలాంటిదేనని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. తాజాగా కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో రాజీనామా ప్రకటన వెలువడిన వెంటనే.. ట్రంప్ విలీనంపై కీలక వ్యాఖ్యల ఉధృతిని పెంచారు. "కెనడాలో మెజారిటీ ప్రజలకు అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండడమే ఇష్టం. అమెరికాలో విలీనమైతే.. సుంకాలు, పన్నులు ఉండవు. పైగా.. నిరంతరం చుట్టూ కాచుక్కూర్చునే రష్యా, చైనా నుంచి అమెరికా మాత్రమే రక్షణ కల్పించగలదు" అన్నారు. అమెరికాలో కెనడా విలీనమైనట్లుగా ఓ మ్యాప్‌ను ఆయన తన పోస్టుకు జత చేశారు. ఇటీవల ట్రూడోను కలిసిన ట్రంప్.. "కెనడా గవర్నర్‌తో భేటీ అయ్యాను" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే..! తాజాగా విలేకరుల సమావేశంలో.. కెనడాను విలీనం చేసుకుంటామని పునరుద్ఘాటించారు.ఈ వ్యాఖ్యలపై ట్రూడో తీవ్రంగా స్పందించారు. అమెరికాలో కెనడా విలీనమయ్యే ప్రసక్తే లేదని ఎక్స్‌లో పేర్కొన్నారు.

### ఐరోపా జోలికొస్తే సహించేది లేదు: ఫ్రాన్స్

ట్రంప్ తాజా వ్యాఖ్యలతో ఐరోపా సమాఖ్య అప్రమత్తమైంది. తమ జోలికి ఎవరొచ్చినా సహించబోమని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీ-నోయల్ బారో తేల్చిచెప్పారు. ఫ్రాన్స్ ఇంటర్ రేడియో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఐరోపా దేశాల సరిహద్దుల సార్వభౌమత్వాన్ని ఎవరు ఉల్లంఘించినా.. ఊరుకునేది లేదని స్పష్టంచేశారు. గ్రీన్‌ల్యాండ్‌పై ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఆయన స్పందిస్తూ.. "మాది బలమైన ఖండం. డెన్మార్క్‌లో 600 ఏళ్ల నుంచి భాగమైన గ్రీన్‌ల్యాండ్‌ను.. పనామా కాలువను అమెరికా ఆక్రమించుకొంటుందంటే నేను విశ్వసించను" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై పనామా విదేశాంగ మంత్రి జావిర్ మార్టినేజ్ స్పందించారు. పనామా కాల్వను తమ దేశం మాత్రమే నియంత్రించగలదని.. భవిష్యత్‌లో కూడా అదే కొనసాగుతుందని స్పష్టంచేశారు. గ్రీన్‌ల్యాండ్ ప్రధాని మెటే ఫ్రెడెరిక్సన్ మాట్లాడుతూ.. అమెరికా-గ్రీన్‌ల్యాండ్ మధ్య ఆర్థిక యుద్ధాలు తగదని హితవు పలికారు. కాగా.. ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ప్రస్తుతం గ్రీన్‌ల్యాండ్ పర్యటనలో ఉండటం గమనార్హం..!

### హమాస్‌కు ట్రంప్ వార్నింగ్

ఇజ్రాయెల్-హమాస్ పోరుపైనా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించేలోపు.. హమాస్ తన చెరలో ఉన్న బందీలను విడుదల చేయాలని తేల్చిచెప్పారు. లేనిపక్షంలో హమాస్‌కు నరకం చూపిస్తామని, చరిత్రలో ఎన్నడూ చూడని పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

### ప్రపంచ యుద్ధానికి సంకేతమా?

ట్రంప్ వ్యాఖ్యలు, ఆయా దేశాల ప్రతిస్పందనలతో అమెరికా-ఐరోపా మధ్య దూరం పెరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే.. మరో ప్రపంచ యుద్ధానికి దారి తీసే ప్రమాదాలు లేకపోలేదని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో రష్యా నుంచి వలస వచ్చిన గోంబర్గ్ అనే యూదు జాతీయుడు 'ఔట్‌లైన్ ఆఫ్ పోస్ట్‌వార్ న్యూ వరల్డ్ మ్యాప్' పేరుతో 1942 ఫిబ్రవరి 25న ఓ పటాన్ని చిత్రీకరించారు. తర్వాతి కాలంలో ఇది పాపులర్ కావడం విశేషం..! ఈ మ్యాప్‌లో కెనెడా, మెక్సికో, గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో ఓ భాగంగా పేర్కొన్నారు. తాజాగా ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు ఈ మ్యాప్‌నకు అనుగుణంగా ఉన్నాయనే ప్రచారం సాగుతోంది.

### గ్రీన్‌ల్యాండ్ ఎందుకు?

డెన్మార్క్‌లో స్వయం ప్రతిపత్తి గల ప్రాంతంగా ఉన్న గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికాకు చెందిన భారీ అంతరిక్ష కేంద్రం(తులె ఎయిర్‌బేస్) ఉంది. గ్రీన్‌ల్యాండ్ మీదుగానే ఉత్తర అమెరికా నుంచి ఐరోపాకు వెళ్లడం దగ్గరి దారిగా చెబుతారు. ఈ ద్వీపంలో అత్యధిక స్థాయిలో ఖనిజ సంపద, చమురు నిల్వలున్నాయి. గ్రీన్‌ల్యాండ్‌పై అమెరికా కన్నేయడం ఇది మొదటిసారి కాదు. 1860ల్లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఆండ్రూ జాన్సన్ కూడా గ్రీన్‌ల్యాండ్‌పై పేచీపెట్టారు. ట్రంప్ కూడా 2019లో గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాకు అమ్మేయాలంటూ ఆఫరిచ్చారు. గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో కూడా భారీ ఎత్తున పెట్రోలియం నిక్షేపాలున్నాయి. పెట్రోలియం వనరులున్న జలభాగాల్లో ఇది ప్రపంచంలోనే 9వ అతి పెద్దది.

## లోకం తీరు




## కెనడా ప్రధాని రేసులో అనితా ఆనంద్!



న్యూఢిల్లీ, జనవరి 8: కెనడా ప్రధాన మంత్రి రేసులో ఆ దేశ రవాణా మంత్రి, భారత సంతతి మహిళ అనితా ఆనంద్ ముందున్నారు. జస్టిన్ ట్రూడో రాజీనామా ప్రకటన నేపథ్యంలో కెనడా తదుపరి ప్రధాన మంత్రి ఎవరు అవుతారనే చర్చ జరుగుతోంది. అనితాఆనంద్ ఆ బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయి. 2025 అక్టోబరులో లేదా అంద కు ముందు కెనడా ఫెడరల్ ఎన్నికలు జరగనున్న క్రమంలో అప్పటి వరకు కొత్త ప్రధాని తాత్కాలిక ప్రధానిగా కొనసాగుతారు. కాగా, అనితా ఆనంద్ 2019లో తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. 2019 నుంచి 2021 వరకు మంత్రిగా కూడా పనిచేశారు. అలాగే ట్రెజరీ బోర్డు అధ్యక్షురాలిగా, దేశ రక్షణ మంత్రిగానూ బాధ్యతలు నిర్వహించారు.

## నా కొడుకు మాట పట్టించుకోవద్దు

- అతడో మామూలు మనిషి
- ఎలాన్ మస్క్ తండ్రి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 8: టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఇతర దేశాల రాజకీయాల్లో జోక్యం చేసుకోవడంపై తప్పుపడుతూ ఆయన తండ్రి ఎర్రల్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు, ట్వీట్లను పట్టించుకోవద్దని పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. "ఎలాన్ చెప్పిన మాటలను ప్రజలు వినిపించుకోవద్దు. అతడో మామూలు మనిషి. ఎలాన్ మస్క్ వద్ద బాగా డబ్బు ఉంది కాబట్టి అతడు చెప్పిన విషయాలను చాలా మంది రీట్వీట్ చేస్తారు. నేనైతే అలా చేయను" అని ఎర్రల్ పేర్కొన్నారు. ఎలాన్ మస్క్ ఆయన తండ్రి ఎర్రల్ మస్క్ మధ్య తీవ్రమైన అభిప్రాయభేదాలున్నాయి.

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

- వారం పాటు రూ.1.5 లక్షల వరకు చికిత్స ఖర్చును కేంద్రం భరిస్తుంది : గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 8: రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్స పథకం ఇక దేశమంతా అమలవుతుందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పటి వరకు ఆరు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన ఈపథకాన్ని అన్ని రాష్ట్రాలకూ విస్తరించనున్నామని చెప్పారు. ఏడు రోజుల పాటు రూ.లక్షన్నర వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. ఆస్పత్రిలో చేరి, ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు పోలీసులకు సమాచారంఅందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 'హిట్ అండ్ రన్' (గుర్తుతెలియని వాహనాలు ఢీకొన్న) కేసుల్లో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల నష్ట పరిహారం ఇస్తామని గడ్కరీ తెలిపారు. మంగళవారం ఢిల్లీలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రవాణా శాఖ మంత్రులు, కార్యదర్శులతో సమావేశం అనంతరం నగదురహిత చికిత్స పథకాన్ని ప్రకటించారు. గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో లక్షా 80 వేల మంది చనిపోయారని చెప్పారు. ఇందులో 30 వేల మంది హెల్మెట్లు ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారన్నారు. 66 శాతం ప్రమాదాల్లో బాధితులు 18 నుంచి 34 ఏళ్లలోపు వయస్కులని వివరించారు. విద్యాసంస్థల లోపలికి వెళ్లే, బయటికొచ్చే ప్రదేశాల వద్ద సరైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల జరిగిన ప్రమాదాల్లో 10 వేల మంది పిల్లలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ బస్సులు, ఆటోల ప్రమాదాలకు కారణాలను గుర్తించామని, వాటిని నివారించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోడ్డు భద్రత అంశంపై రాష్ట్రాల మంత్రులు, కార్యదర్శులతో చర్చించామన్నారు. భారీ వాహనాలకు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఎమర్జెన్సీ బ్రేకింగ్, డ్రైవర్ కునికిపాట్లు పడుతుంటే హెచ్చరించే వ్యవస్థ వంటి వాటిని తప్పనిసరి చేస్తామని తెలిపారు. కాగా, రోడ్డు భద్రతను పెంపొందించేందుకు కేంద్రం రూ.4,500 కోట్లతో దేశ వ్యాప్తంగా డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలు, ఆటోమేటెడ్ టెస్టింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది.

# బెదిరించింది విక్రాంత్‌రెడ్డి!

- వాటాలు రాయకపోతే కుటుంబమంతా జైలుకు పోతారన్న వైవీ కుమారుడు!
- ఈడీకి వెల్లడించిన కేవీ రావు

(కాకినాడ/హైదరాబాద్-ఆంధ్రజ్యోతి)

కాకినాడ సీపోర్టులో బలవంతపు వాటాల బదిలీ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి.. నిందితులుగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, అరబిందో శరత్‌చంద్రారెడ్డిని ఇప్పటికే విచారించింది. తాజాగా ఈ కేసులో బాధితుడైన కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ (కేపీసీఎల్) చైర్మన్ కర్నాటి వెంకటేశ్వరరావు(కేవీ రావు)ను బుధవారం హైదరాబాద్‌లో 8 గంటలకుపైగా ప్రశ్నించింది. అనేక కోణాల్లో 12 కీలక ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టింది. ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని విక్రాంత్‌రెడ్డి, విజయసాయిరెడ్డి తననెలా బెదిరించి వేధించారో.. వాటాలు కొట్టేశారో రావు వివరించారు. వాటాలకు సంబంధించి జరిగిన ఆర్థిక లావాదేవీలకు ఆధారాల గురించి ఈడీ ఆరా తీసింది. సదరు ఆధారాలతో పాటు బలవంతపు ఒప్పంద పత్రాలు, ఇతర ఫైళ్లను ఆయన అందజేశారు. మరింత లోతుగా ప్రశ్నించేందుకు మరోసారి రావలసి ఉంటుందని ఈడీ ఆయనకు తెలిపింది. తనకు కొద్దిగా సమయం కావాలని, వ్యక్తిగత పనులున్నాయని ఆయన బదులిచ్చారు. ఈలోపు ఈడీకి ఏ సమాచారం కావలసినా తన కార్యాలయ ప్రతినిధుల ద్వారా పంపుతానని తెలిపారు.

### వాటాలు రాయాలంటూ ఎవరొచ్చారు..?

విచారణ సందర్భంగా.. కాకినాడ సీపోర్ట్స్‌లో మీకున్న వాటాలను బలవంతంగా ఎవరు రాయించుకున్నారని ఈడీ కేవీరావును ప్రశ్నించింది. 'విక్రాంత్‌రెడ్డి, విజయసాయిరెడ్డి ఎవరో మీకు తెలుసా.. విఎమల్ని ఏయే రూపాల్లో బెదిరించారు' అని ఆరా తీసింది. కేవీరావు ఎవరో తనకు తెలియదని విజయసాయిరెడ్డి ఇటీవల విచారణ సందర్భంగా చెప్పిన విషయాన్ని ఈడీ ప్రస్తావించింది. అది అబద్ధమని ఆయన స్పష్టం చేశారు. 'అది ఎంతవరకు నిజం..? వాటాల విలువను తగ్గించేసి మీకు చెల్లించిన డబ్బును ఎవరు ఇచ్చారు..? ఎవరి పేరుతో మీ ఖాతాలకు ఆ డబ్బు బదిలీ అయింది.. ఆ డబ్బు ఎక్కడి నుంచి మీకు చేరింది..? సంతానం ఆడిట్ కంపెనీ డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసిన విషయం మీ దృష్టికి ఎప్పుడు వచ్చింది..? సీపోర్టు, కాకినాడ సెజ్‌లలో మీ వాటాలను ఎవరు ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరించి రాయమంటే రాసిచ్చారు? ఈ రెండు కంపెనీల్లో మొత్తం మీ వాటాల విలువ ఎంత.. మీకు చెల్లించింది ఎంత' అని ఈడీ అధికారులు అడిగారు. తనను బెదిరించి, భయపెట్టి, కుటుంబాన్ని జైలుకు పంపుతామని బెదిరించి వాటాలను బలవంతంగా రాయించుకున్నారని రావు సమాధానమిచ్చారు. తాను చెప్పిన అంశాలకు ఆధారాలు కూడా సమర్పించారు. సీపోర్టు, సెజ్‌లో వాటాలు రాసివ్వాలంటూ విఎమ్మల్ని ఎవరు కలిశారని ఈడీ ప్రశ్నించింది. 'జగన్ సీఎం అయిన కొన్ని నెలల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి నాకు.. చెన్నైకి చెందిన సంతానం కంపెనీతో సీపోర్టులో జరిగిన వ్యాపార లావాదేవీలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహిస్తున్నామని సమాచారం వచ్చింది. ఆ తర్వాత ముంబైకు చెందిన మరో కంపెనీతోను ఆడిట్ అని చెప్పారు. ఏ తప్పిదాలూ లేకుండా పక్కాగా పన్నులు చెల్లిస్తూ సజావుగా జరుగుతున్న వ్యాపారంపై ఇలా జరుగుతుండడంతో నాకు అనుమానం వచ్చింది. అయినా సహకరించి.. అడిగిన ఫైళ్లన్నీ ఇచ్చాం. కేఎస్‌పీఎల్ రాష్ట్రప్రభుత్వానికి రూ.994 కోట్లు ఎగ్గొట్టినట్లు నివేదికలో తేల్చి పథకం ప్రకారం వాటాలపై కన్నేశారు. అదే సమయంలో నాకు విజయసాయిరెడ్డి ఫోన్ చేసి వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డిని కలవమన్నారు' అని వెల్లడించారు.

### జగన్ ఆదేశమంటూ విక్రాంత్‌రెడ్డి భయపెట్టారు!

ఇటీవల విచారణ సందర్భంగా తనకు కేవీ రావు ఎవరో తెలియదని విజయసాయిరెడ్డి తమకు చెప్పిన విషయాన్ని ఈడీ అధికారి ప్రస్తావించగా.. అదంతా అబద్ధమని రావు బదులిచ్చారు. 'విజయసాయిరెడ్డి చెప్పిన తర్వాత విక్రాంత్‌రెడ్డి ఇంటికి వెళ్తే.. ప్రభుత్వానికి వెయ్యి కోట్లు ఎగ్గొట్టానంటూ నివేదిక చూపించారు. కుటుంబమంతా జైలుకు వెళ్లే పరిస్థితి ఉందని, అలా జరగకూడదంటే కేఎస్‌పీఎల్‌లో వాటాలన్నీ తమకు రాసిచ్చేయాలని ఆయన బెదిరించారు. నేనే తప్పూ చేయలేదని చెప్పినా ఇది సీఎం జగన్ ఆదేశమని విక్రాంత్ భయపెట్టారు జగన్ దృష్టికి తీసుకెళ్దామని ప్రయత్నించినా.. ఇదంతా నడిపించింది ఆయనే కావడంతో.. నా మాట వినిపించుకోరని అర్థమైంది. చేసేదిలేక 2020 జూలైలో వాటాల మార్పిడిపై సంతకం చేశా'నని కేవీరావు తెలిపారు.

### జైలుకు పంపుతామన్నారు..!

కాకినాడ ఎస్ఈజెడ్‌లో మీ వాటాను బెదిరించి లాగేసుకుంది ఎవరు.. విక్రాంత్‌రెడ్డితోపాటు ఇంకా ఎవరైనా ఉన్నారా.. వాటాలు ఎలా లాక్కున్నారని ఈడీ కేవీ రావును ప్రశ్నించింది. ఇక్కడ కూడా విక్రాంత్‌రెడ్డి తనను జైలుకు పంపుతానని బెదిరించినట్లు ఆయన తెలిపారు. వాటాలు రాయించుకునేటప్పుడు ఎవరెవరు హాజరయ్యారని అడుగగా.. విక్రాంత్‌రెడ్డి బెదిరించి అరబిందో ప్రతినిధుల సమక్షంలో వాటాలు కొట్టేశారని చెప్పారు.

## హెల్మెట్ ధారణలో పురోగతి కనిపిస్తోంది

- అవగాహన కార్యక్రమాలను కొనసాగించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించే విషయంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తమ ఆదేశాల అములులో పురోగతి కనిపిస్తోందని, ప్రస్తుతం ప్రతీ 10 మంది ద్విచక్రవాహనదారుల్లో ముగ్గురు హెల్మెట్ ధరిస్తున్నారంటూ సంతృప్తి వ్యక్తం చేసింది. గత 20 రోజుల్లో రూ. 95 లక్షలు చలాన్లు రూపంలో వసూలు చేశారని, చలాన్లు విధించడంలో, పెండింగ్ చలాన్లు వసూలులో కూడా పురోగతి ఉందని పేర్కొంది. మోటార్ వాహనాల చట్టనిబంధనలు అతిక్రమించేవారిపై తీసుకొనే చర్యలు, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే నష్టాలపై పత్రికలు, టీవీల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వానికి మరోసారి స్పష్టం చేసింది. ఈ-చలాన్ యాప్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించింది. ఇతర వివరాలన్నిటితో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనంఉత్తర్వులు ఇచ్చింది. కేంద్ర మోటార్ వాహన సవరణ చట్టం నిబంధనలు అమలుకావడం లేదంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో దాఖలు చేసిన పిల్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు చలాన్లు విధిస్తున్నారన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసుల తనిఖీలు విజయవాడకే పరిమితం అయ్యాయన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. రాష్ట్ర వాప్తంగా పెండింగ్ చలాన్ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని కోరింది.

## ఆ పోలీసుల పేర్లు డైరీలో రాసుకోండి

- వారితోనే మీకు సెల్యూట్ కొట్టిస్తా!
- నెల్లూరు వైసీపీ నేతలవద్ద జగన్ వ్యాఖ్యలు
- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో భేటీ
- ఒక్కొక్కరితో 3 నిమిషాలు మాట్లాడిన అధినేత....విడివిడిగా వారందరితోనూ సెల్ఫీలు

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి ) : రాష్ట్ర పోలీసులను ఉద్దేశించి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "పోలీసులు మీపై తప్పుడు కేసులు పెట్టి ..కొట్టి .. హింసిస్తే .. వారి పేర్లను డైరీలో రాసుకోండి .. మనం అధికారంలోకి వచ్చాక .. వారందరి సంగతి తేలుస్తా. కొట్టిన పోలీసులతోనే మీకు సెల్యూట్ కొట్టిస్తా" అని నెల్లూరు జిల్లాకు చెందిన పార్టీ నేతల వద్ద జగన్ వ్యాఖ్యానించారు. తాడేపల్లి నివాస ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో మంగళవారం, నెల్లూరు జిల్లా నేతలతో బుధవారం జగన్ సమావేశమయ్యారు. కార్యకర్తలకు అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. లోకసభ నియోజకవర్గం యూనిట్‌గా వచ్చే నెల నుంచి మూడు రోజులు పర్యటనలు చేస్తానని జగన్ ప్రకటించారు. సమావేశంలో ఒక్కొక్కరికీ సగటున మూడు నిమిషాలు సమయం ఇచ్చి వారి సమస్యలు విన్నారు. అనంతరం వారితో విడివిడిగా జగన్ సెల్ఫీలు దిగారు. నెల్లూరు నేతల భుజంపై చేయి వేసి .. భవిష్యత్తులో తోడుగా ఉంటానని చెప్పారు. అయితే, కూటమి సూపర్ సిక్స్ పథకాలపై గతంలో చేసిన ప్రసంగాన్నే తిరిగి వినిపించారు. ఆయన ఉపన్యాస ధోరణిని 'తప్పదు' అన్నట్టు నేతలు భరించినట్టు సమాచారం. కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరుగుతున్నదనీ, వచ్చే ఎన్నికల్లో తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందని చెప్పే ప్రయత్నం చేసినా..నేతలు చెవికి ఎక్కించుకోలేదని తెలిసింది. పోలీసులపై జగన్ వ్యాఖ్యలకూ పెద్దగా స్పందన కనిపించలేదని చెబుతున్నారు.

# GOVERNMENT OF INDIA
## (MINISTRY OF RAILWAYS)
### (SOUTH CENTRAL RAILWAY)
## NOTIFICATION
**(under section 20A of Indian Railways Act, 1989)**
**Secunderabad, the 30thDecember, 2024**

**Rc.No.152/2024-J** **Date: 08 -01-2025**

S.O2970(E): In exercise of the powers conferred by sub-section (1) of Section 20A of the Railways Act, 1989 (24 of 1989) (here in after referred to as the said Act), the Central Government after being satisfied that for the public purpose,the land, the brief description of which is given in the schedule annexed hear to, is required for execution of the special Railway Project , Doubling of Railway line with Electrification between Guntur - Bibinagar Stations in Guntur District in the State of Andhra Pradesh , here by declares its intension to Acquire such land.

Any person interested in the said land may, within a period of thirty(30) days from the date of publication of this notification in the official gazette, raise objections to the acquisition and use of such land for the aforesaid purpose under sub-section (1) of Section 20D of the said Act.

Every such objection, shall be made to the Competent Authority, namely Revenue Divisional Officer Guntur; Guntur District in writing and shall be set out the grounds there of and the Competent Authority and Revenue Divisional Officer, either in person or by legal practitioner and may, after hearing all such objections and after making such further enquiry, if any as the Competent Authority thinks necessary, by, order, either allow or disallow the objections.

Any order made by the Competent Authority under sub section (II) of section20D of the said act shall be final.

The land plans and other details of the land under this notification are available and can be inspected by the interested persons at the aforesaid office of the Competent Authority.

## SCHEDULE

Description of lands in acquisiton:For construction of Doubling Railway line with electrification between Guntur and Bibinagar (239 Kms) within the limits of Guntur District jurisdiction forpassengers and freight facility.,

| Sl. No. | Name of the Mandal | Name of the Village | Sl. No. | Survey No. | LPM Number | Tentative Area in Acres (LA Extent) | Tentative Area in Hectares | CLASSIFICATION |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | Medi konduru | Siri puram | 1 | 172/A | 730 | 0.04 | 0.016 | Patta Land |
| | | | 2 | 172/A | 731 | 2.17 | 0.879 | Patta Land |
| | | | 3 | 166/A | 739 | 1.76 | 0.713 | Patta Land |
| | | | 4 | 164A, 167 | 761 | 0.31 | 0.126 | Patta Land |
| | | | 5 | 164/A | 767 | 0.15 | 0.061 | Patta Land |
| | | | 6 | 161/A | 768 | 0.25 | 0.101 | Patta Land |
| | | | 7 | 161/A | 772 | 0.27 | 0.109 | Patta Land |
| | | | 8 | 143 | 857 | 0.06 | 0.024 | Patta Land |
| | | | 9 | 142/A | 884 | 0.43 | 0.174 | Patta Land |
| | | | 10 | 144/A | 885 | 0.02 | 0.008 | Patta Land |
| | | | 11 | 144/A | 886 | 0.38 | 0.154 | Patta Land |
| | | | 12 | 141/A | 889 | 0.12 | 0.049 | Patta Land |
| | | | 13 | 317/A | 2047 | 0.13 | 0.053 | Patta Land |
| | | | 14 | 156/A | 2078 | 0.16 | 0.065 | Patta Land |
| | | | 15 | 318/A | 2507 | 1.26 | 0.510 | Patta Land |
| | | | 16 | 317/A | 2517 | 0.39 | 0.158 | Patta Land |
| | | | 17 | 317/A | 2519 | 0.17 | 0.069 | Patta Land |
| | | | 18 | 317A | 2520 | 0.40 | 0.162 | Patta Land |
| | | | 19 | 322/A | 2534 | 0.39 | 0.158 | Patta Land |
| | | | 20 | 322/A | 2535 | 0.12 | 0.049 | Patta Land |
| | | | 21 | 376/A | 2664 | 0.54 | 0.219 | Patta Land |
| | | | 22 | 376/A | 2665 | 0.16 | 0.065 | Patta Land |
| | | | 23 | 376/A | 2666 | 0.28 | 0.113 | Patta Land |
| | | | 24 | 376/A | 2667 | 0.02 | 0.008 | Patta Land |
| | | | 25 | 376/A | 2668 | 0.30 | 0.122 | Patta Land |
| | | | 26 | 375/A | 2669 | 0.14 | 0.057 | Patta Land |
| | | | 27 | 375/A | 2671 | 0.15 | 0.061 | Patta Land |
| | | | 28 | 375/A,352/A | 2672 | 0.25 | 0.101 | Patta Land |
| | | | 29 | 356/A | 2673 | 0.04 | 0.016 | Patta Land |
| | | | 30 | 356/A | 2679 | 0.23 | 0.093 | Patta Land |
| | | | 31 | 357/A, 356/A | 2680 | 0.11 | 0.045 | Patta Land |
| | | | 32 | 356/A | 2683 | 0.10 | 0.041 | Patta Land |
| | | | 33 | 359/A | 2684 | 0.21 | 0.085 | Patta Land |
| | | | 34 | 359/A | 2685 | 0.09 | 0.036 | Patta Land |
| | | | 35 | 359/A | 2686 | 0.12 | 0.049 | Patta Land |
| | | | 36 | 359/A | 2687 | 0.38 | 0.154 | Patta Land |
| | | | 37 | 356/A, 352/A | 2863 | 0.06 | 0.024 | Patta Land |
| | | | 38 | 356/A, 352/A | 2864 | 0.04 | 0.016 | Patta Land |
| | | | 39 | 356/A, 352/A | 2865 | 0.21 | 0.085 | Patta Land |
| | | | 40 | 174/A | 3080 | 1.46 | 0.591 | Patta Land |
| | | | 41 | 141/A | 3094 | 0.29 | 0.117 | Patta Land |
| | | | 42 | 118,117,121, 119/A, 120/A, 123/A | 3002 | 2.10 | 0.851 | Patta Land |
| | | | 43 | 84 | 3191 | 0.005 | 0.002 | Patta Land |
| | | | 44 | 140/A-1B | 888 | 0.14 | 0.057 | Govt.Land |
| | | | 45 | 85 | 2308 | 0.07 | 0.028 | Govt. Land |
| | | | 46 | 319 | 2506 | 0.03 | 0.012 | Govt. Land |
| | | | 47 | 360/A | 2587 | 0.10 | 0.041 | Govt. Land |
| | | | 48 | 170/B | 728 | 0.08 | 0.032 | Govt. Land |
| | | | 49 | 378/A | 3037 | 0.03 | 0.012 | Govt. Land |
| | | | 50 | 349 | 2845 | 0.06 | 0.024 | Govt. Land |
| | | | 51 | 157/A | 774 | 0.01 | 0.004 | Govt. Land |
| | | | SUB TOTAL | | | 16.785 | 6.798 | |
| 2 | Medi konduru | VISA DALA | 1 | 19/B | 124 | 0.35 | 0.142 | Patta Land |
| | | | 2 | 18/B,19/B | 125 | 0.38 | 0.154 | Patta Land |
| | | | 3 | 17/B | 126 | 0.23 | 0.093 | Patta Land |
| | | | 4 | 17/B | 127 | 0.16 | 0.065 | Patta Land |
| | | | 5 | 13/B | 129 | 0.020 | 0.008 | Govt. Land |
| | | | SUB TOTAL | | | 1.140 | 0.462 | |
| 3 | Medi konduru | MANDA PADU | 1 | 156/B-1A | | 0.12 | 0.049 | Patta Land |
| | | | 2 | 156/B-2A | | 0.12 | 0.049 | Patta Land |
| | | | 3 | 156/B-3A | | 0.19 | 0.077 | Patta Land |
| | | | 4 | 157/B-1 | | 0.43 | 0.174 | Patta Land |
| | | | 5 | 161/B-1B | | 0.57 | 0.231 | Patta Land |
| | | | 6 | 161/B-3A | | 0.18 | 0.073 | Patta Land |
| | | | 7 | 161/B-3C | | 0.11 | 0.045 | Patta Land |
| | | | 8 | 161/B-4A | | 0.13 | 0.053 | Patta Land |
| | | | 9 | 161/B-5A | | 0.12 | 0.049 | Patta Land |
| | | | 10 | 162-2 | | 0.61 | 0.247 | Patta Land |
| | | | 11 | 170/B | | 1.170 | 0.474 | Patta Land |
| | | | 12 | 171-1B | | 0.14 | 0.057 | Patta Land |
| | | | 13 | 171-2B | | 0.22 | 0.089 | Patta Land |
| | | | 14 | 173/B-1 | | 0.33 | 0.134 | Patta Land |
| | | | 15 | 173/B-4 | | 0.50 | 0.203 | Patta Land |
| | | | 16 | 193-1 | | 0.10 | 0.041 | Patta Land |
| | | | 17 | 201/A-1 | | 0.24 | 0.097 | Patta Land |
| | | | 18 | 203/A-1A | | 0.02 | 0.008 | Patta Land |
| | | | 19 | 203/B-1 | | 0.115 | 0.047 | Patta Land |
| | | | 20 | 203/B-2 | | 0.58 | 0.235 | Patta Land |
| | | | 21 | 204/B | | 0.58 | 0.235 | Patta Land |
| | | | 22 | 205/B-1 | | 0.02 | 0.008 | Patta Land |
| | | | 23 | 205/B-2 | | 0.22 | 0.089 | Patta Land |
| | | | 24 | 217 | | 0.23 | 0.093 | Patta Land |
| | | | 25 | 218/B | | 1.07 | 0.433 | Patta Land |
| | | | 26 | 226/B | | 1.20 | 0.486 | Patta Land |
| | | | 27 | 155/B | | 0.02 | 0.008 | Govt. Land |
| | | | 28 | 161/B-1A | | 0.26 | 0.105 | Govt. Land |
| | | | 29 | 162-1 | | 0.22 | 0.089 | Govt. Land |
| | | | 30 | 171-1A | | 0.13 | 0.053 | Govt. Land |
| | | | 31 | 175/B | | 0.03 | 0.012 | Govt. Land |
| | | | 32 | 215/B | | 0.03 | 0.012 | Govt. Land |
| | | | SUB TOTAL | | | 10.005 | 4.052 | |
| 4 | TADI KONDA | BANDARU PALLI | 1 | 443/B-2 | | 0.095 | 0.038 | Patta Land |
| | | | 2 | 443/B-3 | | 0.085 | 0.034 | Patta Land |
| | | | 3 | 470/B | | 0.32 | 0.130 | Patta Land |
| | | | 4 | 471/B | | 0.01 | 0.004 | Patta Land |
| | | | 5 | 476/B | | 0.72 | 0.292 | Patta Land |
| | | | 6 | 477 | | 0.34 | 0.138 | Patta Land |
| | | | 7 | 479/B | | 0.64 | 0.259 | Patta Land |
| | | | 8 | 493 | | 0.52 | 0.211 | Patta Land |
| | | | 9 | 494/B | | 0.05 | 0.020 | Patta Land |
| | | | 10 | 495/B-1 | | 0.24 | 0.097 | Patta Land |
| | | | 11 | 496-A | | 0.50 | 0.203 | Patta Land |
| | | | 12 | 505 | | 0.10 | 0.041 | Patta Land |
| | | | 13 | 508 | | 0.01 | 0.004 | Patta Land |
| | | | 14 | 509/B | | 0.28 | 0.113 | Patta Land |
| | | | 15 | 510/B | | 0.19 | 0.077 | Patta Land |
| | | | 16 | 513/B | | 0.07 | 0.028 | Patta Land |
| | | | 17 | 542/B | | 1.05 | 0.425 | Patta Land |
| | | | 18 | 617/B-1 | | 0.15 | 0.061 | Patta Land |
| | | | 19 | 621/B | | 0.38 | 0.154 | Patta Land |
| | | | 20 | 623/B | | 0.28 | 0.113 | Patta Land |
| | | | 21 | 624/B-1 | | 0.70 | 0.284 | Patta Land |
| | | | 22 | 624/B-2 | | 0.08 | 0.032 | Patta Land |
| | | | 23 | 626/B-1 | | 0.455 | 0.184 | Patta Land |
| | | | 24 | 626/B-2 | | 0.03 | 0.012 | Patta Land |
| | | | 25 | 648/B-1 | | 0.22 | 0.089 | Patta Land |
| | | | 26 | 651-2 | | 0.19 | 0.075 | Patta Land |
| | | | 27 | 652/B | | 0.32 | 0.130 | Patta Land |
| | | | 28 | 656 | | 0.30 | 0.122 | Patta Land |
| | | | 29 | 658-2 | | 0.11 | 0.045 | Patta Land |
| | | | 30 | 658-5 | | 0.17 | 0.069 | Patta Land |
| | | | 31 | 659/B | | 0.30 | 0.122 | Patta Land |
| | | | 32 | 664/B | | 0.08 | 0.032 | Patta Land |
| | | | 33 | 665/B-1 | | 0.46 | 0.186 | Patta Land |
| | | | 34 | 665/B-2A | | 0.08 | 0.032 | Patta Land |
| | | | 35 | 665/B-2C | | 0.21 | 0.085 | Patta Land |
| | | | 36 | 666-2A | | 0.01 | 0.004 | Patta Land |
| | | | 37 | 666-2C | | 0.14 | 0.057 | Patta Land |
| | | | 38 | 445/B | | 0.06 | 0.024 | Govt. Land |
| | | | 39 | 495/B-2 | | 0.06 | 0.024 | Govt. Land |
| | | | 40 | 543/B | | 0.11 | 0.045 | Govt. Land |
| | | | 41 | 649/B | | 0.02 | 0.008 | Govt. Land |
| | | | 42 | 665/B-2B | | 0.17 | 0.069 | Govt. Land |
| | | | 43 | 666-2B | | 0.07 | 0.028 | Govt. Land |
| | | | SUB TOTAL | | | 10.370 | 4.200 | |
| 5 | GUNTUR WEST | NALLA PADU RURAL | 1 | 674-2 | | 0.20 | 0.081 | Patta Land |
| | | | 2 | 680-1 | | 0.23 | 0.093 | Patta Land |
| | | | 3 | 681-1 | | 0.32 | 0.130 | Patta Land |
| | | | 4 | 683-2 | | 0.115 | 0.047 | Patta Land |
| | | | 5 | 684-1B | | 0.05 | 0.020 | Patta Land |
| | | | SUB TOTAL | | | 0.915 | 0.371 | |
| 6 | GUNTUR WEST | CHINA PALAKA LURU | 1 | 185/B | | 1.20 | 0.486 | Patta Land |
| | | | 2 | 188-1 | | 0.44 | 0.178 | Patta Land |
| | | | 3 | 188-3 | | 0.04 | 0.016 | Patta Land |
| | | | 4 | 191-A | | 0.02 | 0.008 | Patta Land |
| | | | 5 | 223-3 | | 0.10 | 0.041 | Patta Land |
| | | | 6 | 224-3 | | 0.16 | 0.065 | Patta Land |
| | | | 7 | 242-3 | | 0.19 | 0.077 | Patta Land |
| | | | 8 | 243-C2 | | 0.33 | 0.134 | Patta Land |
| | | | 9 | 246-A3 | | 0.27 | 0.109 | Patta Land |
| | | | 10 | 246-C2 | | 0.33 | 0.134 | Patta Land |
| | | | 11 | 187 | | 0.15 | 0.061 | Govt. Land |
| | | | 12 | 188-2 | | 0.03 | 0.012 | Govt. Land |
| | | | 13 | 244 | | 0.11 | 0.045 | Govt. Land |
| | | | 14 | 251 | | 0.05 | 0.020 | Govt. Land |
| | | | SUB TOTAL | | | 3.420 | 1.385 | |
| GRAND TOTAL (1+2+3+4+5+6) | | | | | | 42.635 | 17.268 | |

**Sd/- K. SRINIVASA RAO**
COMPETENT AUTHORITY (LA)&
REVENUE DIVISIONAL OFFICER, GUNTUR

# ఇంటర్ విద్యలో సంస్కరణలు

» ఇకపై రెండో సంవత్సరంలోనే బోర్డు పరీక్షలు



ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా

అమరావతి/తాడేపల్లి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యలో విప్లవాత్మక సంస్కరణలకు ఇంటర్ బోర్డు శ్రీకారం చుట్టింది. ఒకేసారి నాలుగు కీలక మార్పులకు ప్రతిపాదనలు చేసింది. రాష్ట్ర బోర్డును దాదాపుగా సీబీఎస్ఈ తరహాలోకి మార్చేలా సంస్కరణలు తీసుకురావాలని నిర్ణయించింది. సిలబస్- పాఠ్యపుస్తకాల సవరణ, కొత్త సబ్జెక్టుల కాంబినేషన్లు, పరీక్షల విధానంలో సమూల మార్పులు, ఫస్టియర్‌లో బోర్డు పరీక్షల తొలగింపు అంశాలపై ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా బుధవారం తాడేపల్లిలోని ఆ సంస్థ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ ప్రతిపాదనలను బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, ఈ నెల 26 వరకు అభిప్రాయాలు, అభ్యంతరాలను biereforms@gmail.com మెయిల్ ఐడీకి పంపాలని కోరారు. విద్యారంగ నిపుణులతో ఓ సమావేశం నిర్వహించి ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని, ఇవి ప్రతిపాదనలు మాత్రమేనని స్పష్టం చేశారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులను కలిపేలా ఎంబైపీసీని ప్రతిపాదిస్తున్నామని, దీన్ని తీసుకున్నవారు ఇంజనీరింగ్, వైద్య వృత్తి రెండువైపులా వెళ్లొచ్చని చెప్పారు. ప్రస్తుతం గణితం 1ఏ, 1బీ, 2ఏ, 2బీలుగా ఉండగా ఒకే సబ్జెక్టుగా మారుస్తామని, బోటనీ, జువాలజీని కలిపి బయాలజీ సబ్జెక్టుగా మారుస్తామని, ఒక్కటే పేపర్ ఉంటుందని స్పష్టం చేశారు. ఇకపై ఫస్టియర్, సెకండియర్‌లో ఏటా 500 మార్కులతో పరీక్షలు ఉంటాయన్నారు. ప్రతి సబ్జెక్టులోనూ ప్రాక్టికల్స్/అంతర్గత మార్కుల విధానం తెస్తామని చెప్పారు. ఇంగ్లిష్‌లో 20 మార్కులు, ఎంపిక చేసుకునే రెండో సబ్జెక్టులో 20, గణితం/ బయాలజీలో 20, కెమిస్ట్రీలో 30, ఫిజిక్స్‌లో 30మార్కులు చొప్పున ఇంటర్నల్స్/ప్రాక్టికల్ మార్కులు ఉంటాయని వివరించారు. మొత్తంగా థియరీలో 380 మార్కులు, ఇంటర్నల్స్‌కు 120 మార్కులు ఉంటాయని తెలిపారు. ఆర్ట్స్ గ్రూపుల్లోనూ ఇంటర్నల్స్ ఉంటాయన్నారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో 500 మార్కుల చొప్పున పరీక్షలు జరిగినా, రెండో సంవత్సర పరీక్షలు మాత్రమే బోర్డు నిర్వహించాలని ప్రతిపాదించినట్లు శుక్లా చెప్పారు. ఫస్టియర్ పరీక్షలను కాలేజీలు సొంతగా నిర్వహించుకుంటాయన్నారు. మెయిన్ సబ్జెక్టుల్లో ఒకదానిలో ఫెయిల్ అయినా, ఆప్షనల్ సబ్జెక్టులో పాస్ అయితే ఇంటర్ ఉత్తీర్ణత సాధించినట్లు పరిగణిస్తామని చెప్పారు. ఆప్షనల్ సబ్జెక్టుతో కలిపి 5 సబ్జెక్టుల్లో తప్పనిసరిగా పాస్ కావాలన్నారు. సంస్కరణలు 2025-26లో ఫస్టియర్‌కు, 2026-27లో సెకండియర్‌కు అమల్లోకి వస్తాయని.. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, స్టేక్‌హోల్డర్స్ నుంచి వచ్చిన సూచనల ఆధారంగానే తుది నిర్ణయం ఉంటుందని, ఇప్పుడే ఫస్టియర్ పరీక్షలు రద్దు చేసినట్లు కాదన్నారు.

## 17 వర్సిటీలకు సెర్చ్ కమిటీల ఏర్పాటు

» వీసీల నియామకానికి వీలైనంత త్వరగా పేర్లు సిఫారసు

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్ల నియామకానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీలను నియమించింది. 17 వర్సిటీలకు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలు మూడు పేర్లను ప్రభుత్వానికి సిఫారసు చేస్తాయి. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



## బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి ఛైర్మన్‌గా రంగనాథ్



విజయవాడ(ఆటోనగర్), జనవరి8 (ఆంధ్రజ్యోతి): బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి క్యాపిటల్ సెంటర్ ఛైర్మన్‌గా గుడివాడ అమ్మ కన్‌స్ట్రక్షన్స్ అధినేత మాటూరి రంగనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నాగమల్లేశ్వరరావు ప్రకటించారు. బుధవారం విజయవాడలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. ప్రధాన కార్యదర్శిగా ఎస్.సత్యనారాయణ, కోశాధికారిగా కె.పి.కిరణ్, ఉపాధ్యక్షులుగా పట్నాయక్, రాజేష్, సంయుక్త కార్యదర్శిగా వి.వెంకట నారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగ సమస్యల పట్ల సానుకూలంగా ఉండటం శుభ సూచకమన్నారు.

## డయాఫ్రం వాల్‌పై నేడే కీలక భేటీ

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ నిర్మాణానికి సంబంధించి గురువారం కీలక సమావేశం జరుగనుంది. ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సర్ వాడకంపై అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ (ఐఈపీ) ఈ సందర్భంగా తన అభిప్రాయం వెల్లడించనుంది. సాయంత్రం ఆరున్నర గంటలకు డేవిడ్ బ్రియాన్ పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో (అమెరికా), సీన్ హించ్‌బెర్గర్, చార్లెస్ రిచర్డ్ డొనెల్లీ(కెనడా)తో కేంద్ర జల శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కాంట్రాక్టు సంస్థలు బావర్, మేఘా ఇంజనీరింగ్, కెల్లర్ ప్రతినిధులు వర్చువల్‌గా భేటీ అవుతారు. విజయవాడ నుంచి జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ప్రభుత్వ సలహాదారు-ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరవుతారు. మరోవైపు.. పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యులు శనివారం (11న) పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో రెండ్రోజులు పర్యటిస్తారు.

## విశాఖ సెంట్రల్ జైలులో మరో సెల్‌ఫోన్

» ఇప్పటి వరకు 4 స్వాధీనం

ఆరిలోవ (విశాఖపట్నం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్ర కారాగారంలో మరో సెల్‌ఫోన్ లభ్యమైంది. దీంతో ఇప్పటివరకు దొరికిన సెల్‌ఫోన్ల సంఖ్య నాలుగుకు చేరింది. గత నెల 31న చేపట్టిన తనిఖీల్లో రెండు, ఈ నెల మూడో తేదీన ఒకటి లభ్యమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జైలులో ఇంకా ఎన్ని సెల్‌ఫోన్లు ఉన్నాయో వెలికి తీసేందుకు సిబ్బంది తనిఖీలు ముమ్మరం చేశారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా జైలు సిబ్బంది మంగళవారం గంగా బ్లాక్ వద్ద పరిశీలిస్తుండగా పాత వంటశాల వెనుక భాగంలోని కాలువలో ఒక సెల్‌ఫోన్ కనిపించిందని జైలు డీఎస్పీ జవహర్‌బాబు తెలిపారు.

## ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా ఐవీ సుబ్బారావు

విజయవాడ (ధర్నాచౌక్), జనవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జర్నలిస్టు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి పోరాడాలని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడిగా ఐవీ సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమానికి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ న్యాయవ్యవస్థలోనూ జర్నలిస్టులపై ప్రతికూల భావనలు వ్యక్తం కావడం బాధాకరమన్నారు. సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## పేదలు బిల్లు కట్టకపోతే ఫీజులు పీకుతారు!

» రూ.కోట్లలో బకాయిలు పెడితే వసూలు చేయరా?

» టీడీపీ గ్రీవెన్స్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పేదలు ఒక నెల కరెంట్ బిల్లు కట్టకపోతే ఫీజులు పీక్కెళ్లే అధికారులు.. గుంటూరు జిల్లా చినకాకానిలోని టెక్స్‌టైల్స్ కంపెనీ రూ.కోట్లలో బకాయి పెట్టి, మూతపడినా, బిల్లు వసూళ్లలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో డిస్కంకు భారీ నష్టం జరిగిందని టీడీపీ గ్రీవెన్స్‌లో కె.వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి పీతల సుజాత, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ బాలాజీ, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అర్జీలు స్వీకరించారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూమిని వైసీపీ నేతలు కబ్జా చేసి, తమపై దౌర్జన్యం చేస్తున్నారని, వారి నుంచి ప్రాణహాని ఉందని నందివెలుగుకు చెందిన తోటకూర కోటేశ్వరరావు మొరపెట్టుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
**రహదారులు మరియు భవనముల శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

సుమారు రూ.90.00 లక్షల విలువ గల పనికి పల్నాడు జిల్లాలో కల్వర్టు మరమ్మతుల పనికి నిట్ నెం.SE/R&B/GNT/79/2024-25, తేది:03.01.2025 ద్వారా టెండర్లు ఆహ్వానించటమైనది. పూర్తి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.tender.apeprocurement.gov.in నందు చూడగలరు. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది: 16.01.2025 సా.3.30గం. వరకు. ఫోన్.9491063144

సం/- పర్యవేక్షక ఇంజనీరు (ర.భ). వలయం గుంటూరు
DIPR RO.No: 15090/CL/ADVT/1/1/2021-22, తేది: 08.01.2025

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
NIT No. 38/MAU61-USI0HB/17/2024-HB/2nd Call Dt.07.01.2025
**E PROCUREMENT SHORT TENDER NOTICE (SECOND CALL)**

**Name of Work:** "Supply and Installation of VRV Daikin Air Condition System of ODU 12 HP along with IDU's of Various capacities in the Peshi and its connected areas of Hon'ble Minister for Human Resources Development, IT Electronics & Communication and RTG in Building-4 at AP Secretariat, IGC, Velagapudi"- **Estimate Cost Rs.11,00,000/-**
The bid can be downloaded on AP e-procurement portal from **09.01.2025 to 16.01.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **16.01.2025 up to 15.00 Hrs**, Technical bid opening **16.01.2025 @ 16.00 Hrs**. For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Rc.No.GE-CPROORSLT(DPRP)/2/2024-DGE, తేది: 07.01.2025.
2024-25 విద్యాసంవత్సరానికి SSC పబ్లిక్ పరీక్షలు, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మరియు ఇతర చిన్న పరీక్షల కొరకు ప్రీ ఎగ్జామినేషన్ మరియు పోస్ట్-ఎగ్జామినేషన్ డేటా ప్రాసెసింగ్, రిజల్ట్ ప్రాసెసింగ్, డిజిటైజేషన్ మరియు ఇతర పనుల కొరకు కంప్యూటర్ సంస్థ ఎంపిక కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుతున్నవి. అంచనావిలువ: రూ.1,65,00,000/-. ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ నుండి టెండరు డాక్యుమెంట్ కొనుగోలు కాలం: 10.01.2025న ఉ.10 గం.నుండి 24.01.2025 మ.12.00 గం.వరకు. తదుపరి వివరాల కొరకు దర్శించగలరు:www.apeprocurement.gov.in ఫోన్ నం: 9177002458.

సం/- డైరెక్టర్, గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్.
DIPR RO.No.15092/CL/ADVT/1/1/2021-22, Dt: 08.01.2025

**ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్**
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ)
O/o చీఫ్ ఇంజనీర్-II, APIIC టవర్స్, ప్లాట్ నం.1, IT పార్క్, మంగళగిరి, గుంటూరు (జిల్లా), ఆం.ప్ర. - 522 503
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**

సంక్షిప్త టెండరు ప్రకటన నం.19/CE-C/APIIC/2024-25 తేది: 07.01.2025
**సంక్షిప్త టెండరు ప్రకటన నం.19:** రెండు (02) సంవత్సరాల కొరకు గుంటూరు జిల్లా, మంగళగిరి, ఐటి పార్క్ వద్ద APIIC టవర్, 9వ, 10వ, 11వ, 12వ అంతస్తులు మరియు కామన్ ఏరియాల వార్షిక నిర్వహణ.(2వ పిలుపు) **ECV: రూ.60,85,125.00.** టెండరు సంక్షిప్త ప్రకటన నం.19 బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది 07.01.2025 రా.08.00 గం. & **బిడ్ దాఖలుకు చివరి తేది:** 16.01.2025 మ.3.00 గం. వరకు.సంక్షిప్త టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లను వెబ్‌సైట్ www.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

సం/- చీఫ్ ఇంజనీర్-C, APIIC Ltd., మంగళగిరి
DIPR R.O.No.3446PP/CL/ADVT/1/1/2021-22, Dt.:08.01.2025

**ది కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి లిమిటెడ్**
**పాల ఉత్పత్తుల కర్మాగారము : విజయవాడ-9 రి.నెం.2001/355**
టెండరు నెం.9/ఎడ్మిన్/ఎ19/2025. **టెండరు నోటీసు** తేది : 08-01-2025

ది. 01-02-2025 నుండి ది. 31-01-2028 వరకు 3 సం.లకు పామర్రు, గుడ్లవల్లేరు, హనుమాన్‌జంక్షన్, తిరువూరు, చిల్లకల్లు, గన్నవరం & మైలవరం క్లస్టర్లు ఏరియాలలో, 3 & 4 చక్రములు ట్రక్కు ఆటోల ద్వారా పాలు సరఫరా చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. వీనికి రూ. 2,000/-లు ధారవత్ సొమ్ముగా & టెండర్ ఫారం రూ. 2000/-లు చెల్లించి ది. 10-1-2025 నుండి ది. 20-01-2025 సాయంత్రం 4 గంటల వరకు మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం విజయవాడ పనిచేయువేళలలో పొందవచ్చును. సీల్డ్ టెండర్లు ది. 21-01-2025 మధ్యాహ్నం 12 గంటల వరకు తీసుకొని తిరిగి ఆదే రోజు మధ్యాహ్నం 2 గంటల వరకు తెరవబడును.

సం/- మేనేజింగ్ డైరెక్టర్

**ANDHRA PRADESH TOURISM AUTHORITY (APTA)**
**GOVERNMENT OF ANDHRA PRADESH**
5th Floor, Stalin Corporate Building, Auto Nagar, Vijayawada

**Expression of Interest (EoI) for Empanelment of Event Management Agencies for AP Tourism**

Andhra Pradesh Tourism Authority (APTA) wishes to engage the services of eligible competent event management agencies for organizing and managing events, roadshows, fairs, etc. from conception to completion stage. In this regard, APTA is inviting Expression of Interests (EoIs) for empanelment of reputed agencies/organizations to perform various activites organsied by AP Tourism.

Expression of interest and other details can be downloaded from website www.aptourism.gov.in from 09.01.2025 onwards.

The last date for submission of response to the Expression of Interest is mentioned in the EOI Document

CEO, APTP
DIPR RO.No.3447PP/CL/ADVT/1/1/2021-22, Dt: 08.01.2025

**AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)**
54-15-1, Venkateswara Nagar, Beside Yalamanchili Complex, Sonovision Building, Ring Road, Vijayawada, NTR Dist, Andhra Pradesh-520008.
Email: amaravati-adc@adcl.in, ccdmc.amaravati@gmail.com, Website: https://adcl.in
CIN Number: U93000AP2015SGC105535

**E-PROCUREMENT TENDER NOTICE**

**NIT No. 301/ADCL/IPD/2024-25; Dated: 08.01.2025**
**Name of Work:** "WORLD BANK & ADB financed Amaravati Capital City Development Program related "Balance Works of (A) Widening and deepening of Kondaveeti Vagu (Ananthavaram to Vundavalli, 23.60 km); (B) Widening and deepening of Pala Vagu (Dondapadu to Krishnayapalem, 16.70 km) and (C) Construction of Sakhamuru Reservoir (0.03 TMC) in Amaravati Capital City on Lump sum contract (Percentage Tender) including DLP of 2 Years (Package I)." **Estimated Contract Value: Rs. 462.26 Crores.**

**NIT No. 302/ADCL/IPD/2024-25; Dated: 08.01.2025**
**Name of Work**: "WORLD BANK & ADB financed Amaravati Capital City Development Program related "Balance Works of (A) Construction of Gravity Canal (7.83 km) and (B) Construction of Krishnayapalem Reservoir (0.1 TMC) in Amaravati Capital City on Lump sum contract (Percentage Tender) including DLP of 2 Years (Package II)." **Estimated Contract Value: Rs.303.73 Crores.**

**NIT No. 308/ADCL/IPD/2024-25; Dated: 08.01.2025**
**Name of Work**: "WORLD BANK & ADB financed Amaravati Capital City Development Program related "Construction of Balance Smart Trunk Infrastructure with Roads, Strom Water Drains, Water Supply Network, Sewerage Network, Utility Ducts For Power & ICT, Reuse Water Line, Pedestrian Tracks, Cycle Track, Avenue Plantation & Street Furniture etc., in E8 Road in Amaravati Capital City on Lump sum contract (Percentage Tender), Andhra Pradesh including DLP of 2 Years (Package VIII)." **Estimated Contract Value: Rs. 372.23 Crores.**

**NIT No. 310/ADCL/IPD/2024-25; Dated: 08.01.2025**
**Name of Work:** "WORLD BANK & ADB financed Amaravati Capital City Development Program related "Construction of Balance Smart Trunk Infrastructure with Roads, Strom Water Drains, Water Supply Network, Sewerage Network, Utility Ducts For Power & ICT, Reuse Water Line, Pedestrian Tracks, Cycle Track, Avenue Plantation & Street Furniture etc., in E9 Road in Amaravati Capital City on Lump sum contract (Percentage Tender), Andhra Pradesh including DLP of 2 Years (Package X)." **Estimated Contract Value: Rs. 419.96 Crores.**

**NIT No. 311/ADCL/IPD/2024-25; Dated: 08.01.2025**
**Name of Work**: "WORLD BANK & ADB financed Amaravati Capital City Development Program related "Construction of Balance Smart Trunk Infrastructure with Roads, Strom Water Drains, Water Supply Network, Sewerage Network, Utility Ducts For Power & ICT, Reuse Water Line, Pedestrian Tracks, Cycle Track, Avenue Plantation & Street Furniture etc., in E14 Road in Amaravati Capital City on Lump sum contract (Percentage Tender), Andhra Pradesh including DLP of 2 Years (Package XI)." **Estimated Contract Value: Rs. 241.67 Crores.**

**NIT No. 312/ADCL/IPD/2024-25; Dated: 08.01.2025**
**Name of Work**: "WORLD BANK & ADB financed Amaravati Capital City Development Program related "Construction of Balance Smart Trunk Infrastructure with Roads, Strom Water Drains, Water Supply Network, Sewerage Network, Utility Ducts For Power & ICT, Reuse Water Line, Pedestrian Tracks, Cycle Track, Avenue Plantation & Street Furniture etc., in N12 Road in Amaravati Capital City on Lump sum contract (Percentage Tender), Andhra Pradesh including DLP of 2 Years (Package XII)." **Estimated Contract Value: Rs. 443.84 Crores.**

**NIT No. 313/ADCL/IPD/2024-25; Dated: 08.01.2025**
**Name of Work:** "WORLD BANK & ADB financed Amaravati Capital City Development Program related "Construction of Balance Smart Trunk Infrastructure with Water Supply Network, Sewerage Network, Utility Ducts For Power & ICT, Reuse Water Line in N6 Road (Utilities) in Amaravati Capital City on Lump sum contract (Percentage Tender), Andhra Pradesh including DLP of 2 Years (Package XIII)." **Estimated Contract Value: Rs. 183.21 Crores.**

**NIT No. 327/ADCL/IPD/2024-25; Dated: 08.01.2025**
**Name of Work**: "WORLD BANK & ADB financed Amaravati Capital City Development Program related "Construction of Balance Smart Trunk Infrastructure with Roads, Strom Water Drains, Water Supply Network, Sewerage Network, Utility Ducts For Power & ICT, Reuse Water Line, Pedestrian Tracks, Cycle Track, Avenue Plantation & Street Furniture etc., in E3 Road (Phase I) in Amaravati Capital City on Lump sum contract (Percentage Tender), Andhra Pradesh including DLP of 2 Years (Package XXVII)." **Estimated Contract Value: Rs. 364.41 Crores.**

The bid can be downloaded on AP e-procurement portal from **09.01.2025 to 31.01.2025 up to 15.30 Hrs.** Due date for submission of Bid is **31.01.2025 up to 16.00 Hrs**, Technical Bid opening is on **31.01.2025 @ 17.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.adcl.in**

Sd/- Chairperson & Managing Director, ADCL, Vijayawada

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## ట్రూడో నిష్క్రమణ

గొప్పగా ప్రారంభమై చప్పగా ముగిసిన రాజకీయ ఘట్టం కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కథ. 'పాశ్చాత్య దేశాలలో నవీన ప్రగతిశీలవాదానికి ప్రతినిధిగా జస్టిన్ ట్రూడో కంటే చెప్పదగిన నాయకుడు మరొకరు లేరు. ట్రూడో పాలన వలే మరెవ్వరి పాలన ఉపద్రవకరంగా విఫలమవలేదు' అని కెనడియన్ వ్యాఖ్యాత జోర్డాన్ పీటర్సన్ అన్నారు. ప్రధానమంత్రి పదవి, అధికార లిబరల్ పార్టీ నాయకత్వం నుంచి వైదొలగనున్నట్టు ట్రూడో సోమవారం నాడు ప్రకటించారు.

కెనడా 23వ ప్రధానమంత్రిగా నవంబర్ 2015లో అధికారం చేపట్టిన ట్రూడో తొమ్మిదేళ్లకు పైగా పాలనలో సామాజిక సంక్షేమ విధానాలకు ప్రాధాన్యమిచ్చారు. కెనడా 15వ ప్రధాని పియోర్రె ఎలియట్ ట్రూడో కుమారుడైన జస్టిన్ తన రాజకీయ జీవితంలో ఎన్నికల పరాజయమనేది ఎరుగని నేత. 2008లో తొలిసారి పార్లమెంటుకు ఎన్నికైన జస్టిన్ ట్రూడో 2013లో లిబరల్ పార్టీ నాయకత్వానికి పోటీ చేసి నెగ్గారు. 2015న నవంబర్ ఎన్నికల్లో ఆయన నాయకత్వంలో లిబరల్ పార్టీ ఘన విజయాన్ని సాధించింది. ప్రధానమంత్రిగా తన తొలి కేబినెట్‌లోనే జెండర్ సమత్వానికి ప్రాధాన్యమిచ్చారు. ఆ విధానాన్ని ఆయన చివరిదాకా కొనసాగించారు. 2019లోను, 2021లోను ఆయన నాయకత్వంలో లిబరల్ పార్టీ న్యూ డెమొక్రాటిక్ పార్టీ మద్దతుతో మైనారిటీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. గత కొద్దినెలలుగా పార్టీ నుంచి అంతర్గత ఒత్తిళ్లు, ప్రజల నుంచి నిరసనలు తీవ్రమవడంతో ట్రూడో ప్రధానమంత్రి పదవి, లిబరల్ పార్టీ నాయకత్వం నుంచి వైదొలగడానికి నిర్ణయించుకున్నారు. అక్టోబర్‌లో జరగనున్న తదుపరి పార్లమెంటరీ ఎన్నికలలో లిబరల్ పార్టీ గెలుపు అసాధ్యమనే అభిప్రాయం గట్టిగా ఉన్నది. కెనడాలో ఒక పార్టీ వరుసగా నాలుగుసార్లు అధికారంలోకి రావడమనేది చాలా అరుదు. ఆ అరుదైన చరిత్ర ఒక శతాబ్దం క్రితం మాత్రమే సంభవించింది.

కెనడాలోని సిక్కు పౌరులు 2015లో ట్రూడో విజయానికి విశేషంగా దోహదం చేశారు. ఆయన నాయకత్వంలోని మైనారిటీ ప్రభుత్వం మనుగడకు సిక్కు నాయకుల నేతృత్వంలోని న్యూ డెమొక్రాటిక్ పార్టీ గట్టి దన్నుగా ఉన్నది. ఈ కారణంగా, సొంత రాజకీయ ప్రయోజనాల కోసం ఖలిస్తానీ వేర్పాటువాదులకు మద్దతునివ్వడంలో ఆయన చూపిన అత్యుత్సాహం చివరకు భారత్‌తో దౌత్య వివాదానికి దారి తీసింది. ఆ వివాదం పార్టీలో ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసింది. భారత్‌తో అనవసర కలహానికి ట్రూడో కారకుడయ్యారన్న అభిప్రాయం కెనడా ప్రజల్లో కూడా నెలకొన్నది. భారత్‌తో దౌత్య జగడం ఆయన రాజీనామా నిర్ణయానికి దారితీసిన కారణాలలో ఒకటి.

ఈ నెల 20న అమెరికా 47వ అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న డోనాల్డ్ ట్రంప్ సైతం ట్రూడో అధికార ప్రాభవానికి గండి కొట్టారు. ట్రంప్ గతంలో అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఇరుదేశాలకు సానుకూలంగా 'ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' పునరుద్ధరించుకునే విషయమై ఆయనతో చర్చలు జరపడంలో ట్రూడో సఫలమయ్యారు. అయితే ట్రంప్ 2024 నవంబర్ అధ్యక్ష ఎన్నికలో విజయం సాధించిన తరువాత కెనడా నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే సరుకులపై 25 శాతం సుంకం విధిస్తామని ఖరాఖండీగా ప్రకటించారు. అంతేగాక కెనడా నుంచి అమెరికాకు వలసకారుల వెల్లువను అరికట్టాల్సిన బాధ్యత కూడా కెనడాదేనని ట్రంప్ నిర్దేశించారు. సుంకాల పెంపుదలపై ట్రంప్ తన వైఖరిని విడనాడని పక్షంలో కెనడా ఆర్థికవ్యవస్థ తీవ్రంగా నష్టపోతుంది. దీనిపై అన్ని రాజకీయ పక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. చర్చలు జరిపి పరిస్థితిని చక్కబరిచేందుకు ట్రూడో ప్రోటోకాల్‌కు విరుద్ధంగా అమెరికా వెళ్లి, అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా చెయ్యాలని ట్రూడోకు ట్రంప్ సూచించినట్టు కొన్ని వార్తలు కూడా వచ్చాయి. సామాజిక మాధ్యమాల్లో ట్రంప్ ఇదే చెబుతూవస్తున్నారు కూడా. సుంకాల పెంపుదల బెదిరింపుతో పాటు ఈ వెక్కిరింపు ధోరణి కెనడాలో తీవ్ర అసంతృప్తి, నిరసనలకు దారితీసింది. ట్రంప్‌ను ట్రూడో నిలువరించలేక పోతున్నారనే అభిప్రాయం కెనడాలో ఉంది. కెనడా సార్వభౌమత్వ హక్కును కాపాడడంలో ట్రూడో విఫలమవడంపై సొంత పార్టీలో అసంతృప్తి పెరిగింది. ఉరుములేని పిడుగులా డిప్యూటీ ప్రధాని క్రిస్టియా ఫ్రీలాండ్ రాజీనామా చేశారు. ట్రంప్‌తో గట్టిగా వ్యవహరించడంలో ట్రూడో విఫలమవుతున్నారంటూ ఆయన నాయకత్వ సమర్థతపై ఆమె బహిరంగంగా సందేహాలు వ్యక్తం చేశారు. క్రిస్టియా రాజీనామాతో పార్టీ నాయకత్వం, ప్రధానమంత్రి పదవి నుంచి వైదొలిగేందుకు ట్రూడో నిర్ణయించుకున్నారు. పోగుబడిన అనేక వివాదాలను, సమస్యలను ఆయన రాజీనామా పరిష్కరించగలదో లేదో చూడాలి.

---

**పెట్టుబడులను ఆకర్షించడంలో దేశీయంగా తమిళనాడు, అంతర్జాతీయంగా చైనా, సౌదీ అరేబియాల విధానాలను ఆదర్శంగా తీసుకోవాలి. విదేశీ పెట్టుబడుల ద్వారా తెలంగాణలో ఉత్పన్నమయ్యే అభివృద్ధి, ఉపాధి అవకాశాలను సమరీతిలో వికేంద్రీకరించాలి.**

## వికేంద్రీకరణతో సమ అభివృద్ధి

భారత్‌కు విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి; భారతీయ యువజనులేమో మెరుగైన విద్యకు విదేశాలకు వెళ్లుతున్నారు! ఆ విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత అక్కడే ఉపాధి అవకాశాలు అన్వేషించుకుని స్థిరపడుతున్నారు. ఈ రెండు వాస్తవాలు వర్తమాన భారతీయ సమాజ విచిత్ర వైరుధ్యాలు కావూ?

ప్రభవిస్తున్న నవ భారతంలో వాణిజ్య, పారిశ్రామిక, సేవా రంగాలలో భారీ పెట్టుబడులతో విదేశీ సంస్థలు ప్రవేశిస్తుండగా, సరైన ఉపాధి, విద్యావకాశాలు లేక భారతీయ యువత విదేశాలకు వెళ్లుతోంది. నెలకు సగటున 450 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి. ఇది, నిస్సందేహంగా భారత్ శీఘ్ర పురోగతికి ఒక సూచిక. అయితే నెలకు సగటున రెండు లక్షల మంది ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ విదేశాలకు వెళ్లవలసి రావడం తిరోగమనానికి సంకేతమనేది అవిస్మరణీయం.

**గల్ఫ్ లేఖ**

విదేశీ పెట్టుబడులను అత్యధికంగా సాధించే రాష్ట్రం గుజరాత్. అయితే అక్రమ మార్గాల్లో అమెరికాకు వెళ్లుతున్న వారిలో అత్యధికంగా ఉంటున్నవారు గుజరాతీ యువజనులే అన్నది ఒక కఠోర వాస్తవం. అత్యధిక విదేశీ పెట్టుబడులను పొందే దేశం చైనా. చైనా పౌరులు ఎవరూ ఉపాధి వలసలకు స్వదేశ సరిహద్దులు దాటి వెళ్లరు మరి.

మౌలిక సదుపాయాల వసతులతో పాటు పరిశ్రమలో పని చేయడానికి అవసరమైన మానవ వనరులు కూడ చాలా అవసరమనే విషయాన్ని భారతీయ పాలకులు విస్మరిస్తున్నారు. తమ యువతకు సాఫ్ట్‌వేర్ శిక్షణ ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలు అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థలు తమ వద్దకు వచ్చే విధంగా చేసుకోవడంలో సఫలమయ్యాయి. ఈ సాఫల్యతను ఇతర రంగాలలోనూ మరింతగా సాధించవలసిన అవశ్యకత ఉంది.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో దక్షిణాదిలో ప్రథమ స్థానం తమిళనాడుదే అని మరి చెప్పనవసరం లేదు. ఐటితో పాటు ఇతర రంగాలను ఆ రాష్ట్రం వ్యూహాత్మకంగా అభివృద్ధి




చేస్తోంది. ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రిక్ ఉత్పాదక రంగంలో విదేశీ పెట్టుబడులు సింహభాగం ఆ రాష్ట్రానికే వెళతాయి. ఈ రంగాలకు అవసరమైన నైపుణ్యతతో కూడిన మానవ వనరులను అభివృద్ధిపరచి విదేశీ సంస్థలకు అందుబాటులో ఉంచుతుంది. ఈ కారణాన శాంసంగ్‌తో సహా అనేక విదేశీ సంస్థలు తమిళనాడును ఎంచుకుంటున్నాయి. దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ వాహనాలలో దాదాపు సగం వరకు ఒక్క తమిళనాడు నుంచే వస్తున్నాయి. విద్యుత్ వాహనాల ఉత్పత్తిలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వియత్నాం కంపెనీ విన్ ఫాస్ట్ రూ. 16 వేల కోట్ల రూపాయల పెట్టుబడికి తమిళనాడునే ఎంచుకున్నది. ఈ ఒక్క పరిశ్రమతో 20 వేల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. పైగా తమిళనాడులోని విభిన్న ప్రాంతాలలో క్లస్టర్ల ఏర్పాటుతో సమ అభివృద్ధికి ఆస్కారమేర్పడుతుంది.

ఐటి నైపుణ్యత అభివృద్ధి ద్వారా అటు పెట్టుబడులు ఇటు ఉపాధి అవకాశాలను పెంపొందించిన అనుభవంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు చమురు రంగంలో పెట్టుబడులతో పాటు పెట్రో కెమికల్స్ విశ్వవిద్యాలయంపై దృష్టి పెట్టారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే అంతగా అనుకూల పరిస్థితులు లేకున్నా ఉత్తరప్రదేశ్‌కు సైతం విదేశీ పెట్టుబడులు భారీగా రావడం గమనార్హం. తెలంగాణ సైతం విదేశీ పెట్టుబడుల విషయంలో ప్రశంసనీయమైన రీతిలో ముందుకు వెళ్లుతోంది. ఖాళీ ఖజానాతో తాము అధికార బాధ్యతలు స్వీకరించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరుచు ప్రస్తావిస్తుంటారు. ఇది, స్థానిక రాజకీయ కోణంలో అనుకూలిస్తున్నా పెట్టుబడుల దృక్పథంతో పరిశీలిస్తే ప్రతికూలంగా మారే పరిస్థితులు ఉన్నాయి. అయినప్పటికీ తెలంగాణకు విదేశీ పెట్టుబడులు వస్తుండడం హర్షణీయం. గత ప్రభుత్వం తరహా కార్పొరేటీకరణ, ప్రచార ఆర్భాటం లేకుండా రేవంత్ సర్కార్ ఈ దిశగా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో తెలంగాణలో అదానీ పెట్టుబడులను ఒక వ్యాపారాత్మక దృష్టితో చూడాలి కానీ రాజకీయ కోణంతో కాదు. కేరళలో వామపక్ష ప్రభుత్వం కూడా అదానీ పెట్టుబడులను స్వాగతించిందనే విషయాన్ని విస్మరించకూడదు.

అధికార బాధ్యతలు స్వీకరించిన కొద్ది వారాలకే రేవంత్‌రెడ్డి ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొనడానికి స్విట్జర్లాండ్ వెళ్లారు. గత ప్రభుత్వ హయాంతో పోల్చితే ఈ సారి 33 శాతం అదనంగా పెట్టుబడులను తెలంగాణ సాధించినట్లుగా కేంద్రం విడుదల చేసిన గణంకాలు వెల్లడించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు వచ్చిన రూ. 12,864 కోట్లు హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలకు రావడం జరిగింది. పెట్టుబడులకు తోడుగా రేవంత్‌రెడ్డి సర్కార్ స్కిల్ యూనివర్శిటీని కూడా శరవేగంగా అభివృద్ధి చేస్తోంది. పెట్టుబడులతో రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యత కల్గిన యువతను అందించే ఈ విశ్వవిద్యాలయం మదుపుదారులకు అదనపు ఆకర్షణగా ఉంటుందనడంలో సందేహం లేదు. పెట్టుబడులతో పాటు ఈ విశ్వవిద్యాలయ ప్రాంగణాలను హైద్రాబాద్‌ను దాటి ఇతర ప్రాంతాలలోను విస్తరింప చేసే దిశగా ఆలోచించాలి.

పెట్టుబడులను ఆకర్షించడంలో దేశీయంగా తమిళనాడు, అంతర్జాతీయంగా చైనా, సౌదీ అరేబియాలు అనుసరించే విధానాలను ఆదర్శంగా తీసుకోవలిసిన అవసరమున్నది. విదేశీ పెట్టుబడుల ద్వారా తెలంగాణలో ఉత్పన్నమయ్యే అభివృద్ధి, ఉపాధి అవకాశాలను సమరీతిలో వికేంద్రీకరిస్తే ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లవుతుంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

---

# ఎవరికి వారే ప్రత్యేకం..!



■ ఎ. కృష్ణారావు

**ఇండియాగేట్**

గత నెల 25న అటల్ బిహారీ వాజపేయి శతజయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉదయం 8 గంటలకు అనేక మంది నేతలు ఇంకా ప్రవేశించకముందే తెలుగుదేశం అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజ్ ఘాట్‌కు చేరుకున్నారు. ఇంకా పొగమంచు ఢిల్లీని వీడలేదు. దట్టమైన చలిలో నేతలు కోట్లు, మఫ్లర్లు ధరించి అక్కడికి చేరుకోగా చంద్రబాబు సాధారణంగా ఎప్పుడూ ధరించే దుస్తులతో కనపడ్డారు. 'మీరు చలిని అధిగమించినట్లున్నారే, మీనుంచి రాజకీయాలనే కాదు, ఆరోగ్యం గురించి కూడా తెలుసుకోవాలి' అని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా నవ్వుతూ ఆయనను ప్రశ్నించారు. చంద్రబాబును చూడగానే బీజేపీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, హోంమంత్రి అమిత్ షా ఆయనను తమ మధ్య కూర్చోబెట్టుకున్నారు. అటల్‌కు నివాళుల కార్యక్రమం అయిపోయిన తర్వాత కేంద్రమంత్రులు, బీజేపీ సీనియర్ నేతలు చంద్రబాబును ఒకరి తర్వాత మరొకరు పలకరించారు. ఆ తర్వాత నడ్డా, అమిత్ షా ఆధ్వర్యంలో జరిగిన ఎన్డీఏ సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు అదే రోజు మోదీ, అమిత్ షాతో సహా ఆరుగురు మంత్రులను కలుసుకున్నారు. ఒకరిద్దరు కేంద్రమంత్రులు చంద్రబాబును ఢిల్లీలోని ఆయన నివాసానికే వచ్చి కలుసుకున్నారు. ఉదయం 8 గంటల నుంచీ రాత్రి 9 గంటల వరకు ఖాళీ లేకుండా సమావేశాల్లో పాల్గొని హైదరాబాద్ వెళ్లిన చంద్రబాబు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించారని తెలియగానే మళ్లీ ఢిల్లీ తిరిగి వచ్చారు. ఎక్కడా ఆయన అలిసిపోయినట్లు కానీ, వయసు మీద పడినట్లు కానీ కనిపించలేదు. 'మన్మోహన్ సింగ్ ఈ దేశంలో సంస్కరణలు ప్రవేశపెట్టిన ఉత్తమ ఆర్థికవేత్తే కాదు. రాజనీతిజ్ఞుడు. వైఎస్ హయాంలో నాకు భద్రతను ఉపసంహరించినా మన్మోహన్ సింగ్ జోక్యం చేసుకుని మళ్లీ భద్రతను కల్పించేలా చూశారు' అని చంద్రబాబు టీడీపీ ఎంపీలకు చెప్పారు ఈ రెండు రోజులు జాతీయ రాజకీయాల్లో చంద్రబాబు బలమైన ఉనికిని మరోసారి గుర్తు చేశాయి.

వాజపేయి, మన్మోహన్ సింగ్ ఇద్దరూ రాజకీయాలకు అతీతంగా వ్యవహరించినందువల్లే వారి మరణానంతరం కూడా వివిధ పక్షాల గౌరవాన్ని అందుకున్నారు. వాజపేయితో విభేదించినవారు కూడా ఆయన తమను పలకరించినంత మాత్రాన ఆయన ఆకర్షణకు లోనయ్యేవారు. తాను ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న సోనియాగాంధీతో కూడా ఆయన సత్సంబంధాలు కొనసాగించారు.

గత వారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసినప్పుడు రాజకీయాల్లో ఇలాంటి విశాల హృదయులు, రాజనీతిజ్ఞులు కొరవడుతున్న విషయంపై చర్చ జరిగింది. ప్రస్తుతం వాజపేయి, మన్మోహన్ సింగ్ లాంటి నేతలు లేకపోవడం, ఒకర్నొకరు రాజకీయంగా అంతం చేసుకునే ప్రయత్నాలు చేయడం గురించి చర్చకు వచ్చింది. నిజానికి సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు కూడా అత్యంత కీలకమైన నిర్ణయాలు జరిగాయి. పీవీ నరసింహారావు హయాంలోని సంకీర్ణ ప్రభుత్వమే సంస్కరణలను ప్రవేశపెట్టిన విషయం అందరికీ తెలిసిందే. చంద్రబాబు కన్వీనర్‌గా ఉన్న యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో 18 నెలల్లో వడ్డీ రేట్లపై నియంత్రణలు తొలగించడం, పన్నులపై కోత విధించడం వంటి చెప్పుకోదగ్గ సంస్కరణలు జరిగితే, వాజపేయి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో కూడా గ్రామీణ సడక్ యోజన, స్వర్ణ చతుర్భుజితో పాటు అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, సర్వశిక్షాఅభియాన్ లాంటి ప్రయోజనకరమైన పథకాలు అమలు అయ్యాయి. నాయకత్వానికి దూరదృష్టి, స్పష్టతా ఉంటే రాజకీయ అస్థిరతకూ బలమైన నిర్ణయాలు అమలు చేయడానికీ సంబంధం ఉండవలసిన పనిలేదు.

నాయకులు అంతా ఒకే విధంగా వ్యవహరించాలని ఎక్కడా లేదు. పీవీ, మన్మోహన్ వాజపేయిలతో పోలిస్తే నరేంద్రమోదీ అనుసరిస్తున్న తీరు భిన్నమైనది. అందుకు ప్రధాన కారణం ఆయన హయాంలో పార్టీ పూర్తి మెజారిటీ సాధించడం. పార్టీపైన, ప్రభుత్వంపైనే కాదు మొత్తం వ్యవస్థలపై మోదీ పట్టు బిగించారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగం, పార్టీ తన కేంద్రీకృతంగా నడిచేలా చూశారు. బలమైన నిర్ణయాలు తీసుకోవడమే కాదు, మొత్తం నిర్ణయాలు తీసుకునే క్రమంలో ప్రజాస్వామిక వైఖరి అనుసరించడం లేదన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రత్యర్థులను అణిచివేసేందుకు ఆయన ఏ మాత్రం వెనుకాడబోరనే అభిప్రాయం కల్పించారు. తన చుట్టూ ఉన్నవారిలో తానంటే భయం, భక్తి కనపడేలా చూసుకున్నారు. తాను తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదమైనా వాటిని వెనక్కు తీసుకునేందుకు ఆయన ఏ మాత్రం ప్రయత్నించలేదు. సంచలన, వివాదాస్పద, భావోద్వేగాలు కల్పించే వ్యాఖ్యలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి. నరేంద్రమోదీ లాంటి వ్యక్తులు తమకు అనుకూలంగా, వ్యతిరేకంగా బలమైన శిబిరాలు ఏర్పడేలా చేసుకుంటారు. తద్వారా రెండు శిబిరాల్లోనూ ఆయన పేరే మారుమోగేలా చేసుకుంటారు. ఇద్దరు వ్యక్తులు కలిసి రాజకీయాలు మాట్లాడుకుంటే పదినిమిషాల్లో ఒక్కసారైన నరేంద్రమోదీ పేరు వినిపించక తప్పదు. దేశంలో అనేక మంది నేతలను ఒకే రకమైన దుస్తుల్లో చూడడం ప్రజలకు అలవాటైతే మోదీని రకరకాల దుస్తుల్లో చూడడం కూడా వారికి అలవాటైంది. ఒకసారి తపోముద్రలో కనపడితే మరోసారి నీళ్లలో మునకలు వేస్తూ కనపడడం, మరోసారి నెమళ్లతో ఆడుకుంటూ, ఆవులకు దాణా వేస్తూ దర్శనం ఇవ్వడంలో మోదీకి మోదీయే సాటి. ప్రత్యర్థులపై ఎంత తీవ్రంగా, సైద్ధాంతిక పరిభాషలో విరుచుకుపడగలరో, అదే సమయంలో చాలా అల్పమైన వాఖ్యలు చేసి ఈయన దేశ ప్రధానమంత్రేనా అన్న అనుమానాలు రేకెత్తించడం కూడా మోదీకి అలవాటే.

అయినప్పటికీ నరేంద్రమోదీపై ఆయనంటే పార్టీలో అసమ్మతి కానీ రణ గొణ ధ్వనులు కానీ ఏ మాత్రం వినిపించడం లేదు. దీనికి కారణం ఆయన నేతృత్వంలో పార్టీ ఘన విజయాలు చవి చూడడం. గత పదేళ్లలో జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ బలమైన, గుర్తింపు గల నేతగా మోదీ ఆవిర్భవించారు. భారత రాజకీయాల్లో ఇంతటి ప్రభావశీల నాయకుడు కనిపించడం లేదు. ఈ బలమైన నాయకత్వమే ఆయనకు పార్టీలోనే కాక, ఎన్డీఏలోనూ ఆమోదయోగ్యత పెంచేలా చేసింది. నరేంద్రమోదీ శైలినచ్చనివారు కూడా ఆయనతో కలిసి నడిచేందుకు, ఆయన నాయకత్వాన్ని ఆమోదించేందుకు పూనుకున్నారంటే ప్రత్యామ్నాయం లేకపోవడమే కాదు, తమ తక్షణ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలనుకోవడం కూడా కారణం. తనతో స్నేహం చేసిన వారిని మోదీ విస్మరించబోరన్నది వారి ప్రగాఢ విశ్వాసం. మోదీ ఎలా ఉంటేనేం, ఫలితాలు సాధిస్తున్నారా లేదా అన్నది వారికి ముఖ్యం. లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు తగ్గితేనేం. మళ్లీ హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో నరేంద్రమోదీ బలహీనం అయ్యారన్న అభిప్రాయాలకు తెరపడింది. కార్పొరేట్ శక్తులన్నీ మోదీకి అనుకూలంగా మారడం ఆయనతో చేతులు కలిపేవారందరికీ ఉపయోగకరమని వేరే చెప్పనక్కర్లేదు. అదే సమయంలో మూడోసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మోదీ తనతో కలిసి వచ్చే వారిని విస్మరించబోననే సంకేతాలు పంపడం ప్రారంభించారు. తాను తగ్గినా నెగ్గినట్లే కనిపించడం మోదీ స్వభావం.




> **పీవీ, మన్మోహన్, వాజపేయిలతో పోలిస్తే నరేంద్రమోదీ అనుసరిస్తున్న తీరు భిన్నమైనది. అందుకు ప్రధాన కారణం ఆయన హయాంలో పార్టీ పూర్తి మెజారిటీ సాధించడమే. పార్టీపైన, ప్రభుత్వంపైనే కాదు మొత్తం వ్యవస్థలపై మోదీ పట్టు బిగించారు. చంద్రబాబు కాలానుగుణంగా తనను తాను మార్చుకుంటూ వస్తున్నారు. విధానాలను, వ్యవహారశైలిని మార్చుకోవడానికి, తప్పులు అంగీకరించడానికి ఆయన వెనుకాడడం లేదు. అధికారంలో ఆరునెలలు పూర్తి చేసుకున్న తర్వాత, తన చర్యల్లో వేగం పుంజుకునే టేకాఫ్ దశలో ఉన్నట్లు చంద్రబాబు కనిపిస్తున్నారు.**

బలమైన నాయకులంతా ప్రజాస్వామికంగా వ్యవహరించవలసిన అవసరం లేదని, నియంత స్వభావం ఉన్నవారికి కూడా ప్రజలు ఆకర్షితులవుతారని ఇవాళ ప్రపంచ రాజకీయాలు కూడా నిరూపిస్తున్నాయి. లేకపోతే డోనాల్డ్ ట్రంప్, పుతిన్ లాంటి వారికి తిరుగులేకుండా పోవడమేమిటి? ట్రంప్ కూడా రెండు బలమైన అనుకూల, వ్యతిరేక శిబిరాలను ఏర్పర్చుకున్నారు. తాను మాట్లాడే అంశాలను ద్వేషంతోనైనా వినే వర్గాన్ని పెంచుకున్నారు. ఎప్పుడు భావోద్వేగాలు కల్పించాలో, ఎప్పుడు సంచలన వ్యాఖ్యలు చేయాలో ఆయనకు బాగా తెలుసు. అనూహ్యంగా వ్యవహరించడమే ఆయన శైలి. ఏది మాట్లాడినా వినేవారిని (ఆడియన్స్)ను కోల్పోకపోవడమే ఆయన విజయ రహస్యం. దాని వల్లే జార్జి బుష్ తర్వాత అత్యంత జనాదరణ పొంది, 75 మిలియన్ అమెరికన్ల ఓట్లు సంపాదించుకోగలిగారు. పుతిన్ కూడా సుదీర్ఘ కాలం రష్యా అధినేతగా ఉన్న కాలంలో తనను విస్మరించలేని పరిస్థితులను కల్పించుకున్నారు. ప్రజాస్వామ్యం, ప్రతిపక్షం లాంటి వాటిని డిక్షనరీలోంచి తీసేసి బలమైన, ప్రమాదకరమైన నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకంజ వేయకుండా ముందుకు సాగారు.

రాజకీయాల్లో వారసత్వం వల్ల జనం ఆదరిస్తారనే రోజులు పోయాయి. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలతో ఆ కాలం చెల్లింది. రాహుల్‌గాంధీ గత రెండు దశాబ్దాలుగా తన ఉనికికోసం పోరాడుతూనే ఉన్నారు. నాయకత్వం లభించాలంటే కాలం కలిసి రావాలి. వాతావరణం పరిపక్వంగా మారాలి. సహజ నాయకుడుగా ఉద్భవించే సమయం కోసం వేచి చూడాలి. అప్పుడు వారసత్వం కూడా కలిసి వస్తుంది. సిద్దరామయ్య, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కాంగ్రెస్ రాజకీయాల్లో జన్మించకపోయినా కాంగ్రెస్ ముఖ్యమంత్రులుగా నిలదొక్కుకున్నారు. బీజేపీలో హిమంత బిశ్వాస్ శర్మకు దక్కిన అవకాశమే కాంగ్రెస్‌లో వారికి లభించింది. అయినా సిద్దరామయ్య, రేవంత్‌రెడ్డిల శైలి వేరు. కాని ఇద్దరి సమస్యలు ఒక్కటే. కెరటాల్లా ముందుకు వచ్చినట్లే వచ్చి వెనక్కు తగ్గడం వారి తత్వంలా కనిపిస్తోంది. దేశంలో అత్యంత సీనియర్ నాయకుడైన చంద్రబాబు కాలానుగుణంగా తనను తాను మార్చుకుంటూ వస్తున్నారు. తన విధానాలను, వ్యవహారశైలిని మార్చుకోవడానికి, చేసిన తప్పులు అంగీకరించడానికి ఆయన వెనుకాడడం లేదు. తనపై వస్తున్న విమర్శలేమిటో ఆయనకు తెలియనిది కాదు. కాని ఆయన ప్రాధాన్యతలు వేరు. ఆరునెలలు పూర్తి చేసుకున్న తర్వాత ఆయన తన చర్యల్లో వేగం పుంజుకునే టేకాఫ్ దశలో ఉన్నట్లు కనిపిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

---

# 22ఏ భూములపై మూడుముక్కలాట!

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో జాతరలు, ఉత్సవాలు జరిగేటప్పుడు మూడుముక్కలాట తప్పకుండా ఉండేది. ఇప్పుడది కాసినో రూపంలో డబ్బున్న వారి ఆటగా మారిందనుకోండి. అమాయకులైన గ్రామీణ ప్రజలు ఆ మూడుముక్కలపై ఆశతో పందెం కాసి, జేబులు ఖాళీ చేసుకొనేవారు. ఈ మూడుముక్కలాట అనే పదం జగన్ ఐదేళ్ల పాలనలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రంలో మారుమోగిపోయింది. కానీ 2015 నుంచి రాష్ట్ర రెవెన్యూ, దేవాదాయ, రిజిస్ట్రేషన్ శాఖలు రాష్ట్రంలోని రైతులతో సెక్షన్ 22–ఏ పేరుతో మూడుముక్కలాట ఆడుతున్నాయి. ఆ శాఖలు ప్రజలను తమ కార్యాలయాల చుట్టూ నెలలు, సంవత్సరాల తరబడి తిప్పుతూ మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాయి.

అదెలాగంటే... ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా వాటి రిజిస్ట్రేషన్లు జరగకుండా సెక్షన్ 22–ఏ కింద ఆ భూముల వివరాలు సబ్ రిజిస్ట్రార్లకు పంపితే, వాటిని సబ్ రిజిస్ట్రార్లు నిషేధిత జాబితాలో ఉంచి, రిజిస్ట్రేషన్లు చేయరు. ఇది ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఏర్పాటు చేసిన రక్షణ. రెవెన్యూ, దేవాదాయ శాఖ వారు ఆ సర్వే నెంబర్ల జాబితా పంపినపుడు చేసిన తప్పులకు ఇప్పుడు రైతులు బిచ్చగాళ్ళ మాదిరి ఆ ఆఫీసుల చుట్టూ, కొందరు కోర్టుల చుట్టూ తిరుగుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. అధికారులు చేసిన తప్పులకు రైతులు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ఇది గత తొమిదేళ్లుగా సాగుతున్న ప్రహసనం.

ప్రభుత్వ భూములు అంటే... రోడ్లు, చెరువులు, శ్మశానాలు, ప్రభుత్వ ఇళ్ల స్థలాలు, సాగుకోసం ఇచ్చిన 'డి' పట్టా భూములు, అలాగే ల్యాండ్ సీలింగ్ చట్టం కింద తీసుకున్న భూముల వివరాలను గ్రామాల వారీగా, మండలాల వారీగా సబ్ రిజిస్ట్రార్లకు పంపారు తహశీల్దార్లు. అలా పంపేటప్పుడు చాలా తప్పులు చేశారు. అదెలాగంటే ఒక సర్వే నంబర్‌లో కొంత భూమిని ఇళ్ల స్థలాల కోసం, లేదా రోడ్లు కోసం ప్రభుత్వం తీసుకున్నప్పుడు ఆ భూముల వివరాలు సబ్ డివిజన్ చేసి పెట్టాలి. అలా చేయకుండా మొత్తం సర్వే నెంబర్‌ను పేర్కొనడం వల్ల, ఆ సర్వే నంబర్‌లో ఇంకా భూమి కలిగిన ఇతర రైతులు వారి అవసరాల కోసం అమ్మదలిచినపుడు... రెవెన్యూశాఖ వారు మీ భూమిని 22–ఏలో పెట్టారు కాబట్టి రిజిస్ట్రేషన్ చేయడానికి కుదరదు అని చెబుతున్నారు సబ్ రిజిస్ట్రార్లు. అలాగే బ్యాంకు అధికారులు ఆ భూమికి రైతులకు లోన్లు ఇవ్వం అని చెబుతున్నారు. తప్పు చేసిన రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లిన రైతులు/భూ యజమానులు... అయ్యా ఒక సర్వే నెంబర్‌లో రెండు ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంటే, మొత్తం 10 ఎకరాల భూమి ఉన్న సర్వే నెంబర్‌ని 22–ఏలో పెట్టడం వల్ల, మిగిలిన 8 ఎకరాలను అవసరాలకు అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్నాము అని మొరపెట్టుకుంటున్నారు. భూమిని సబ్ డివిజన్ చేసి రెండు నెలల్లో తీర్చాల్సిన సమస్యను ఆ అధికారులు పట్టించుకోకుండా నెలల తరబడి రైతులను తిప్పుకుంటున్నారు. సొమ్ములు చెల్లించనిదే ఆ తప్పును వారు సవరించడం లేదు.

అలాగే గ్రామ కంఠం భూములను కూడా 22–ఏలో పెట్టారు. గ్రామ కంఠం భూములు ప్రైవేటు భూములని ప్రభుత్వం 2015లో స్పష్టంగా ప్రకటించినా కూడా, నిషేధిత భూముల జాబితాలో పెట్టారు. దేవాదాయ శాఖ అధికారులు కూడా వారి భూములను సబ్ రిజిస్ట్రార్లకు పంపినపుడు రెవెన్యూశాఖ వారు చేసిన తప్పునే చేశారు. ఒక సర్వే నెంబర్‌లో 10 ఎకరాల భూమి ఉంటే, అందులో దేవాదాయ శాఖకు చెందినది మూడు ఎకరాలు మాత్రమే. దానిని సబ్ డివిజన్ చేయకుండా మొత్తం 10 ఎకరాలను 22–ఏలో పెట్టారు. దీనివల్ల మిగిలిన ఏడు ఎకరాల్లో భూములున్న రైతులు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బందులు పడుతున్నారు. దేవాదాయశాఖ అధికారులు తహశీల్దార్లతో సంప్రదించి, తమ భూములను విడిగా సబ్ డివిజన్ చేయించుకుని ఆ వివరాలను సబ్ రిజిస్ట్రార్లకు పంపితే సమస్య పరిష్కారమవుతుంది. అలా చేయకుండా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్థాయి నుంచి దేవాదాయ శాఖ కమిషనర్ వరకు రైతులను నెలలు, సంవత్సరాల తరబడి తమ కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు.

> **రెవెన్యూ, దేవాదాయ, రిజిస్ట్రేషన్ శాఖలు రాష్ట్రంలోని రైతులతో సెక్షన్ 22–ఏ పేరుతో మూడుముక్కలాట ఆడుతున్నాయి. ఆ శాఖలు ప్రజలను తమ కార్యాలయాల చుట్టూ నెలలు, సంవత్సరాల తరబడి తిప్పుతూ మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాయి.**




అలాగే ఒక గ్రామంలో చిన్న దేవాలయం ఐదు నుంచి 10 సెంట్ల భూమిలో ఉన్నా, ఆ గ్రామ కంఠం సర్వే నెంబర్ మొత్తాన్ని 22–ఏలో పెట్టినందువల్ల మొత్తం ఆ గ్రామంలో ఉన్న ఇళ్ల యజమానులు ఆ ఇళ్లను అమ్మాలన్నా లేదా బ్యాంకు లోను తెచ్చుకోవాలన్నా వీలుకావడం లేదు. దారుణమైన విషయం ఏమంటే దేవాదాయ శాఖ బహిరంగంగా వేలంలో అమ్మిన భూములను కూడా మళ్లీ 22–ఏలో పెట్టారు. ఇదేమని అడిగితే కోట్ల రూపాయల విలువైన భూములు చాలా జాగ్రత్తగా చూసి చేయాలని కథలు చెబుతున్నారు. పైగా దేవాదాయ శాఖ నాలుగు లక్షల ఎకరాల భూములను రక్షించాల్సి ఉంది అని లోకాయుక్తకు చెప్పుకున్నారు. వందలాది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, ఇన్‌స్పెక్టర్లు దేవాదాయ శాఖ పరిధిలో పనిచేస్తున్నారు. ఆ భూములపై వాస్తవ వివరాలు ఒక నెల రోజుల్లో అందించవచ్చు. మూడు నెలల్లో 22–ఏలో పెట్టిన తమ శాఖకు చెందని భూములను తొలగించవచ్చు.

విశాఖలోని శారదాపీఠం అధిపతిని గతంలో అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు పదే పదే దర్శించేవారు. అదే దారిలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి నుంచి ఈఓ స్థాయి వరకు ఆయన ముందు సాగిలపడ్డారు. అది వారి వ్యక్తిగతం అని సరిపెట్టుకుందాం. అలాగే మొన్నీమధ్య సనాతన ధర్మం పేరుతో ఓ నాయకుడు మెట్లు కడిగితే ఓ అధికారి మగ్గుతో నీళ్ల అందించారు. కానీ వేలాది మంది రైతుల భూములను తమ శాఖ అధికారులు తప్పుగా నమోదు చేసిన పాపాన్ని మాత్రం కడగలేకపోతున్నారు. రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు 22–ఏ కింద సబ్ డివిజన్ వివరాలు లేకుండా భూముల వివరాలు సబ్ రిజిస్ట్రార్లకు పంపితే, వారు వాటిని వెనక్కి తిప్పి పంపాలి. అలా కాకుండా రైతులు, భూ యజమానులు రిజిస్ట్రేషన్ల కోసం వారి కార్యాలయాలకు వచ్చినపుడు మీ భూమి 22–ఏ కింద ఉందని, మీరు దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారుల వద్దకు వెళ్లి సరి చేయించుకుని రమ్మని చెబుతున్నారు. ఈ రకంగా రిజిస్ట్రేషన్ శాఖ కూడా రైతులను ఇబ్బంది పెడుతోంది.

ఆర్టికల్ 300–ఏ కింద ఆస్తి హక్కు, రాజ్యాంగం కల్పించిన హక్కు. సరైన ఆధారాలు లేకుండా రిజిస్ట్రేషన్లు ఆపడం ఒక రకంగా ఈ హక్కు ఉల్లంఘన కిందకే వస్తుంది. ఈ విధంగా మూడు శాఖలు రైతుల జీవితాలతో మూడుముక్కలాట ఆడుకుంటున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులతో పాటు రెవెన్యూ దేవాదాయ శాఖ మంత్రులు కూడా బాధ్యులే. గత నవంబరు 26న 75వ రాజ్యాంగ దినోత్సవాలను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నాం. మండల స్థాయి అధికారి నుంచి గౌరవ రాష్ట్రపతి వరకు రాజ్యాంగాన్ని స్తుతించి రాజ్యాంగ పీఠికను అందరూ ఎలుగెత్తి పఠించారు. రెవెన్యూ, దేవాదాయ, రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులతో గౌరవ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆర్టికల్ 300–ఏని తమ కోర్టు హాలులో చదివిస్తే తప్ప 22–ఏలో భూముల్ని తప్పుగా పెట్టిన అధికారులకు కనువిప్పు కలగదేమో!

■ మారిశెట్టి జితేంద్ర
రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్

---

## ఇదొక రాజకీయ పాఠం!

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి నూరవ సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ఆంధ్రజ్యోతిలో డిసెంబర్ 22న చెరుకూరి సత్యనారాయణ రాసిన వ్యాసం, దానికి సమాధానంగా డిసెంబర్ 31న సురవరం సుధాకరరెడ్డి స్పందన చూసిన తర్వాత చిన్న విషయం చెప్పాలనిపించింది. చెరుకూరి వ్యాసంలో వైఫల్యాలు, సురవరం వ్యాసంలో విజయాలూ రెండూ వాస్తవాలే. వందేళ్ల సుదీర్ఘకాలంలో అనివార్యంగా లభించే కొన్ని విజయాలు రాజ్యాధికారం దిశగా సాగే ఉద్యమాల వైఫల్యాలను దాచలేవు. విషయాల లోతుల్లోకి వెళ్లడం నా ఉద్దేశం కాదు. ఉద్యమంపై వచ్చే విమర్శలకు వివిధ స్థాయిల్లో ఉన్న కమ్యూనిస్టు నాయకులు అనేకసార్లు సమాధానాలు చెప్పడం చూశాం. కానీ, సురవరం వ్యాసంలో ఉన్న నమ్రత, వినయం, హుందాతనం ఎప్పుడూ ఏ నాయకుని స్పందనలోనూ చూడలేదు. విమర్శ పట్ల కమ్యూనిస్టులు ఎలా స్పందించాలి అనే దానికి సురవరం స్పందన ఒక కరదీపిక. భవిష్యత్తులో కమ్యూనిస్టులు తమ రాజకీయ తరగతుల్లో విమర్శ–ప్రతివిమర్శ అనేది ఎలా ఉండాలో చెప్పడానికి చెరుకూరి వ్యాసం–సురవరం ప్రతివ్యాసం సిలబస్‌గా ఉంచుకోవాలి.

– సి. మేఘనాథరెడ్డి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

## రేపు 'అనంత'లో డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్

అనంతపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గురువారం అనంతపురం నగరంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరవుతారని టీడీపీ నాయకులు తెలిపారు.

# 500 కోట్లిస్తాం!

## ప్రతి నెలా బిల్లులు చెల్లిస్తాం
## వైద్యసేవలు కొనసాగించండి

- నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశాఖ హామీ
- 3 వేల కోట్ల బకాయిల్లో 500 కోట్లే ఇస్తే ఎలా?
- కనీసం వెయ్యి కోట్లు ఇవ్వాలని ఆస్పత్రుల డిమాండ్
- సేవల కొనసాగింపుపై నేడు అసోసియేషన్ నిర్ణయం?

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్పెషాలిటీ ఆస్పత్రులకు రూ.500 కోట్లు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని, ప్రతి నెల దాదాపు రూ.500 కోట్లు విడుదలకు ప్రయత్నం చేస్తామని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్‌తో మంగళవారం సచివాలయంలో ఆయన చర్చలు జరిపారు. వైద్య సేవలను కొనసాగించాలని, ఎక్కడా బ్రేక్ వేయవద్దని అసోసియేషన్ సభ్యులను కోరారు. అయితే, కనీసం రూ.1,000 కోట్ల బకాయిలు విడుదల చేయాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. ఇప్పటికే బకాయిలు రూ.3 వేల కోట్లుకు చేరాయన్నారు. ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారిందని, జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి వెళ్లామని వివరించారు. కాగా, ప్రభుత్వ పరిస్థితిని కూడా దృష్టిలో పెట్టుకోవాలని కృష్ణబాబు కోరారు. ఈ నెల 15 నాటికి రూ.500 కోట్లు విడుదల చేస్తామని, ఇకపై ప్రతి నెలా బిల్లులు చెల్లించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. అయితే, జనరల్ బాడీ సమావేశంలో చర్చించిన తర్వాత ఓపీ, ఈహెచ్‌ఎస్ సేవల కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని అసోసియేషన్ సభ్యులు చెప్పారు. ఇన్సూరెన్స్‌పై కూడా చర్చించారు. ఆరోగ్య బీమాలోకి మారడానికి ప్రభుత్వం ఎటువంటి మార్గదర్శకాలు పెట్టుకుంది? అది ఆస్పత్రులకు ఏ విధంగా ఉపయోగం? అని అసోసియేషన్ సభ్యులు ప్రశ్నించారు. దీంతో ఇన్సూరెన్స్ మార్గదర్శకాలను కృష్ణబాబు వివరించారు. ఆయుష్మాన్ భారత్ రేట్ల ఆధారంగానే ఇన్సూరెన్స్ ప్యాకేజీల ధరలు నిర్ణయిస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ఆధారంగానే ప్యాకేజీలు ఉంటాయని, ఇన్సూరెన్స్, ట్రస్ట్, ప్రభుత్వాసుపత్రులు.. ఇలా మూడు రకాలుగా శస్త్రచికిత్సలు చేస్తాయని చెప్పారు. అయితే, ఆయుష్మాన్ భారత్ ప్యాకేజీలనే ఇన్సూరెన్స్‌లో అమలు చేయడం వల్ల ఆస్పత్రులు తీవ్రంగా నష్టపోతాయని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ప్యాకేజీల కంటే ఆయుష్మాన్ భారత్ ప్యాకేజీల ధరలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ఆయుష్మాన్ భారత్‌ను ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలు అమలు చేయట్లేదని, ప్యాకేజీల ధరలు తక్కువగా ఉండడమే దీనికి కారణమని వివరించారు. ఇప్పటికే వేల కోట్ల బకాయిలతో రాష్ట్రంలోని ఆస్పత్రులు తీవ్రంగా నష్టపోయాయని, ఇప్పుడు ఇన్సూరెన్స్‌తో పూర్తిగా నాశనమవుతాయని, బీమాకు ఏ ఆస్పత్రీ ముందుకొచ్చే పరిస్థితి ఉండదని తెలిపారు. బీమా ప్యాకేజీలపై పునరాలోచన చేయాలని కోరారు. విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. బీమా ప్యాకేజీలపై పూర్తిగా అధ్యయనం చేసి ఆస్పత్రులకు, ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడతాయి? బీమా కంపెనీలతో పని చేయడం లాభాలా? నష్టాలా? అనేది అసోసియేషన్‌లో చర్చించి ఒక రిపోర్ట్ ఇవ్వాలని స్పెషల్ సీఎస్ కోరగా, జనరల్ బాడీ సమావేశంలో పెట్టి చర్చించుకొన్న తర్వాత నివేదిక అందిస్తామని సభ్యులు చెప్పారు. బీమాకు మారే విషయంలోనూ తమతో చర్చలు జరపడం లేదని, తమకు సమాచారం ఇవ్వడం లేదని.. సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే, బీమా కంపెనీలకు అప్పగించే ముందు తమ బకాయిలు పూర్తి గా చెల్లించాలని కోరారు. బుధవారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో చర్చించి వైద్యసేవలు కొనసాగించాలా? లేదా అనేది తెలియచేస్తామన్నారు.

## ఆర్‌అండ్‌బీ ఆర్కిటెక్ట్‌కు అరుదైన గౌరవం

- జాతీయ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా నియామకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



నవీన్

ఆర్కిటెక్చర్ కౌన్సిల్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్‌అండ్‌బీ అధికారి నవీన్‌కు అరుదైన గౌరవం దక్కింది. జాతీయస్థాయిలో ఉన్న ఆర్కిటెక్చర్ కౌన్సిల్‌లో ఉన్న క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా నవీన్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖలో జాయింట్ స్టేట్ ఆర్కిటెక్ట్‌గా ఉన్నారు. గతేడాది డిసెంబరులో తొలుత జరిగిన నియామక ప్రక్రియలో నవీన్ క్రమశిక్షణా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ హోదా దక్కడమే చాలా అరుదైన అవకాశంగా ఆర్‌అండ్‌బీ వర్గాలు గుర్తించాయి. తాజాగా ఢిల్లీలో జరిగిన క్రమశిక్షణా కమిటీ సమావేశంలో ఆయన్ను చైర్మన్‌గా సీనియర్ సభ్యులు ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు కేంద్రం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఓ తెలుగు అధికారికి ఇలాంటి అవకాశం లభించడం ఇదే తొలిసారి. దేశవ్యాప్తంగా ఆర్కిటెక్ట్ రంగంలో వృత్తి ప్రమాణాలు, నైతికత, సమగ్రతను పెంపొందించడంలో ఈ కమిటీ కీలకపాత్ర పోషిస్తుంది.

## కుంభమేళాలో శ్రీవారి నమూనా ఆలయం

- ప్రయాగరాజ్‌లో 2.89 ఎకరాలు కేటాయించిన యూపీ సర్కారు
- తిరుమల తరహాలో రోజూ పూజలు: టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కుంభమేళాలో తిరుమల తరహాలోనే శ్రీవారి నమూనా ఆలయాన్ని నిర్మించి కైంకర్యాలు నిర్వహించనున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం మీడియాకు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనున్న కుంభమేళాకు వచ్చే కోట్లాది మంది భక్తులకు శ్రీవారి దర్శనాన్ని కల్పించేందుకు ఈ ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ప్రయాగరాజ్‌లోని సెక్టార్ 6, భజరంగ్‌దాస్ రోడ్డులోని నాగవాసుకి ఆలయానికి సమీపంలో 2.89 ఎకరాల స్థలంలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేస్తున్నామని, సుప్రభాతం నుంచి ఏకాంతసేవ వరకు అన్ని సేవలనూ నిర్వహిస్తామన్నారు.

## ధనుర్మాస ఉత్సవాల్లో మంత్రి లోకేశ్

- ఆశీర్వచనాలు అందజేసిన చినజీయర్ స్వామి



మంత్రి లోకేశ్‌కు ఆశీర్వచనాలు అందజేస్తున్న చినజీయర్ స్వామి

మంగళగిరి సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర స్వామికి అత్యంత ఇష్టమైన ధనుర్మాసంలో దీక్షలు ఆచరించడం వల్ల పుణ్యఫలం సిద్ధిస్తుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి శ్రీశైల నగర్‌లోని బాపూజీ విద్యాలయంలో చినజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో మంత్రి మంగళవారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మంత్రి లోకేశ్‌కు ఆశీర్వచనాలు అందజేసి కొద్దిసేపు ఆధ్యాత్మిక అంశాలపై చర్చించారు. ధనుర్మాస ఉత్సవాలకు హాజరై శ్రీవారి అనుగ్రహం పొందడం సంతోషంగా వుందని ఈ సందర్భంగా లోకేశ్ అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువతలో ధార్మిక, ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందన్నారు. మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రం, విజయకీలాద్రి క్షేత్రాలను ధనుర్మాసంలో దర్శించుకోవడం ద్వారా మంచి జరుగుతుందన్నారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపైనా ఉండాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

## ప్రభుత్వ విద్యను పరిరక్షించుకోవాలి

- విద్యారంగాన్ని బతికించుకోవాలి
- యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో ఎంవీఎస్ శర్మ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను పరిరక్షించుకోవాలని, విద్యారంగాన్ని బతికించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా మూడో రోజు ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నాశనమైందన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. 3,4,5 తరగతులను హైస్కూల్‌లో కలిపి చాలా తప్పిదం చేసిందన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు.

## 7 లక్షల మందికి వైకుంఠద్వార దర్శనం

» టికెట్లు, టోకెన్లు ఉన్నవారికే అనుమతి: ఈవో



తిరుమల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో 7లక్షల మందికి ఈ నెల 10 నుంచి వైకుంఠద్వార దర్శనాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించుకున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముందస్తు టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులకే వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందని చెప్పారు. టికెట్లు లేనివారు తిరుమల రావచ్చు కానీ దర్శనానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. నిర్దేశించిన తేదీ, సమయానికి మాత్రమే భక్తులు క్యూలైన్లలో ప్రవేశించాలని విజ్ఞప్తి చేశారు. ఏకాదశి రోజున వేకువజాము ధనుర్మాస కైంకర్యాలు పూర్తయిన తర్వాత 4.30గంటలకు ప్రొటోకాల్ దర్శనాలు మొదలవుతాయని, 8 గంటల నుంచి సర్వదర్శన భక్తులను అనుమతిస్తామని వివరించారు. అదేరోజు ఉదయం 9గంటలకు స్వర్ణరథోత్సవం, 12గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు వాహనమండపంలో మలయప్ప స్వామి దర్శనం ఉంటుందని తెలిపారు. మరుసటిరోజు ఉదయం 5.30 గంటలకు పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తామన్నారు. ఈ 10 రోజుల దర్శనాలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా 1.40 లక్షలు, 19,500 శ్రీవాణి టికెట్లను జారీ చేశామని చెప్పారు. సామాన్య భక్తుల కోసం తిరుపతిలో 8 ప్రాంతాలతో పాటు తిరుమల స్థానికుల కోసం కొండ పైన మొత్తం 94 కౌంటర్ల ద్వారా మొత్తం 4.32 లక్షల స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీ చేస్తామని ఈవో వివరించారు. 10, 11, 12వ తేదీలకు సంబంధించిన 1.20 లక్షల టోకెన్లను 9వ తేదీ ఉదయం 5 గంటలకు, ఆ తర్వాత రోజులకు సంబంధించిన టోకెన్లను ఏరోజుకారోజు విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌ల ద్వారా జారీ చేస్తామన్నారు. ఈ రోజుల్లో సిఫారసులు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లిదండ్రులు వంటి ప్రత్యేక దర్శనాలేవీ ఉండబోవని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## మనిషి చనిపోతే 5 లక్షలు... పాడికి 50 వేలు

» విపత్తు సాయంపై ఉత్తర్వులు జారీ

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులతో ఆస్తి, పంట నష్టపోయిన బాధితులకు అందించే సాయంపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలు, వరదల సమయంలో బాధితులకు వర్తింపజేసిన నష్టపరిహారం (స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్) ప్యాకేజీని కొనసాగించింది. తాజాగా ఉత్తర్వుల ప్రకారం విపత్తుల కారణంగా మనిషి చనిపోతే రూ.5 లక్షలు, ఆవులు, గేదెల మృతి చెందితే రూ.50 వేలు, ఎద్దులకు రూ.40 వేలు, దూడలకు రూ.25 వేలు, గొర్రెలు, మేకలకు రూ.7,500, కోడికి రూ.100 చొప్పున, పశువుల పాక దెబ్బతింటే రూ.5 వేలు ఇవ్వనున్నారు. ముంపుబారిన పడిన గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లకు రూ.10వేలు, కిరాణా షాపులు, రెస్టారెంట్లు, ఇతర దుకాణాలకు రూ.25 వేలు, రూ.40 లక్షల టర్నోవర్ ఉండే రిజిస్టర్డ్ వ్యాపారులు, ఎంఎస్ఎంఈలకు రూ.50 వేలు, రూ.40 లక్షల నుంచి రూ.కోటిన్నర వరకు టర్నోవర్ చేసే వ్యాపారులకు రూ.లక్ష, రూ.కోటిన్నర పైన టర్నోవర్ చేసే వ్యాపారులకు రూ.లక్షన్నర ఇవ్వనున్నారు. ద్విచక్ర వాహనానికి రూ.3 వేలు, ఆటోలకు రూ.10 వేలు, తోపుడు బండ్లకు రూ.20 వేలు, చేనేతలకు రూ.25 వేలు, చేనేతల ముడిసరుకు నష్టానికి రూ.10 వేలు, చేపల వల పాడైతే రూ.3 వేలు, వల పూర్తిగా దెబ్బతింటే రూ.10 వేలు, నాన్‌మోటరైజ్డ్ బోటు పూర్తిగా దెబ్బతింటే రూ.20 వేలు, మోటరైజ్డ్ బోటు పూర్తిగా దెబ్బతింటే రూ.25 వేలు, చేపల చెరువుల రిపేర్లకు హెక్టారుకు రూ.18 వేలు, పట్టు పరిశ్రమకు రూ.25 వేలు ఇవ్వనున్నారు. హెక్టారు వరి, పత్తి, వేరుశనగ, చెరకుకు రూ.25 వేలు, రాగులు, సజ్జ, కొర్రలు, సాములు, ఆముదం, జూట్, నువ్వులు, మినుము, పెసర, కంది, సోయా, సన్‌ఫ్లవర్, పొగాకు, మొక్కజొన్నకు రూ.15 వేలు చేశారు. ఉద్యాన పంటల్లో మిర్చి హెక్టారుకు రూ.35 వేలు, టమాటా, బొప్పాయి, పుచ్చ, పూలు, నర్సరీలకు రూ.25 వేలు, పండ్ల తోటలకు రూ.35 వేలు, ఆయిల్ పామ్, కొబ్బరి చెట్టుకు రూ.1,500 చొప్పున పరిహారం అందించనున్నారు.

# విద్యుత్తు చార్జీలు పెంచం!

» 2025-26 టారిఫ్‌లో పెంపు ప్రతిపాదనే లేదు

» ప్రజాభిప్రాయ సేకరణలో డిస్కమ్‌ల స్పష్టీకరణ



వినతిపత్రాలు ఇస్తున్న వామపక్షాల నేతలు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నేత బాబూరావు తదితరులు

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు చార్జీలు పెంచడం లేదని, 2024-25 టారిఫ్‌నే 2025-26లోనూ కొనసాగిస్తామని రాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)లు రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో స్పష్టం చేశాయి. ఆదాయ వ్యయాలు సమానంగా ఉండేలా రాబడి కంటే ఖర్చు పెరగకుండా చూశామని వెల్లడించాయి. 2025-26 టారిఫ్‌లో విద్యుత్తు చార్జీల పెంపును ప్రతిపాదించలేదని ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ ఠాగూర్ రామ్ సింగ్‌కు డిస్కమ్‌లు స్పష్టం చేశాయి. వినియోగదారులపై 2025-26 టారిఫ్‌లో భారాన్ని వేయడంలేదని తెలిపాయి. 2025-26లో ఏపీఈపీడీసీఎల్ రూ.23,038.34 కోట్ల మేర ఆదాయవ్యయాలు సమానంగానూ, ఏపీఎస్పీడీసీఎల్‌లో రూ.22,830.44 కోట్ల ఆదాయవ్యయాలు సమానంగానూ.. లాభనష్టాలు లేకుండా వార్షిక ఆదాయ వ్యయ నివేదికను ఈఆర్‌సీకి సమర్పించాయి. అయితే.. ఏపీసీపీడీసీఎల్ మాత్రం రూ.12,899.74కోట్ల మేర ఆదాయం వస్తుందని, రూ.15,784.40 కోట్ల మేర వ్యయంతో రూ.2,978.66 కోట్ల మేర లోటును చూపించింది. అయితే మూడు డిస్కమ్‌లలోనూ ఆదాయవ్యయాలు సరిసమానంగా ఉండటంతో విద్యుత్తు చార్జీలను పెంచడంలేదని డిస్కమ్‌లు ఈఆర్‌సీకి స్పష్టం చేశాయి.

### ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఎత్తివేయాలి!

విద్యుత్తు చార్జీలను పెంచబోమంటూ డిస్కమ్‌లు స్పష్టం చేసినప్పటికీ ప్రజాసంఘాలు ఈ మాటలను ఏమాత్రం నమ్మలేదు. ప్రభుత్వం నుంచి దాదాపు రూ.43,000 కోట్ల మేర రావాల్సి ఉందని డిస్కమ్‌లు తమ వార్షిక గణాంకాల్లో వెల్లడిస్తున్నాయని, ఈ డబ్బులు ఇవ్వకపోతే అవి ఆర్థికంగా నష్టపోతాయి కదాని హెచ్చరించాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వ్యాపార వ్యవహారాల కోసం వినియోగించేందుకు సాధ్యం కాకపోవడంతో ఈ మొత్తాలను ఇతర ఆర్థిక సంస్థల నుంచి అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంటుందని చెబుతున్నాయి.

### వ్యవసాయ మీటర్లపై స్పష్టతేదీ?

వ్యవసాయ విద్యుత్తు పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై విద్యుత్తు డిస్కమ్‌లు స్పష్టత ఇవ్వకపోవడంపై ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతానికి వ్యవసాయ విద్యుత్తు పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లను బిగించడం లేదని 2025-26 వార్షిక ఆదాయ, వ్యయ నివేదికపై ఏపీఈఆర్‌సీ మంగళవారం విజయవాడలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పేర్కొన్నాయి. ఏపీఈఆర్‌సీకి లిఖితపూర్వకంగా సమర్పించిన గణాంకాల్లో రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్)లో భాగంగా వ్యవసాయ విద్యుత్తుకు బిగించేందుకు వీలుగా స్మార్ట్ మీటర్లను సేకరించామని డిస్కమ్‌లు వెల్లడించడాన్ని ప్రజాసంఘాలు తప్పుబట్టాయి. ఇప్పటికే సేకరించిన మీటర్లకు చెల్లింపులు జరిగిపోయాయని, ఇప్పుడు ఆ మీటర్లను ఏం చేస్తారంటూ ప్రజా సంఘాలు నిలదీశాయి.

### ముడుపులపై విచారణేదీ?: బాబూరావు

రాష్ట్రంలో విద్యుత్తు పంపిణీ సంస్థలు అదానీ విద్యుత్తు పంపిణీ సంస్థలుగా మారిపోయాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్.బాబూరావు విమర్శించారు. 'అదానీతో ఒప్పందంలో రూ.1750 కోట్ల మేర ముడుపులు ముట్టాయంటూ అమెరికా న్యాయస్థానంలో వెల్లడైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు దానిపై విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. వైసీపీ నేతలు మల్లాది విష్ణు, దేవినేని అవినాశ్ మంగళవారం ఈఆర్‌సీ రాంసింగ్ ఠాగూర్‌ను కలసి విద్యుత్తు చార్జీల భారాన్ని తగ్గించాలంటూ వినతి పత్రాన్ని అందించారు.

# మచిలీపట్నంలో తెలంగాణ ఏసీబీ సోదాలు

» 'గ్రీన్‌కో, ఏస్ నెక్స్ట్ జెన్' కార్యాలయం నుంచి రికార్డులు స్వాధీనం

» 'ఫార్ములా-ఈ రేస్' వ్యవహారంలో చిక్కుకున్న సంస్థ

» బీఆర్ఎస్‌కు రూ.41 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చినట్లు అభియోగం



మచిలీపట్నంలోని గ్రీన్‌కో, అనుబంధ ఏస్ నెక్స్ట్ జెన్ కార్యాలయంలో తెలంగాణ ఏసీబీ అధికారులు

మచిలీపట్నం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని గ్రీన్‌కో కార్యాలయం, గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏస్ నెక్స్ట్ జెన్ కార్యాలయంలో తెలంగాణ ఏసీబీ అధికారులు మంగళవారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఇక్కడ గ్రీన్‌కో సంస్థ ఎండీ, వైసీపీకి చెందిన చలమలశెట్టి సునీల్‌కు చెందిన గృహంలోనే గ్రీన్‌కో, ఏస్ నెక్స్ట్ జెన్ కార్యాలయాలను నడుపుతుండగా, స్థానిక పోలీసులకు సైతం సమాచారం ఇవ్వకుండా తెలంగాణకు చెందిన ఏసీబీ అధికారులు వచ్చారు. రికార్డులను, కంప్యూటర్లను, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలో ఫార్ములా-ఈ రేస్ ఒప్పందానికి ముందు గ్రీన్‌కో, అనుబంధ సంస్థలు భారత రాష్ట్ర సమితి పార్టీకి రూ.41 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చాయని, ఈ అంశంపై విచారణలో భాగంగా మచిలీపట్నం వచ్చినట్లు ఓ అధికారి తెలిపారు. ఈ వ్యవహారంపై రెండు రాష్ట్రాల్లోని గ్రీన్‌కో అనుబంధ సంస్థల కార్యాలయాల్లో ఏసీబీ అధికారుల తనిఖీలు జరుగుతున్న నేపథ్యంలో, ఇక్కడ ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. మచిలీపట్నానికి చెందిన చలమలశెట్టి సునీల్ గ్రీన్‌కో సంస్థ ఎండీగా ఉండి ప్రస్తుతం వైసీపీలో కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. తెలంగాణలో ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో చిక్కుకున్న గ్రీన్‌కోలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేయడం సంచలనం కలిగించింది.



కుటుంబంతో కొండమ్మ

## కాశీలో తప్పిపోయి.. 18 ఏళ్ల తర్వాత ఇంటికి..

» ఆర్మీ జవాన్ల సాయంతో సొంతూరు చేరిన మహిళ

జామి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదేళ్ల క్రితం కాశీలో తప్పిపోయిన మహిళ మంగళవారం హఠాత్తుగా స్వగ్రామంలో ప్రత్యక్షమవ్వడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. గ్రామస్థులు సైతం సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. ఇద్దరు ఆర్మీ జవాన్ల సాయంతో ఆమె ఇంటికి చేరుకోగా, వారికి ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలుపుకొంది. విజయనగరం జిల్లా జామి మండలం విజినిగిరి గ్రామానికి చెందిన వాకాడ సత్యనారాయణ, కొండమ్మ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి 18 ఏళ్ల క్రితం కాశీ యాత్రకు వెళ్లారు. అక్కడ కొండమ్మ వారి నుంచి తప్పిపోయింది. భర్త, కుటుంబీకులు పది రోజులు అక్కడే ఉండి ఎంత వెదికినా ఆమె ఆచూకీ లభించక, స్వగ్రామానికి తిరిగొచ్చారు. కొండమ్మ దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. ఇటీవల ఆమె భర్త మంచాన పడ్డారు. కుటుంబ సభ్యులంతా.. కొండమ్మ ఇక లేదనుకుని ఆశలు వదిలేసుకున్నారు. ఈ నేపథ్యంలో 15రోజుల క్రితం శ్రీనగర్‌లో కొండమ్మ భిక్షాటన చేస్తుండగా, అక్కడే విధులు నిర్వహిస్తున్న విజయనగరానికి చెందిన భారత ఆర్మీజవాన్లు సైలాడ సాయి, శ్రీమణికంఠ చూశారు. కొండమ్మ తెలుగులో మాట్లాడాన్ని గమనించారు. ఆమె నుంచి వివరాలు రాబట్టారు. అప్పటికే ఆమె ఆరోగ్యం క్షీణించింది. తర్వాత విజయనగరంలో తమకు తెలిసిన ఆర్మీ అధికారుల వద్దకు పంపి అక్కడే వైద్యం చేయించారు. అనంతరం ఈ ఇద్దరు జవాన్లు కొండమ్మను శనివారం స్వగ్రామం విజినిగిరి తీసుకుని వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## సెర్ప్ ఉద్యోగుల ఇంక్రిమెంట్లకు గ్రీన్ సిగ్నల్

» 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందించిన సెర్ప్ సీఈఓ

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సమ్మె చేపట్టిన సెర్ప్ ఉద్యోగుల ఇంక్రిమెంట్లకు గ్రీన్ సిగ్నల్ లభించింది. గత సర్కార్ హయాంలో సమ్మె చేసినందుకు సెర్ప్ సిబ్బందికి 9 రోజుల జీతం కట్ చేశారు. దీంతో పాటు గత ఏడాది జనవరి ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్‌లు పెండింగ్‌లో పెట్టారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో "సెర్ప్ సిబ్బందికి 'ఇంక్రిమెంట్' ఇక్కట్లు" అనే శీర్షికతో వచ్చిన వార్తకు సెర్ప్ సీఈఓ వీర పాండ్యన్ స్పందించారు. ఎఫ్‌టీఈలు 2,759 మందికి, అనుబంధ సిబ్బందికి జనవరిలో ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లను మంజూరు చేస్తూ సెర్ప్ సీఈఓ ఆదేశాలిచ్చారు. అయితే సమ్మె చేపట్టిన రోజులకు మాత్రం వేతనాలు అందించేందుకు ప్రభుత్వం అంగీకరించలేదు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు మంజూరు చేసినందుకు సెర్ప్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# చిత్రజ్యోతి

SINCE 1965

## క్లైమాక్స్‌లో కన్నీళ్లొచ్చాయి

- రేణూ దేశాయ్




అరవింద్ కృష్ణ, బిగ్ బాస్ ఫేమ్ దివి, మేఘన శ్రీనివాస్, వినయ్ కీలక పాత్రల్లో నటించిన సినిమా '1000 వర్డ్స్'. రమణ విల్లర్ట్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. హైదరాబాద్‌లో ప్రదర్శించిన మూవీ స్పెషల్ షోకు రేణూ దేశాయ్, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, మధుర శ్రీధర్, జ్యోతి పూర్వజ్, సుకు పూర్వజ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా రేణూ దేశాయ్ మాట్లాడుతూ 'మూవీ అద్భుతంగా ఉంది. క్లైమాక్స్ చూశాక నాకు కన్నీళ్లొచ్చాయి. ఇంత మంచి సినిమాను తీసిన టీమ్‌కు ఆల్ ద బెస్ట్' అని అన్నారు. ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రం అందరినీ కంటతడి పెట్టించింది. ప్రతి ఒక్కరి హృదయాలను కుదిపేస్తుంది. ఈ చిత్రానికి కచ్చితంగా అవార్డులు వస్తాయి' అని అన్నారు. 'ఈ మూవీ నాకెంతో ప్రత్యేకం. సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్' అని హీరో అరవింద్ కృష్ణ అన్నారు. చిత్ర దర్శకనిర్మాత రమణ విల్లర్ట్ మాట్లాడుతూ 'ఓ తల్లి బిడ్డను కనేటప్పుడు పడే బాధను చూపించాలనే తపనతో ఈ సినిమా తీశాము. అమ్మ పాత్రలో మేఘన అద్భుతంగా నటించారు' అని అన్నారు.

## అద్భుతమైన ప్రపంచంలోకి...

అడవి శేష్ కథానాయకుడిగా విజయ్‌కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'జీ 2'. 2018లో విడుదలై ఘనవిజయం సాధించిన స్పై థ్రిల్లర్ 'గూఢచారి' సినిమాకు ఇది కొనసాగింపు. టి.జి.విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా యూరప్ షూటింగ్ షెడ్యూల్‌లో కథానాయిక, 'బేబీ జాన్' ఫేమ్ వామికా గబ్బీ, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ చేరినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా వామికా మాట్లాడుతూ "ఈ అద్భుతమైన స్పై థ్రిల్లర్ ప్రపంచంలోకి అడుగుపెట్టినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఎందరో ప్రతిభావంతులతో నిండిన ఈ టీమ్‌తో పనిచేయడం స్ఫూర్తినిస్తోంది" అని తెలిపారు. ఈ చిత్రంలో మురళీ శర్మ, సుప్రియ యార్లగడ్డ, మధుశాలినీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## ఇండస్ట్రీలో నాకో స్థానం కల్పించారు

- హీరో ధర్మ



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. కిరణ్ తిరుమల శెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరీధర్ నిర్మించారు. ఇటీవలే రిలీజైన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా హీరో ధర్మ మాట్లాడుతూ 'ఈ సినిమాను ఆదరించడం ద్వారా చిత్ర పరిశ్రమలో యువ హీరోగా నాకో స్థానం కల్పించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. కొత్త వాళ్లకు ఇండస్ట్రీలో ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని మరోసారి రుజువైంది' అని అన్నారు.

# ఆస్కార్ 2025 బరిలో భారతీయ చిత్రాలు




ప్రతిష్ఠాత్మక ఆస్కార్ 2025 బరిలో నిలిచే సినిమాల జాబితా వచ్చింది. 97వ అకాడమీ అవార్డ్స్‌కు సంబంధించిన నామినేషన్స్‌ను మంగళవారం ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసింది. ఉత్తమ చిత్రం విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 323 సినిమాలు పోటీ పడగా, 207 సినిమాలు నామినేట్ అయ్యాయి. భారతదేశం నుంచి ఆరు భారతీయ చిత్రాలు నామినేషన్స్ పొందాయి. తమిళ చిత్రం 'కంగువ', మలయాళ చిత్రం ఆడుజీవితం (ది గోట్ లైఫ్), 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' హిందీ చిత్రం 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్', 'గర్ల్స్ విల్ బీ గర్ల్స్', బెంగాలీ చిత్రం 'పుతుల్' నామినేట్ అయ్యాయి. భారతీయ నేపథ్యం ఉన్న 'సంతోష్' చిత్రం యూకే నుంచి ఉత్తమ అంతర్జాతీయ చిత్రం విభాగంలో నామినేషన్ దక్కించుకొంది. ఈ చిత్రాలకు ఈ నెల 8 నుంచి 12వరకూ ఓటింగ్ జరగనుంది. జనవరి 17న తుది జాబితాను అకాడమీ ప్రకటిస్తుంది. మార్చి 2న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది.

**కంగువ :** 'కంగువ' చిత్రం ఆస్కార్ బరిలో నిలవడం ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ చిత్రం ప్రతిచోటా ప్రేక్షకులను తిరస్కారాన్ని ఎదుర్కొంది. గతేడాది నిర్మాతలకు అత్యధిక నష్టాలను మిగిల్చిన చిత్రంగా నిలిచింది. వెయ్యేళ్ల క్రితం ఆదిమ తెగల మధ్య జరిగిన యుద్ధాల నేపథ్యంలో 'కంగువ' చిత్రం తెరకెక్కింది. శివ దర్శకత్వం వహించారు. దిశాపటానీ, బాబీడియోల్ కీలకపాత్రలు పోషించారు. 'కంగువ' ఆస్కార్ నామినేషన్ దక్కించుకోవడానికి కారణం కథాంశం, విజువల్స్, సినిమాటోగ్రఫీ అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఆడుజీవితం :** పృథ్వీరాజ్ సుకుమారన్ కథానాయకుడిగా నటించిన సర్వైవల్ థ్రిల్లర్ 'ఆడుజీవితం'. పలు భారతీయ భాషల్లో విడుదలైన ఈ చిత్రం అన్ని చోట్లా చక్కటి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. నజీబ్ అహ్మద్ అనే మలయాళీ స్నేహితుడితో కలసి ఉపాధి కోసం సౌదీకి వెళ్తాడు. ఏజెంట్ చేసిన మోసం కారణంగా అక్కడ ఓ కర్కోటకుడైన గొర్రెల యజమాని చేతిలో బందీ అవుతాడు. ఎడారి మధ్యలో సరైన తిండీ, తిప్పలు లేక ఎన్నో అవస్థలు పడతాడు. దారి తెన్నూ తెలియని ఎడారి నుంచి బయట పడేందుకు అతను చేసిన ప్రయత్నాలతో సినిమా ఉత్కంఠ భరితంగా ఉంటుంది.

**స్వాతంత్ర్య వీర్ సావర్కర్ :** స్వాతంత్ర సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్'. రణ్‌దీప్ హుడా దర్శకత్వం వహిస్తూ టైటిల్ రోల్ పోషించారు. బ్రిటిష్ వారిపై పోరాడేందుకు సావర్కర్ ఎంచుకున్న పంథా, అండమాన్ జైల్లో సుదీర్ఘ కారాగార వాసం చేస్తూ ఆయన అనుభవించిన బాధలు, జైలు నుంచి విడుదలయ్యాక 'హిందుత్వ' భావజాలాన్ని సృష్టించాల్సిన అవసరం ఎందుకొచ్చింది అనే అంశాల చుట్టూ అల్లుకున్న కథతో తెరకెక్కించారు.

**ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్ :** పాయల్ కపాడియా రచించి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్'. ఇద్దరు కేరళ అమ్మాయిలు ఉపాధి కోసం ముంబై నగరానికి వెళ్లి అక్కడ నర్సులుగా పనిచేస్తుంటారు. అక్కడి నగర జీవితంలోని ఇబ్బందులు, నీడ కోసం పేదవారు పడే పాట్లు, మనుషుల మధ్య అనుబంధాల నేపథ్యంలో కథ సాగుతుంది.

**సంతోష్ :** హిందీ చిత్రం 'సంతోష్'లో షహనా గోస్వామి ప్రధాన పాత్ర పోషించారు. ఈ రూరల్ క్రైమ్ డ్రామాకు సంధ్యా సూరి దర్శకత్వం వహించారు. భర్త మరణంతో అతని కానిస్టేబుల్ ఉద్యోగాన్ని పొందిన మహిళ పాత్రలో షహనా గోస్వామి నటించారు. ఓ బాలిక మర్డర్ కేసును ఛేదించే క్రమంలో గ్రామీణ నేపథ్యంలో ఉత్కంఠ భరితంగా తెరకెక్కింది. ఇప్పటికే ఈ చిత్రం కేన్స్ ఫెస్టివల్‌లో అవార్డు పొందింది.

### తొలి ప్రయత్నంలోనే ఆస్కార్ బరిలో


ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్న తొలి బెంగాలీ చిత్రంగా 'పుతుల్' చరిత్రలో స్థానం దక్కించుకుంది. దర్శక నిర్మాతగా ఇందిరా ధర్‌కు ఇది తొలి చిత్రం కావడం విశేషం. అలీ ఫజల్, హీరోయిన్ రిచా చద్దా సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'గర్ల్స్ విల్ బీ గర్ల్స్'. మీరా అనే విద్యార్థిని జీవితంలో జరిగిన ఆసక్తికర సంఘటనల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కింది.



## కుటుంబ ప్రేక్షకులు మెచ్చే చిత్రం

నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో నటించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈనెల 12న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'ఈనెల 9న అనంతపురంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని ప్లాన్ చేశాం. సినిమాలో యాక్షన్ సన్నివేశాలు బాగుంటాయి. ఈ చిత్రం బాలకృష్ణ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాల్లో ఒకటిగా నిలుస్తుంది' అని అన్నారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "డాకు మహారాజ్' చిత్రం రోబోయే చిత్రాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఇందులో ఐదు యాక్షన్ సీక్వెన్సులు ఉంటాయి. మంచి వినోదం, హత్తుకునే భావోద్వేగాలతో కుటుంబ ప్రేక్షకులు మెచ్చేలా ఈ సినిమా ఉంటుంది' అని అన్నారు. కథానాయిక ప్రగ్యా జైస్వాల్ మాట్లాడుతూ 'జనవరి 12 నా పుట్టిన రోజు. ఈ చిత్ర విజయాన్ని నా జన్మదిన కానుకగా అందిస్తారని కోరుకుంటున్నా' అని అన్నారు. హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ 'నా సినీ ప్రయాణంలో ఈ చిత్రం ప్రత్యేకంగా నిలుస్తుంది' అని అన్నారు.

## వేసవి బరిలో...



కోలీవుడ్ సూపర్ స్టార్ అజిత్ కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తూ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో అజిత్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో అదరగొట్టారు. ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ప్రభు, ప్రసన్న, అర్జున్ దాస్ సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

### అజిత్‌కు తప్పిన ప్రమాదం



అజిత్‌కుమార్‌కు పెను ప్రమాదం తప్పింది. రేసింగ్ అంటే అమితాసక్తి చూపే ఆయన.. దుబాయ్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న '24హెచ్' రేసింగ్ ఈవెంట్‌లో పాల్గొననున్నారు. ఇందుకోసం అజిత్ రేసింగ్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ఆయన కారు అదుపు తప్పి పక్కనే ఉన్న ట్రాక్ గోడను ఢీకొంది. ఈ సంఘటన జరిగిన వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది ఆయనను వేరే కారులోకి తరలించారు. అజిత్ ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. కాగా, అజిత్ నటించిన 'విడాముయర్చి' చిత్రం సంక్రాంతికి విడుదలకావాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదాపడింది.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

## ముత్యాల ముగ్గు








వి.ఇ.లత
బెంగళూరు

11 చుక్కలు, సంధుచుక్కలు 7వ చుక్కలో నిలపాలి

ఈ-మెయిల్: features@andhrajyothy.com





టోల్ గేటును గుద్దేసి వెళుతున్న కారు

# గంజాయి వ్యాపారుల బరితెగింపు

## ఆపబోయిన పోలీసులు, టోల్‌ప్లాజా గేటును ఢీకొట్టి పరారీ

- కొంతదూరం వెళ్లాక గంజాయితో సహా కారు వదిలేసి జంప్
- ఆ వెనుకే మరో వాహనం... అందులోని వారూ పరారీ
- మొదటి కారులో 120 కిలోలు, రెండో దానిలో 80 కిలోల గంజాయి

జగ్గయ్యపేట రూరల్/నందిగామ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, పోలీసులు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా గంజాయి స్మగ్లర్లు బరితెగించిపోతున్నారు. గంజాయి రవాణాపై ముందస్తు సమాచారం అందుకున్న నందిగామ డివిజన్ పోలీసులు మంగళవారం పకడ్బందీ వ్యూహం పన్నినా వ్యాపారులు తప్పించుకొని పారిపోగా వాహనాలను మాత్రం పట్టుకోగలిగారు. మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ కారులో మాదకద్రవ్యాలు రవాణా అవుతున్నాయనే సమాచారంతో తనిఖీలు చేస్తున్న పోలీసులను గమనించిన కారు కీసర టోల్‌ప్లాజా బార్‌ను ఢీకొని తనిఖీలు చేస్తున్న పోలీసుల మీదకు రావటంతో వారు అప్రమత్తమై ప్రమాదం నుంచి బయట పడ్డారు. దాంతో డ్రైవర్ కొద్ది దూరం వెళ్లాకైనా పట్టుబడగాననే భయంతో నందిగామ శివారు వైజంక్షన్ సమీపంలోని ఇళ్ల మధ్య కారును వదిలేసి పారిపోయాడు. పోలీసులు హైవేపై, డ్రోన్లతో ఎంత వెతికినా కారు ఆచూకీ దొరకలేదు. ఈ లోగా మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ ఉన్న కారు ఉదయం నుంచి ఇళ్ల ప్లాట్‌ల మధ్యలో ఆగి ఉండటంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఏసీపీ తిలక్, తహసీల్దార్ సురేష్‌బాబు అక్కడకు చేరుకుని కారులో 120 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసినట్లు ఏసీపీ తిలక్ తెలిపారు. గంజాయి హడావిడి ఉండటంతో ఉదయం నుంచి డ్రోన్‌ల సహాయంతో గాలింపు నిర్వహిస్తూ మిగతా 6లో..

# 1600

పండగ వేళ ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. పండగకు ముందు, తర్వాత 1,600 ప్రత్యేక సర్వీసులు నడపడానికి సిద్ధమైంది. వీటిలో 1,370 బస్సులను రిజర్వేషన్ ప్రాతిపదికన, మరో 230 సర్వీసులను ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా అప్పటికప్పుడు నడిపేలా ప్లాన్ చేసింది. హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం, రాయలసీమ, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించనుంది.




## సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

### ఈ ఏడాది రికార్డు స్థాయిలో ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయం

- 1,370 సర్వీసులకు రిజర్వేషన్ అవకాశం
- రిజర్వులో మరో 230 స్పెషల్ బస్సులు
- పండగకు వచ్చే వారికి 780, తిరుగు ప్రయాణాలకు 590 సర్వీసులు
- హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం, రాయలసీమ, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు
- సంక్రాంతి స్పెషల్ బస్సుల షెడ్యూల్ విడుదల చేసిన ఆర్టీసీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సంక్రాంతి పండగకు ఆర్టీసీ భారీగా స్పెషల్ బస్సులను నడపనుంది. ఈ సారి సెలవులు పది రోజుల పాటు ఉండటంతో సొంతూళ్లకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా 1600 స్పెషల్ బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. సంక్రాంతి స్పెషల్ బస్సుల షెడ్యూల్‌ను మంగళవారం అధికారికంగా విడుదల చేసింది. వీటిలో 1,370 బస్సులు రిజర్వేషన్ ప్రాతిపదికన నడిపేలా ప్లాన్ చేసింది. మరో 230 బస్సులను అప్పటికప్పుడు వచ్చే రద్దీ (ఆన్ డిమాండ్ రష్)కి అనుగుణంగా నడిపేందుకు వీలుగా రిజర్వులో ఉంచాలని నిర్ణయించింది. గతేడాది సంక్రాంతికి హైదరాబాద్ నుంచి భారీగా ప్రయాణికులు మిగతా 6లో..

**రాజమండ్రి, వైజాగ్‌కు స్పెషల్ బస్సులు**

పండగకు ముందు హైదరాబాద్ తర్వాత రాజమండ్రికి 13వ తేదీ వరకు 235 స్పెషల్ బస్సులు నడపాలని నిర్ణయించింది. తిరుగు ప్రయాణాలకు మాత్రం స్పెషల్ బస్సులు నడపడం లేదు. విశాఖపట్నం రూట్‌లో పండగకు ముందు 80 స్పెషల్ బస్సులు, పండగ తర్వాత 42 స్పెషల్స్ చొప్పున మొత్తం 122 బస్సులను నడపాలని నిర్ణయం తీసుకుంది. బెంగళూరుకు పండగకు ముందు 14 బస్సులు, పండగ తర్వాత రద్దీ నిమిత్తం 23 బస్సులు చొప్పున మొత్తంగా 37 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. చెన్నైకు పండగకు ముందు 13, పండగ తర్వాత 14 బస్సులు వెరసి 27 స్పెషల్స్ నడపనుంది. రాయలసీమ జిల్లాలకు పండగకు ముందు 142, పండగ తర్వాత 186 చొప్పున మొత్తం 328 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల నుంచి వచ్చే ప్రయాణికులంతా విజయవాడకు వచ్చి ఇక్కడి నుంచి రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. అలాగే విజయవాడలో పీఎన్‌బీఎస్‌కు వచ్చే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఎటు వెళతారన్నది ఆ సందర్భంలో కానీ తెలియదు. అందుకే వారి కోసం రిజర్వుడుగా 230 స్పెషల్ బస్సులను ఉంచాలని నిర్ణయించింది.

# బ్యాంకు లోన్లు.. ఇంటి అవసరాలకు..



మచిలీపట్నం సబ్‌జైలు నుంచి బియ్యం మాయం కేసులో నిందితులను కస్టడీలోకి తీసుకుంటున్న పోలీసులు

**బియ్యం మాయం కేసులో నగదు వాడుకున్నట్టు చెప్పిన మేనేజర్ మానస్‌తేజ**

- పోలీస్ కస్టడీకి బియ్యం కేసు నిందితులు
- గోడౌన్ మేనేజర్, మిల్లు యజమాని, లారీ డ్రైవర్‌ను విచారించిన పోలీసులు
- ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారణ
- నేడు జిల్లా కోర్టులో పైముగ్గురు నిందితుల బెయిల్ పిటిషన్లపై విచారణ

మచిలీపట్నం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): మాయమైన బియ్యం విక్రయించగా వచ్చిన నగదును బ్యాంకు లోన్ల చెల్లింపునకు, ఇంటి అవసరాలకు వాడినట్టు గోడౌన్ మేనేజర్ మానస్ తేజ్ పోలీసు విచారణలో చెప్పినట్టు తెలుస్తోంది. మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్ నుంచి బియ్యం మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు బుధవారం కస్టడీలోకి తీసుకుని ఏడు గంటలపాటు విచారించారు. ఉదయం 10 గంటలకు సబ్‌జైలు నుంచి వారిని ప్రత్యేక వాహనంలో మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గోడౌన్ మేనేజర్ మానస్‌తేజ, మిల్లుయజమాని బొర్రా బాల ఆంజనేయులు, లారీ డ్రైవర్ మిగతా 6లో..

## మేనేజర్, లారీ డ్రైవర్‌లను బలి పశువులను చేసేలా...

మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌ల నుంచి బియ్యం మాయం కేసులో కీలకపాత్రధారులను తప్పించేందుకు కొత్త కథనాలు తెరపైకి వస్తున్నాయి. గోడౌన్ మేనేజర్, లారీ డ్రైవర్‌లను బలి పశువులను చేసి పేర్ని కుటుంబం బయటపడేలా వ్యూహరచన జరుగుతున్నట్టు తెలుస్తోంది. గోడౌన్ పేర్ని నాని భార్య జయసుధ పేరున ఉండటంతో బియ్యం మాయం కేసులో ఆమెను ఏ1గా చేర్చారు. ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరైంది. ఈ కేసులో గోడౌన్ మేనేజర్ మానస్‌తేజను ఏ2గా, పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డిని ఏ3గా, మిల్లు యజమాని బొర్రా బాల ఆంజనేయులును ఏ4గా, లారీడ్రైవర్ బోట్ల మంగారావును ఏ5గా చేర్చారు. గోడౌన్ మేనేజర్ మానస్ తేజ పోలీసులకు చిక్కిన సమయంలో తెలిపిన వివరాల ప్రకారం మాజీ మంత్రి పేర్ని నాని పేరును ఏ6గా చేర్చి ఆయనపైనా కేసు నమోదు చేశారు. బియ్యం రవాణాలో, తూకంలో తేడాలుంటాయని, వాటిని ఎవరూ పట్టించుకోరని, అవకాశం ఉన్నపుడే ఎంతోకొంత సొమ్ము సంపాదించుకోవాలని గోడౌన్ మేనేజర్‌కు బియ్యం మాయం కేసులో నిందితుడిగా ఉన్న లారీడ్రైవర్ సూచించడంతోనే బియ్యంను అధికమొత్తంలో గోడౌన్ మేనేజర్ రవాణా చేయడానికి సహకరించారనే ప్రచారాన్ని వైసీపీ నాయకులు తెరపైకి తెస్తున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని భార్య ఈ కేసులో ఏ1గా, ఏ6గా పేర్నినాని ఉండటంతో ఈ కేసులో వారి ఇరువురి ప్రమేయం లేదని చూపేలా తెరవెనుక ఒప్పందం జరిగిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మానస్ తేజ పేర్ని కుటుంబానికి అత్యంత నమ్మకస్తుడు కావడంతోపాటు, వారివద్దనే ఏళ్లతరబడి పనిచేస్తుండటంతో ఈ కేసులో జైలుశిక్షపడినా అతని కుటుంబ పోషణకు ఇబ్బంది రానీయమని, తమపేర్లు ప్రస్తావించవద్దని తెరవెనుక ఒప్పందం కుదిరినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో గోడౌన్ మేనేజర్‌ను ఈ కేసులో మంగళవారం పోలీసులు విచారణ చేసిన సమయంలో గోడౌన్ యజమానులుగా ఉన్న పేర్ని నాని, ఆయన భార్య పేర్ని జయసుధ పేర్లు ప్రస్తావనకు వచ్చినపుడు సరైన సమాచారం చెప్పకుండా దాటవేత ధోరణితో వ్యవహరించినట్లు తెలుస్తోంది. పేర్ని నాని కుటుంబం ఈ కేసులో నుంచి ఎలాగైనా తప్పించుకునేందుకు తెరవెనుక పలువిధాల ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

**నాని బెయిల్ పిటిషన్‌పై విచారణ 20కి వాయిదా**

బియ్యం మాయం కేసులో ఏ6గా ఉన్న పేర్ని నాని ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 6న ఈ కేసు విచారణకు రాగా మంగళవారానికి వాయిదా పడింది. మంగళవారం ఈ కేసు విచారణను మరలా ఈ నెల 20వ తేదీకి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

# డేంజర్ ఇండస్ట్రీస్!

## ఎన్టీఆర్ జిల్లాలో 9 ప్రమాదకర పరిశ్రమల గుర్తింపు

- వాటిలో ఆయిల్, విద్యుత్ రంగాలే అధికం
- అన్నీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలే..
- ప్రమాద రహిత పరిశ్రమల కోసం 'ఆపరేషన్ ఇండస్ట్రీస్' అమలు
- పరిశ్రమల వెంబడి ప్రాంతాల రక్షణకూ చర్యలు



ప్రమాద రహిత పరిశ్రమల కోసం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం చేపట్టిన 'ఆపరేషన్ ఇండస్ట్రీస్' తొమ్మిది ప్రమాదకర పరిశ్రమలు ఉన్నట్లు గుర్తించింది. అవి కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆయిల్, విద్యుత్ కంపెనీలుగా నిర్ధారణ అయ్యింది. వీటిలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఆయా పరిశ్రమల్లో ప్రమాదాల సంఖ్యను జీరో స్థాయికి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 1,047 పరిశ్రమలు ఉన్నాయి. కర్మాగారాల శాఖ పరిధిలో ఇవన్నీ రిజస్టర్ అయి ఉన్నాయి. వీటిలో ప్రభుత్వానికి సంబంధించి 27 పరిశ్రమలు ఉండగా.. ప్రైవేటు రంగానికి చెందినవి 1,020 పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమలలో మొత్తం 44,096 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో పురుషులు 39,800 మంది, మహిళలు 4,293 మంది ఉన్నారు. అమరావతి రాజధాని ప్రాంత పరిధిలో ఎన్టీఆర్ జిల్లా ఉంది. జిల్లాలో మెరుగైన పారిశ్రామిక వాతావరణం కల్పించటానికి నూరుశాతం ప్రమాద రహిత పరిశ్రమలను తీర్చిదిద్దేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం 'ఆపరేషన్ ఇండస్ట్రీస్' మిగతా 6లో..

**ప్రమాదకరమైన పరిశ్రమలు ఇవే..**

జి.కొండూరులోని గెయిల్ ఇండియా లిమిటెడ్ (బూస్టర్ స్టేషన్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్ - ఆయిల్ డివిజన్), ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలోని హెచ్‌పీసీఎల్ (గ్యాస్ డివిజన్), జి.కొండూరు మండలం కట్టుబడిపాలెంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్ - ఆయిల్ డివిజన్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్ - టెర్మినల్), కొండపల్లిలోని ఐవోసీఎల్ - ఎల్‌పీజీ, నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టీటీపీఎస్), ల్యాంకో కొండపల్లి పవర్ ప్లాంట్ లిమిటెడ్ (గ్యాస్ ఆధారితం) పరిశ్రమలను ప్రమాదకర పరిశ్రమలుగా కర్మాగారాల శాఖ గుర్తించింది. ఈ మేరకు కలెక్టర్ లక్ష్మీశకు అధికారులు నివేదికను సమర్పించారు.



## విజ్ఞాన దీపికలు

సందడిగా విజయవాడ పుస్తక మహోత్సవం 6లో

## ఉమ్మడి జిల్లాకు కొత్తగా 23 మద్యం షాపులు

- ఇప్పటికే రెండు జిల్లాల్లో 236 మద్యం దుకాణాలు
- త్వరలో విడుదల కానున్న నోటిఫికేషన్

6లో

## ఉత్కంఠగా వాలీబాల్ పోటీలు

8లో

- ముగిసిన లీగ్, నేటి నుంచి ప్రీ క్వార్టర్స్

# ఎలక్ట్రిక్ బస్సులపై రగడ

## విజయవాడకు వచ్చే 100 బస్సులు ఆర్టీసీ సొంతం కావు

- కేవలం అద్దె ప్రాతిపదికన ప్రైవేటు కంపెనీలతో ఏర్పాటు
- ఫేమ్ - 2 పథకంలో గైడ్‌లైన్స్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం
- ఉద్యోగ సంఘాల ఆక్షేపణ..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో ప్రవేశపెట్టే ఎలక్ట్రిక్ బస్సులపై రగడ నడుస్తోంది. ఆర్టీసీకి నేరుగా కాకుండా.. అద్దె ప్రాతిపదికన ప్రైవేటు కంపెనీలు నేరుగా నడిపేలా ఇవ్వబోతున్న అధికారాలపై సంస్థ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమౌతోంది. కేంద్ర ప్రాయోజిత పథకం ఫేమ్ - 2 ద్వారా సమకూర్చుకునే విద్యుత్ బస్సుల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం ఆర్టీసీ ఉద్యోగ సంఘాలలో తీవ్ర అలజడి రేపుతోంది. ఆర్టీసీ పరిధిలో నడపాల్సిన విద్యుత్ బస్సులను ప్రైవేటు సంస్థలకు అప్పగించటాన్ని ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఆర్టీసీలో చాలా కాలంగా డిమాండ్‌కు అనుగుణంగా కొత్త బస్సులను కొనుగోలు చేయటం లేదు. ఇలాంటి సందర్భంలో విద్యుత్ బస్సులు వస్తున్నాయన్న సమాచారం ఉద్యోగులతో పాటు ప్రయాణికులను కూడా కొంతకాలంగా సంతోషపెడుతోంది. కానీ ఆర్టీసీని నిర్వీర్యం చేసేలా విద్యుత్ బస్సులను ఆర్టీసీ కాకుండా ప్రైవేటు సంస్థలు నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉండటంతో వాటిని తప్పనిసరిగా పాటించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆర్టీసీకి ఇచ్చే ఎలక్ట్రికల్ బస్సులను గతంలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం తరహాలో కేంద్రం గ్రాంట్ (సెంట్రల్, స్టేట్, ఆర్టీసీ షేర్) గా కాకుండా ప్రైవేటు సంస్థలకు అద్దె ప్రాతిపదికన నడిపేలా అనుమతులు ఇస్తోంది. దీంతో ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీ సొంతం కావు. కేవలం అద్దె బస్సులుగానే ఉంటాయి. గతంలో ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్నప్పటి నుంచి ఆర్టీసీలో అద్దె బస్సులను కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీనిపై సమ్మెలు కూడా జరిగిన సందర్భాలు ఉన్నాయి. సమ్మెల తర్వాత సంస్థలో 20 శాతం మించి అద్దె బస్సులను ప్రవేశపెట్టేది లేదని ఆనాడు ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఆ తర్వాత క్రమంలో ఒప్పందాల ఉల్లంఘన జరిగింది. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అయితే మరీ దారుణంగా 40 శాతం మేర అద్దె బస్సులకు టెండర్లు పిలిచారు. ఇంకో పది శాతం పెరిగితే ఆర్టీసీలో సగం మేర అద్దె బస్సుల స్థానం ఉంటుంది. ఇలాంటి పరిస్థితులలో విద్యుత్ బస్సుల ఆగమనంతో ఆర్టీసీ బస్సుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని భావించారు. విజయవాడ నగరానికి తొలి విడతగా 100 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయి. ఈ బస్సులన్నింటిని విద్యాధరపురం బస్ డిపో పరిధి నుంచి ప్రైవేటు సంస్థ నడుపుతుంది. ఈ బస్సులన్నీ కూడా ఆర్టీసీకి సొంతంగా రావటం లేదు. కేంద్రం ఏ కంపెనీకి ఇస్తే ఆ కంపెనీయే ఆర్టీసీ బస్ డిపోల నుంచి ఆపరేషన్ నిర్వహిస్తుంది. ఆర్టీసీ ఉద్యోగులు ఈ బస్సులలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఒక రకంగా ఆర్టీసీతో పాటు సమాంతర ప్రైవేటు యాజమాన్యం అధికారం చెలాయించే పరిస్థితులు ఏర్పడబోతున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. దశల వారీగా సంస్థకు వచ్చే ఎలక్ట్రికల్ బస్సులన్నింటినీ ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తుంటే ఆర్టీసీ పాత్ర నామమాత్రమౌతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రికల్ బస్సులను అందించే కంపెనీలకు ఆర్టీసీ డిపోలు షెల్టర్ ఇస్తాయి. ప్రైవేటు కంపెనీ ప్రయోజనాల కోసం ఆర్టీసీ డిపోలను వాడుకుంటారు. అద్దె ప్రాతిపదికన ఇచ్చే మిగతా 6లో..

## ఎడమ కాలవ పరిధిలో లస్కర్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

6లో



## హైకోర్టు వద్ద హెల్మెట్ వినియోగంపై అవగాహన

8లో

## ఈఆర్సీ ఎదుట శీర్షాసన నిరసన

- వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు తొలగించాలని డిమాండ్

8లో




## బైరాగిని యువత చదవాలి..

**- యార్లగడ్డ లక్ష్మీప్రసాద్**



**విజయవాడ కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) :** యువత తప్పనిసరిగా బైరాగి కవిత్వాన్ని చదవాలని, ఆయన కవిత్వాన్ని పునఃముద్రణ చేసి యువతకు అందించాల్సిన అవసరం ఉందని సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. కవి ఆలూరి బైరాగి శతజయంతి సభలో యార్లగడ్డ మాట్లాడారు. కవిత్వాన్నే జీవన శ్వాసగా గౌరవించిన బైరాగి, తన ప్రత్యేక వ్యక్తీకరణ, పదవిన్యాసంతో చిక్కని మానవత్వ భావాలు, సామాజిక స్పృహతో తెలుగు సాహిత్య ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను అప్పట్లోనే తన కవిత్వంలో ప్రస్తావించారని తెలిపారు. తెలుగు సాహిత్యంలో తనదైన ముద్రవేసిన బైరాగి జీవిత కాలంలో ప్రజల అపార్థానికి గురైనప్పటికీ, సాహిత్య ప్రేమికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయనను నిరాశావాది, అరాచకవాది అని చిత్రీకరించడం తప్పుడు అభిప్రాయమన్నారు. రచయిత బండ్ల మాధవరావు, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ, బైరాగి పాఠకుల హృదయాల్లో నిలిచిపోయే పదచిత్రాల సృష్టికర్త అన్నారు. బాలల పత్రిక చందమామ హిందీ సంచికకు కొంత కాలం సంపాదకత్వం వహించిన ఆయన, పిల్లల పత్రికల్లో సులువైన భాషలో రచనలు చేశారన్నారు. జీవితాంతం కవిత్వమే ప్రధాన వ్యాపకంగా కొనసాగారన్నారు. బైరాగి మరణానంతరం ఆయన కవిత్వ సంకలనం ఆగమగీతికు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

## పదోతరగతి పాఠశాల

**విజయవాడ సిటీలైఫ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :** పుస్తకాల్లో అనేక పాఠ్యాంశాలు ఉంటాయి. వాటికి సంబంధించి ప్రశ్నలు, జవాబులకు పెద్ద నోట్స్ రాయాలి. వాటిలో అత్యంత ముఖ్యమైన.. పరీక్షల్లో తరచుగా వచ్చే ప్రశ్నలు, జవాబులకు విద్యార్థులకు అందజేస్తుంది 'పాఠశాల'. పదో తరగతి విద్యార్థుల కోసం విజయవాణి ప్రింటర్స్ ఈ 'పాఠశాల' పుస్తకాన్ని తీసుకొచ్చింది. ప్రతినెల ఈ పుస్తకాన్ని ముద్రిస్తుంది. మొత్తం అన్ని పాఠ్యంశాలకు సంబంధించి ప్రశ్నలు, జవాబులు ఇందులో ఉంటాయి. దీని సంవత్సర చందా రూ.600లుగా ఉంటే పుస్తక మహోత్సవంలో రూ.500లకే అందజేస్తున్నారు. స్టాల్ నంబర్ 31, 32లో ఈ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.




### పాఠశాలే గ్రంథాలయం..

అందుబాటులో 3 వేల పుస్తకాలు : సీతారెడ్డి, ఉపాధ్యాయుడు

పటమటలోని కేసీబీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచేందుకు పాఠశాలలో ప్రత్యేకంగా ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో 3వేల పుస్తకాలున్నాయి. బాలసాహిత్యం, మహనీయుల జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలున్నాయి. ప్రతి రోజుకు ఒక పీరియడ్ పుస్తక పఠనం కోసం కేటాయిస్తున్నాం. 45 మంది విద్యార్థులు కూర్చుని చదివేలా సదుపాయాలున్నాయి.

### ప్రత్యేక ఆకర్షణగా 'చైనా' ముద్రణలు

సాధారణంగా పుస్తకాలు తెలుగు రాష్ట్రాల్లో ప్రచురితమవుతాయి. ఇది కాకపోతే పొరుగు రాష్ట్రాల్లో ముద్రణవుతాయి. ఈ దేశంలో కాకుండా చైనాలో ముద్రణ అయిన పుస్తకాలు పుస్తక మహోత్సవంలో ప్రత్యేకార్షణగా నిలిచాయి. స్పేస్, వరల్డ్ హిస్టరీ, అవర్ ప్లానెట్ ఎర్త్, పంచతంత్ర, 365 అమేజింగ్ యానిమల్స్ మహాభారత, హిస్టరీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలు చైనాలో ప్రచురితమయ్యాయి. ఈ పుస్తకాలు స్టాల్ నంబరు 52లో ఉన్న విశాలాంధ్ర బుక్ హౌస్‌లో కొలువుదీరాయి.




# ప్రజా సమస్యలే నాజర్ కళారూపాలు

**- కె.శ్రీనివాస్, 'ఆంధ్రజ్యోతి' మాజీ సంపాదకులు**



**విజయవాడ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :** ప్రజా సమస్యలనే కళారూపాలుగా మార్చి ఆదరణ పొందే అవకాశం ఉండటం కారణంగానే ఆదర్శవాది నాజర్ కళాకారుడిగా మారాడని 'ఆంధ్రజ్యోతి' మాజీ సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో మంగళవారం రామోజీరావు సాహిత్యవేదికపై బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ శతజయంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానవక్తగా శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆ రోజుల్లో ప్రజలను ప్రభావితం చేసి, వారి గుండెల్లో నిలిచిపోయినవారే సెలబ్రిటీలుగా ఉండేవారన్నారు. అలాంటి వారిని నేడు విస్మరించటం దురదృష్టకరమన్నారు. వివిధ పాత్రల ద్వారా పీడితతాడితుల ఆర్తిని, ఆవేదనను, ఆవేశాన్ని సులువుగా ప్రేక్షకులకు అందించడం నాజర్ ఘనత అని వివరించారు. ప్రముఖ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ, తెలుగులో బుర్రకథకు ఒక ప్రామాణిక రూపం కల్పించి, పండిత పామరులకు ఆమోదయోగ్యంగా, ఆస్వాదనీయంగా తీర్చిదిద్దిన ఘనత షేక్ నాజర్‌దేనన్నారు. నాజర్‌ను కేవలం బుర్రకథ పితామహుడిగా గుర్తుపెట్టుకుంటే ఆయన కృషికి అన్యాయం చేసినట్టేనన్నారు. తెలుగులో ప్రజా పాటకు, అభ్యుదయ గీతాలకు మూలపురుషుడన్నారు. సుద్దాల హనుమంతుతో సమకాలీనుడుగా ఉంటూ నాజర్ ఆ తర్వాతి వారైన గద్దర్, వంగపండు, పాణిగ్రాహి తదితర ప్రజాకళాకారులకు గురుతుల్యుడయ్యాయని వివరించారు. తాడిత పీడిత ప్రజల బాధలని వాళ్ల నుడికారంలోనే ప్రతిధ్వనింప చేసి, అలాంటి రచనలన్నిటికీ ఆదర్శవంతమైన నమూనాలను అందించాడన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఖాదర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ, బిచ్చమెత్తి సంగీత విద్య నేర్చుకున్న నాజర్ తర్వాతి కాలంలో బుర్రకథలో ఆనాటి కళాకారులందరి హృదయాలను గెలుచుకున్నారన్నారు. సంగీత దర్శకుడు చక్రవర్తి, నటి జమున నాజర్ శిష్యులేనన్నారు. సినీవిమర్శకుడు రంగావఝల భరద్వాజ మాట్లాడుతూ, ఒకే వ్యక్తి అన్ని పాత్రలనీ, అన్ని రసాలనూ పోషిస్తూ, మూడు గంటల సేపు శ్రోతలను అలరించే కళారూపం బుర్రకథ అని వివరించారు. ఇంత అద్భుతమైన ప్రక్రియను పూర్తిస్థాయి ప్రజాకళగా మార్చి చిరస్థాయి కలిగించిన వ్యక్తి నాజర్ అన్నారు. నాజర్ కుమారుడు బాషూజీ మాట్లాడుతూ, కేవలం ఒకే బాణీతో నడిచే పూర్వజానపద కళారూపాలకు శాస్త్రీయ సంగీత స్వభావాన్ని అద్ది, సందర్భానికి తగ్గట్టు నడకను మార్చి ఆ కళారూపానికి ఔన్నత్యం తెచ్చారన్నారు. పండితపామరులిద్దరినీ ఆకర్షించేలా, శాస్త్రీయ, జానపద బాణీలను మేళవించడం నాజర్‌కే సాధ్యమన్నారు. సాహితీ స్రవంతి బాధ్యులు వొర ప్రసాద్ తదితరులు సభలో పాల్గొన్నారు.

# ప్రమాదంలో రాజ్యాంగ విలువలు

**- కేరళ మాజీ విద్యాశాఖామంత్రి ఎంఏ బేబి**



'రాజ్యాంగం మనకేమిచ్చింది' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఏ బేబి తదితరులు

**విజయవాడ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :** నేడు కొందరు సాంప్రదాయవాదుల కారణంగా భారత రాజ్యాంగం, దానిలో పొందుపరిచిన మౌలిక విలువలూ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని కేరళ మాజీ విద్యాశాఖ మంత్రి ఎం.ఎ.బేబి అన్నారు. మంగళవారం జస్టిస్ హెచ్.ఎస్. నాగమోహనదాస్ రచించిన రాజ్యాంగం మనకేమిచ్చింది? పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. నాగమోహనదాస్ రచనలో రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, గణతంత్రం తదితర విలువలను ప్రస్తావిస్తూ, వాటికి నేడు ఎదురవుతున్న సవాళ్లను నేరుగా వర్ణించారన్నారు. కొందరు సాంప్రదాయ విలువల పేరుతో రాజ్యాంగంలోని మౌలికలను ప్రశ్నించడం దురదృష్టకరమన్నారు. స్వాతంత్ర్యపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న అనేకానేక మేధావులు ఎన్నో చర్చలు, సమావేశాల అనంతరం ఆమోదించిన రాజ్యాంగాన్ని ప్రశ్నించడం మనుస్మృతి కోణంలో ప్రశ్నించడం దారుణమన్నారు. నేడు న్యాయవ్యవస్థతో సహా అన్ని వ్యవస్థలూ సాంప్రదాయ భావాలతో ప్రభావితం కావడం ప్రమాదకరమన్నారు. దేశంలో ఏ నిర్ణయానికైనా రాజ్యాంగమూ, దాని మౌలికవిలువలే మూలాధారం కావాలన్నారు.

# దేవుడి సొమ్మును కొట్టేశారు

» టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

**అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి):** గత వైసీపీ ప్రభుత్వంలో దేవుడి సొమ్ము రూ.3.50 కోట్లు కొట్టేశారంటూ టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందింది. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి రామానాయుడు, స్వచ్ఛాంధ్ర సంస్థ చైర్మన్ పట్టాభిరామ్ అర్జీలు స్వీకరించారు. బీజేపీ నేత వై కామేశ్వరరావు ఫిర్యాదు చేస్తూ... 'గత వైసీపీ ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్ల పేరుతో తెనాలి మండలం సంగంజాగర్లమూడిలో దేవస్థానం భూములను నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్నారు. అందుకుగాను దేవస్థానానికి జమ చేయాల్సిన రూ.3.50 కోట్లను కాజేశారు. దేవుడి సొమ్మును స్వాహా చేసిన దోపిడీదారులపై చర్యలు తీసుకోండి' అని వినతిపత్రం అందించారు.

# డేంజర్ ఇండస్ట్రీస్!

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లాలో పారిశ్రామిక ప్రమాదాలు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని తిరిగి జీరో స్థాయికి తీసుకు వచ్చేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రత్యేకంగా చొరవ చూపి ఇండస్ట్రీ సేఫ్టీ ఆడిట్‌ను చేయిస్తున్నారు. జిల్లాలో ప్రమాదకర పరిశ్రమలపై అధ్యయనం చేయించారు. పరిశ్రమలు పెట్టడం సురక్షితమనే వాతావరణాన్ని తీసుకువచ్చేందుకు వీలుగా కర్మాగారాల శాఖను మేలుకొలిపే ప్రయత్నం చేశారు. దీంతో ప్రమాదకర పరిశ్రమలు తీసుకోవాల్సిన చర్యలపై పెద్ద కసరత్తే నిర్వహిస్తున్నారు.

### భద్రతా చర్యలపై అవగాహన

కర్మాగారాల శాఖ సమర్పించిన నివేదిక ప్రకారం కలెక్టర్ లక్ష్మీశ వీటికి సంబంధించి సమీప ప్రాంతాల మ్యాపింగ్‌కు ఆదేశించారు. పైన పేర్కొన్న పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే వాటి పరిధి ఎంత మేర ఉంటుంది? ప్రమాదాలు జరిగినపుడు ఏం చేయాలి? రిస్క్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను ఏ విధంగా అమలు చేయాలి? వంటి వాటిపై దృష్టి సారించాల్సిన అంశాల గురించి ప్రధానంగా కలెక్టర్ ఇప్పటికే కర్మాగారాల శాఖతో పాటు రెవెన్యూకి దిశానిర్దేశం చేశారు.

# గంజాయి వ్యాపారుల బరితెగింపు

(5వ పేజీ తరువాయి)

కారును గుర్తించామని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

### గౌరవరం వద్ద మరో కారు..

జగ్గయ్యపేట మండలంలోని గౌరవరం వద్ద గంజాయి తరలిస్తున్న మరో కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్లలో గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి వేగంగా వాహనాన్ని వెనుకగా తిప్పుకుని వెళ్తుండటాన్ని గమనించిన పోలీసులు కారును చేజ్ చేయటంతో గౌరవరం వద్ద సర్వీస్ రోడ్డులోకి దిగిన కారు గ్రామంలో నుంచి పొలంలోకి దూసుకెళ్లింది. అక్కడి నుంచి రహదారి లేకపోవటంతో కారు వదిలి పారిపోయారు. పోలీసులు కారును అక్కడ నుంచి చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన కారులో ముగ్గురు వ్యక్తులున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కారు ఆగగానే దిగి పొలాల్లోకి పారిపోయారని చెప్పారు. డ్రోన్ కెమెరాలతో పహారా చేసినా ఆచూకీ లభించలేదు. కారులోని 80 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# బీసీ రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి

» సీఎస్ విజయానంద్‌కు కేశన శంకరరావు వినతి

**అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :** బీసీ రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు కోరారు. మంగళవారం ఈ మేరకు ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. 'కుల గణనను చేపట్టాలి. ఎస్సీ, ఎస్టీలకు బ్యాక్‌లాగ్ పోస్టులను అమలు పరుస్తున్న విధంగానే బీసీలకు అమలు చేయాలి. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో తగిన న్యాయం చేయాలి. జనాభా దామాషా ప్రకారం యూనివర్శిటీల్లో వీసీలు, రిజిస్ట్రార్‌లు, రెక్టార్లుగా బీసీలను నియమించాలి' అని కోరినట్టు తెలిపారు.

# ఎడమ కాల్వ పరిధిలో లస్కర్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

» ప్రాజెక్టు కమిటీకి విజయవాడలో భవనం కేటాయించాలి

» ఎన్ఎస్పీ ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ సమావేశంలో తీర్మానాలు




మాట్లాడుతున్న కోట వీరబాబు

**విజయవాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :** నాగార్జునసాగర్ ఎడమకాలువ పరిధిలో లస్కర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ తీర్మానించింది. ప్రాజెక్టు పరిధిలో ఉన్న జలవనరులశాఖ ఆస్తులను ప్రభుత్వం పరిరక్షించాలని నిర్ణయం తీసుకున్నారు. విజయవాడలోని రైతు శిక్షణ కేంద్రంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్ట్ కమిటీ తొలి సమావేశం మంగళవారం జరిగింది. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, ఉపాధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణలు మాట్లాడుతూ, నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని మూడో జోన్‌కు కృష్ణానదీ యాజమాన్య బోర్డు డిసెంబరు, జనవరి నెలలకు 12 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఉత్తర్వులు ఇవ్వగా తెలంగాణ ప్రభుత్వం సోమవారం అరకొరగా 600 క్యూసెక్కులు విడుదల చేసిందన్నారు. ఈ నీటిని 1700 క్యూసెక్కులకు పెంచి ఆంధ్రా సరిహద్దులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం గత 2014-19లో కేంద్ర జలశక్తి తీసుకున్న నిర్ణయం మేరకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. డీసీల చైర్మన్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎడమ కాల్వవ పరిధిలో సాగునీటి వ్యవస్థ నిర్వీర్యమైందని, అందులో ఉన్న కంప, పూడిక తొలగించి ఆయకట్టు చివరి ప్రాంతానికి సాగునీరు వెళ్లటానికి చర్యలు తీసుకోవాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఎన్ఎస్పీ నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.గోపినాథ్, జగ్గయ్యపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్. సంతోష్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# బ్యాంకు లోన్లు.. ఇంటి అవసరాలకు

(5వ పేజీ తరువాయి)

బోట్ల మంగారావును సాయంత్రం ఐదు గంటల వరకు విచారణ చేసిన పోలీసులు అనంతరం వీరిని కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి పోలీసులు మీపై ఒత్తిడి తెచ్చేలా ప్రవర్తించారా.. మీకేమైనా ఇబ్బంది కలిగిందా అని నిందితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు వీరిని మచిలీపట్నం స్పెషల్ సబ్‌జైలుకు తరలించారు.

### బియ్యం మాయంపై లోతుగా విచారణ

బియ్యం మాయం కేసులో కస్టడీకి తీసుకున్న నిందితులను రాబర్ట్‌సన్‌పేట(ఆర్‌పేట) సీఐ ఏసుబాబు, మరికొందరు పోలీస్ అధికారులు ఏడుగంటల పాటు విచారించారు. విచారణ తీరును వీడియో తీశారు. న్యాయవాదుల సమక్షంలో ఈ విచారణ కొనసాగింది. "గోడౌన్ నుంచి బియ్యం తరలించాలని ఎవరు చెప్పారు. ఎప్పుడెప్పుడు, ఎక్కడికి బియ్యం తరలించారు. ఎవరికి విక్రయించారు. కిలోబియ్యం ఎంత ధరకు విక్రయించారు. వచ్చిన సొమ్మును ఎవరి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు." అనే అంశాలపై పోలీసులు నిందితులను ప్రశ్నించినట్లు తెలిసింది. గోడౌన్ యజమాని పేర్ని నాని, ఆయన భార్య పేర్ని జయసుధ బ్యాంకు ఖాతాలకు నగదు జమచేశారా అనేదానిపై లోతుగా విచారించి వివరాలు రాబట్టినట్టు సమాచారం. బియ్యం విక్రయించగా వచ్చిన నగదులో కొంతమేర బ్యాంక్ లోన్‌లు కట్టేందుకు, ఇంటి అవసరాల నిమిత్తం వాడుకున్నట్లు ఈ కేసులో ఏ-2గా ఉన్న గోడౌన్ మేనేజర్ మానస్‌తేజ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. కాగా, రిమాండ్‌లో ఉన్న పైముగ్గురు నిందితుల బెయిల్ పిటిషన్‌పై విచారణ గురువారం జిల్లా కోర్టులో జరగనుంది. ఈ కేసులో ఏ-3గా ఉన్న పౌరసరఫరాలశాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డికి ఇప్పటికే బెయిల్ మంజూరైంది.

# ఉమ్మడి జిల్లాకు కొత్తగా 23 మద్యం షాపులు

» ఇప్పటికే రెండు జిల్లాల్లో 236 మద్యం దుకాణాలు

» త్వరలో విడుదల కానున్న నోటిఫికేషన్

**ఎన్టీఆర్‌కు 12, కృష్ణాకు 11**



**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల సంఖ్య పెరగనుంది. నూతనంగా మరో 23 షాపులు ఏర్పాటుకానున్నాయి. దీనికి సంబంధించి ప్రకటన త్వరలో వెలువడనుంది. కొత్త దుకాణాలను గీత కార్మికులకు కేటాయించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెచ్చిన కొత్త మద్యం పాలసీ ప్రకారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో 236 దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణా జిల్లాలో123 దుకాణాలు ఉన్నాయి. విజయవాడలో మొత్తం 39, మచిలీపట్నంలో ఐదు షాపులు ఏర్పాటయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో అన్ని మండలాల్లో కలిపి 58, కృష్ణా జిల్లాలో అన్ని మండలాల్లోను కలిపి 98 షాపులు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్లు ఉండగా విజయవాడలో మూడు ఉన్నాయి. విజయవాడ తూర్పు, పశ్చిమ, భవానీపురం స్టేషన్లు ఉన్నాయి. ఇవి కాకుండా జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం, నందిగామ, తిరువూరులో ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. కృష్ణా జిల్లాలో మొత్తం ఎనిమిది స్టేషన్లు ఉన్నాయి. మచిలీపట్నం, అవనిగడ్డ, బంటుమిల్లి, గన్నవరం, గుడివాడ, మొవ్వ, నందివాడలో స్టేషన్లు ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు కేటాయించిన షాపులు కాకుండా కల్లు గీత కార్మికులకు కొన్ని షాపులను రిజర్వ్ చేస్తామని ప్రకటించింది. దీనిప్రకారం నూతనంగా 23 షాపులు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న 236 మద్యం దుకాణాలతో కలిపి మొత్తం 259 దుకాణాలు ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉంటాయి. కొత్తగా ఏర్పాటయ్యే షాపులకు రెండేళ్ల కాలపరిమితికి లైసెన్స్ ఇస్తారు. కొత్త షాపులకు ఫీజు వివరాలు, ఇతర షరతులు త్వరలో వెలువడనున్నాయి.

**● ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న షాపులు**

విజయవాడ (39), జగ్గయ్యపేట (4), కొండపల్లి (2), నందిగామ (6), తిరువూరు (1) ఉండగా.. మండలాల వారీగా ఎ.కొండూరు (2), చందర్లపాడు (3), జి.కొండూరు (4), గంపలగూడెం (4), ఇబ్రహీంపట్నం (3), జగ్గయ్యపేట రూరల్ (4), కంచికచర్ల (5), మైలవరం (4), నందిగామ రూరల్ (2), పెనుగంచిప్రోలు (5), రెడ్డిగూడెం (2), తిరువూరు రూరల్ (2), వత్సవాయి (2), వీరులపాడు (2), విజయవాడ రూరల్ (10).

**● కృష్ణా జిల్లాలో ప్రస్తుతం ఉన్న షాపులు**

మచిలీపట్నం (5), గుడివాడ (7), పెడన (4), తాడిగడప (3), ఉయ్యూరు (6), మండలాల వారీగా.. అవనిగడ్డ (2), బంటుమిల్లి ( 3), బాపులపాడు (9), చల్లపల్లి (4), గన్నవరం (9), ఘంటసాల (3), గుడివాడ రూరల్ (2), గుడ్లవల్లేరు (6), గూడూరు (2), కంకిపాడు (7), కోడూరు (3), కృత్తివెన్ను (4), మచిలీపట్నం రూరల్ (3), మోపిదేవి (3), మొవ్వ (4), నాగాయలంక (3), నందివాడ (4), పామర్రు (4), పమిడిముక్కల (3), పెడన రూరల్ (2), పెదపారుపూడి (2), పెనమలూరు (5), తోట్లవల్లూరు (3), ఉంగుటూరు (5), ఉయ్యూరు రూరల్ (3).



జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం పొందిన ఫొటో



హుస్సేన్ ఖాన్ నుంచి అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు

# ఫొటోగ్రాఫర్ వెంకటేశ్వరరావుకు జాతీయ ఉత్తమ అవార్డు

**విస్సన్నపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :** ఒడిసాలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగిన హుస్సేన్ ఖాన్ 7వ జాతీయ ఫొటోగ్రఫీ వర్క్‌షాపులో మండలంలోని పుట్రేల గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ వెంకటేశ్వరరావు జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. ద్వితీయ స్థానంలో నిలిచి హుస్సేన్ ఖాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వర్క్‌షాపులో నాలుగు రాష్ట్రాల నుంచి పలువురు ఫొటోగ్రాపర్లు పాల్గొన్నారు. ఒడిసా రాష్ట్రంలో మల్కన్‌గిరి ప్రాంతంలో అంతరించిపోతున్న బోండా గిరిజన తెగలకు సంబంధించిన సంప్రదాయ వేషధారణ, నృత్యాలు, జీవనశైలీ విధానాలపై తీసిన ఫొటోకు ఈ అవార్డు లభించినట్టు వెంకటేశ్వరరావు తెలిపారు. పలువురు ఫొటోగ్రాపర్లు, పుట్రేల గ్రామస్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# ఎలక్ట్రిక్ బస్సులపై రగడ

(5వ పేజీ తరువాయి)

బస్సులను ఆ కంపెనీయే మెయింటినెన్స్ వ్యవహారాలను చూడాల్సి ఉంటుంది. దాని కోసం సొంతగా గ్యారేజీలు ఏర్పాటు చేసుకోవాలి. కానీ, ఆర్టీసీ గ్యారేజీలనే ప్రైవేటు కంపెనీలు ఉపయోగించుకుంటాయి. ఎలక్ట్రికల్ బస్సుల కోసం ఆర్టీసీ అధికారులే విద్యుత్ కనెక్షన్ కోసం దర ఖాస్తు చేశారు. అద్దె ప్రాతిపదికనే అయినపుడు ఆర్టీసీ ఎందుకు హైటెన్షన్ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేయాలని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్, ఛార్జింగ్ స్టేషన్ నిర్వహణ భారం కూడా ఆర్టీసీ మోయాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అయితే విద్యుత్ బస్సులను స్వాగతిస్తున్నామని, నిర్వహణ మాత్రం ఆర్టీసీ స్వయంగా చేపట్టాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనికి విరుద్ధంగా జరిగే మాత్రం ఆందోళనకు సమాయత్తమౌతామని హెచ్చరిస్తున్నాయి.

# బాల్య వివాహ రహిత భారత్

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**కృష్ణలంక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :** బాల్యవివాహ రహిత భారత్ కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాల్సిన అవసరముందని, సమష్టి కృషితో బాల్యవివాహాలను అరికట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన బాల్యవివాహ రహిత భారత్ (బాల్యవివాహ ముక్త్ భారత్) ప్రచార కార్యక్రమ అమల్లో భాగంగా బాల్య వివాహాల నిషేధ అధికారుల (సీఎంపీఓ)తో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాల్య వివాహం ఓ సాంఘిక దురాచారమని, అది బాలికల విద్య, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలిగించడమే కాకుండా వారి కలలను సాకారం చేసుకొనే అవకాశాలను దూరం చేస్తుందని వివరించారు. ప్రతిఒక్కరూ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఇందులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకొనేందుకు చట్టాల పటిష్ఠ అమల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. బాలికల విద్యతో పాటు సాధికారిత కల్పించడం ద్వారా పేదరికాన్ని తద్వారా బాల్య వివాహాలు వంటి సాంఘిక దురాచారాలను దూరం చేయొచ్చని పేర్కొన్నారు.

# ఈవీల రాయితీపై మత్తు వదలని రవాణాశాఖ

**అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి) :** 'రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగం భారీగా పెరగాలి.. 2029 నాటికి రెండులక్షల ద్విచక్ర వాహనాలు, పదివేల ఆటోలు, 20వేల కార్లు, ఆర్టీసీలో వందశాతం ఎలక్ట్రిక్ బస్సులు ఉండాలి. అందుకు గానూ ఇటు తయారీదారులకు ఇటు కొనుగోలుదారులకు రాయితీలిద్దాం' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సందర్భాల్లో చెప్పారు. అందుకు అనుగుణంగా డిసెంబరు రెండో వారంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వాహన పాలసీ ఐదేళ్లకు రూపొందించింది. అమలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వంలోని తొమ్మిది శాఖల్లో కీలకమైంది రవాణాశాఖ. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు, ఎలక్ట్రిక్ వాహన విధానంపై నెల రోజులైనా రవాణా శాఖలో ఎలాంటి చలనం లేదు. విద్యుత్ వాహన కొనుగోలుదారులకు షో రూమ్ ధరలో ఐదు శాతం రాయితీతోపాటు ఐదేళ్ల పాటు పన్ను మినహాయింపు ఉంది. దానికి సంబంధించి రవాణా శాఖ ఎలాంటి జీవో విడుదల చేయక పోవడంతో విద్యుత్ వాహన విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు కొనుగోలుదారులు సైతం పన్నులపై స్పష్టత వచ్చే వరకూ వేచి చూద్దామనే ధోరణిలో ఉన్నారు.

# సంక్రాంతికి ఆర్టీసీ..

(5వ పేజీ తరువాయి)

తరలివచ్చారు. అప్పట్లో ఆర్టీసీ అధికారులు 1,310 బస్సులను నడిపారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా బస్సులను నడపలేకపోయారు.

### పక్కాప్లాన్‌తో ముందుకు..

గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఆర్టీసీకి 150 (కాలం తీరిపోవడం, స్క్రాప్‌కు పంపించడం) బస్సుల వరకు తగ్గాయి. దీంతో స్పెషల్ బస్సులు నడిపేంత స్థాయిలో ఆర్టీసీ దగ్గర బస్సులు లేకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. అయినప్పటికీ గతేడాది కంటే 290 బస్సులను అదనంగానే నడపటానికి ప్లాన్ చేసింది. సంక్రాంతి పండగకు ముందు 780 బస్సులు, పండగ తర్వాత తిరుగు ప్రయాణాల కోసం 590 బస్సులను నడపాలని నిర్ణయం తీసుకుంది. కిందటిసారి హైదరాబాద్ నుంచి భారీగా ట్రాఫిక్ వచ్చింది. తెలంగాణ ఏపీకి చెందిన బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు కార్ల మీద పెద్ద సంఖ్యలో వచ్చారు. దీనిని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌కు ఈ సంక్రాంతికి ముందు 296 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. జనవరి 9న 45, 10న 70, 11న 70, 12న 70, 13న 23 స్పెషల్ బస్సుల చొప్పున హైదరాబాద్‌కు ఇక్కడి నుంచి పంపించనుంది. సాధారణ షెడ్యూల్ బస్సులు 200 వరకు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయి. పండగ తర్వాత తిరుగు ప్రయాణాలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌కు 325 బస్సులను నడపాలని ప్లాన్ చేసింది. జనవరి 14న 12, 15న 58, 16న 81, 17న 38, 18న 27, 19న 78, 20న 31 స్పెషల్ బస్సుల చొప్పున నడపనుంది.

### బ్రాయిలర్ ధరలు



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 118,126, 137 |
| చికెన్ విత్ స్కిన్ | 224 |
| చికెన్ స్కిన్‌లెస్ | 234 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

## నేటి నుంచి చేనేత ఎక్స్‌పో

మొగల్రాజపురం, జనవరి 7 ( ఆంధ్రజ్యోతి): గ్రామీణ చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో వీవర్స్ సర్వీస్ సెంటర్ ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శనను మొగల్రాజపురం ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 8(బుధవారం) నుంచి నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా 40 నుంచి 50 వరకు ఉన్న వివిధ రకాల చేనేత కార్మికులు, చేనేత సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ప్రారంభిస్తారని, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొంటారని తెలిపారు.

## లయోలాలో సెన్సస్ డేటా వర్క్‌షాప్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఏపీ, టీఎస్ సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్ భారతి

**భారతీనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి):** ఆంధ్రా లయోలా కళాశాల సాంఖ్యక శాస్త్ర విభాగంలో ఏర్పాటు చేసిన సెన్సస్ డేటా వర్క్‌షాపు ల్యాబ్‌ను మంగళవారం ఏపీ, టీఎస్ సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్ భారతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఐఐటీలు, ఐఐఎంలు కేంద్ర నిధులతో పనిచేసే యూనివర్సిటీలతో సమానంగా ఆంధ్రా లయోలా కళాశాల పనిచేస్తుందన్నారు. ఆంధ్రా లయోలా కళాశాలలో ఏర్పాటు చేసిన సెన్సస్ డేటా వర్క్‌షాపు ల్యాబ్ భారతదేశంలోని 48వ ల్యాబ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ హెచ్‌వోడీ, డీసీవో డిప్యూటీ రిజిస్ట్రార్ టిఎల్ఎన్ శివకుమార్, కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ ఎం సగయరాజు, ప్రిన్సిపాల్ జీఏపీ కిశోర్, ఫాదర్ జాన్, రెక్టార్, విభాగాధిపతులు శ్రీనివాసరావు, ఫాదర్ టి.ప్రభు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న గద్దె క్రాంతికుమార్

## స్కూల్ ఫీజులకు ఆర్థికసాయం

**పటమట, జనవరి 7(ఆంధ్రజ్యోతి) :** ఐదో డివిజన్‌కు చెందిన సిరిపురం రంజిత్ పిల్లల స్కూల్ ఫీజు నిమిత్తం రూ.20వేలు, 14వ డివిజన్‌కు చెందిన బత్తుల చిలకయ్య పిల్లల స్కూల్ ఫీజు నిమిత్తం రూ.20వేలు గద్దె కాంత్రికుమార్ మంగళవారం అందజేశారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గద్దె రమేష్, కొండేటి వెంకట్రావ్, తెంటు రాజేష్,తుమ్మల వెంకట్, ఎం నితిన్, ఎం భార్గవ్, ధీరజ్‌లు పాల్గొన్నారు.



తబలా వాయిస్తున్న విద్యార్థులు

## ఘనంగా డాన్‌బాస్కో స్కూల్ వార్షికోత్సవం

**పటమట, జనవరి 7(ఆంధ్రజ్యోతి) :** గురునానక్ నగర్‌లోని డాన్‌బాస్కో స్కూల్ 42వ వార్షికోత్సవం పాఠశాల ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దెఅనురాధ మాట్లాడుతూ 42 సంవత్సరాలుగా నిరాటకంగా విద్యాబోధన చేయడం సామాన్య విషయం కాదని, అందుకు అవిరళ కృషి చేస్తున్న యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. ఎస్‌కేవీపీ విద్యాసంస్థలు అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ వి నారాయణరావు మాట్లాడుతూ సీబీఎస్ఈ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కూడా మాతృభాష తెలుగును అనేక రకాలుగా నేర్పిస్తున్నామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.



## తంబి పుణ్యక్షేత్రంలో నాలుగో రోజు నవదిన ప్రార్థనలు

**ఉంగుటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :** బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్లను పురస్కరించుకుని పెదఅవుటపల్లిలోని తంబి పుణ్యక్షేత్రంలో మంగళవారం నాలుగవరోజు నవదిన ప్రార్థనలు ఘనంగా జరిగాయి. ఈ నవదిన ప్రార్థనలకు ప్రధాన యాజకులుగా విశాఖ మేత్రాసనం, కోడూరుమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవ.ఫాదర్ పసుపులేటి యుగల్‌కుమార్ హాజరయ్యారు. ఆయన ఇతర గురువులతో కలిసి దివ్యపూజాబలిని సమర్పించి సందేశమిచ్చారు. తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్, స్థానిక విచారణగురువులు రెవ.ఫాదర్ గోపు అభిలాష్, సహాయక గురువులు రెవ.ఫాదర్ గొన్నూరి ఏసుపాదం, కోశాధికారి రెవ.ఫాదర్ దిరిశం జోసఫ్ జయప్రసాద్ పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆలోచనలకు పదును

## ఆకట్టుకున్న పాలిటెక్ ఫెస్ట్ 2025

(ఆటోనగర్, ఆంధ్రజ్యోతి)

నేటితరం యువత ఆలోచనలకు పదును పెడుతున్నారు. చదువులోనే కాకుండా వారి ఆలోచనలతో రైతన్నకు దన్నుగా నిలిచేందుకు ఆధునిక శాస్త్ర సాంకేతికతో కూడిన వ్యవసాయ విధానాలు రూపొందిస్తున్నారు. తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి నమూనాలు ఆవిష్కరిస్తున్నారు. ఇలాంటి ప్రయోగాలెన్నో విజయవాడలో రెండు రోజుల పాటు నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్-2025లో మన ముందుంచారు పాలిటెక్నిక్ విద్యార్థులు. విద్యార్థుల్లోని అత్యుత్తమ ప్రతిభను వెలికి తీసేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ట్రైనింగ్ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో రెండు రోజులపాటు నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్-2025 మంగళవారంతో ముగిసింది. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన పలు వైజ్ఞానిక ఆకృతులు చూపరులను ఆకట్టుకున్నాయి.

### తరగతి గదిలో ప్రశ్నలకు ఈ నమూనాతో సమాధానం



తరగతి గదుల్లో టీచర్లు చెప్పే ప్రతి పాఠాన్ని శ్రద్ధగా వినే విద్యార్థులకు మనసులో కొన్ని ప్రశ్నలు ఆలోచింపజేస్తుంటాయి. అలాగే కొంతమంది విద్యార్థులకు అర్థం కావు. అలాంటి నమూనానే మా 33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం. విద్యుత్ కేంద్రం నుంచి వచ్చిన విద్యుత్‌ను పంపిణీ చేసే సబ్ స్టేషన్లో ఏ విధంగా పంపిణీ ఉంటుంది. విద్యుత్ స్టోరేజ్ వంటి కొన్ని యూనిట్లు ఎలా ఉపయోగపడతాయి అనే వాటి గురించి పూర్తి సబ్ స్టేషన్ నిర్మాణం చేశాం. తణుకు ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాల నుంచి వచ్చిన పవన్, ప్రవీణ్, శిరీష, కావ్య, శ్రావణి, తేజస్విని, శృతిలు ఈ నమూనాను నిర్మించారు.

-తణుకు ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

### స్మార్ట్ ఫార్మింగ్‌తో అధిక దిగుబడి



మట్టి లేకుండా కేవలం నీటితోనూ సాగు చేయొచ్చని చెబుతున్నారు అనకాపల్లి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు దివ్య, వసుధ, భవ్యలు. స్మార్ట్ ఫార్మింగ్‌తో పంటలను సాగు చేసే విధానం అబ్బురపర్చింది. దీనిలో వినియోగించే నీరు రీసైక్లింగ్ అవుతూ తక్కువ నీటితోనే పంటను పెంచుకోవచ్చని వివరిస్తున్నారు. కాంతి కోసం ఎల్ఈడీ లైట్లను వినియోగించి పంటకు కావాల్సిన కాంతిని అందిస్తున్నారు. ఈ పంటకు అతి తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడి సాగు చేయొచ్చని విద్యార్థులు చెబుతున్నారు.

-అనకాపల్లి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు



### లిథియం బ్యాటరీలకు బదులు గ్రావిటేషనల్ బ్యాటరీ

పరిశ్రమలు, పలు సంస్థలు, వాహనాలకు విద్యుత్ నిల్వ చేసుకోవడానికి లిథియం బ్యాటరీలను వినియోగిస్తున్నారు. దీంతో వాతావరణంలో కాలుష్యం పెరుగుతోంది. గేర్ సిస్టంతో గ్రావిటేషనల్ బ్యాటరీని రూపొందించారు వైజాగ్‌కు చెందిన విద్యార్థులు. దీనిలోకి విద్యుత్ రాగానే పీఎండీ మోటారు వేగంగా తిరుగుతోంది. దీని వేగాన్ని నియంత్రించడానికి, పెంచడానికి గేర్ సిస్టంని ఉపయోగించారు. దీని వల్ల మోటారు వేగంగా తిరుగుతోంది. దీంతో ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి అవుతోందని అల్వార్‌దాస్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు సందీప్, రాహుల్, కార్తీక్, వెంకటరమణ, కె.భరత్ వివరించారు.

-అల్వార్‌దాస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

## పటమట మత్స్యకార సంఘ అధ్యక్షుడిగా సుబ్బారావు



మత్స్యకార సంఘ సభ్యులను అభినందిస్తున్న చెన్నుపాటి గాంధీ

**పటమట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :** ది పటమట ప్రజా మత్స్యకార సహకార సంఘానికి మంగళవారం జరిగిన ఎన్నికల్లో సంఘ అధ్యక్షుడిగా పటమటలంకకు చెందిన చిప్పల సుబ్బారావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనకు ఎన్నికల అధికారి బి శానం లెనిన్‌బాబు నియామక పత్రం అందజేశారు. సెక్రటరీగా వల్లభనేని నరసింహారావు, డైరెక్టరుగా వల్లభనేని రమేష్, వల్లభనేని నరసింహారావు, వల్లభనేని సుబ్బారావు, కన్నా సుబ్బారావులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైనా అధ్యక్షుడు చిప్పల సుబ్బారావు, తదితర డైరెక్టర్లను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్లు చెన్నుపాటి గాంధీ అభినందించారు. ఎన్నికల అనంతరం చిప్పల సుబ్బారావు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు.

## 13 నుంచి వెంకటమ్మ పేరంటాల అమ్మవారి జాతర



కరపత్రాలు, క్యాలెండర్ విడుదల చేసిన ఈవో ప్రియాంక తదితరులు

**ప్రసాదంపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):** రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాల అమ్మవారి దేవస్థానంలో సంక్రాంతి జాతర మహోత్సవాలు 2025కు చెందిన కరపత్రాలు, 2025 క్యాలెండర్లను ఈవో పి. ప్రియాంక మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 18 వరకు సంక్రాంతి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు ఇనుగంటి లక్ష్మీ నరసింహాశర్మ, శివాలయం అర్చకులు పావులూరి హనుమత్ అశోక్, ఆలయ సహాయ అర్చకులు వెంపటి దుర్గాప్రసాద్, దేవస్థానం సూపర్ వైజర్ ఏ.మంగమ్మ పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు గద్దె శంకుస్థాపన



పూజా కార్యక్రమాలు చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**రాణిగారితోట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):** కృష్ణానదికి ఎంత పెద్ద స్థాయిలో వరదలు వచ్చినా పరిసర ప్రాంతాల్లో ఉండే వారి ఇళ్లల్లోకి చుక్క వరద నీరు కూడా రానివ్వకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 17వ డివిజన్‌లోని సిద్దం కృష్ణారెడ్డి కమ్యూనిటీ హాల్‌లో కిచెన్ షెడ్డు, ఫ్లోరింగ్ పనులు, తారకరామనగర్ కరకట్ట వద్ద మెట్లు, రైయిలింగ్ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం యనమలకుదురు నుంచి మెట్లబజార్ వరకు పంపిగ్ స్టేషన్లు నిర్మించి స్థానికుల ఇబ్బందులు తొలగిస్తుందని అన్నారు. డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం శాంపిల్ బిల్డింగ్ అభివృద్ధి పనుల పూర్తి చేయకపోవడంతో అనేక సమస్యలు నెలకొన్నాయని, ఆంధ్రజ్యోతి ఈ విషయాలను వెలుగులోకి తెచ్చిందన్నారు. తాము ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని, ఇందుకు ఆయనకు డివిజన్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ముని పోలిపల్లి, కొప్పోలు శ్రీనివాస చౌదరి, మొకర ఆదిబాబు, పల్లా సాగర్, మందుల వీరాస్వామి పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి

### గోళ్లమూడి శేఖర్‌బాబు



**కృష్ణలంక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):** మత్తుపదార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దని, దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు హితవు పలికారు. కృష్ణలంక పొట్టి శ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం మత్తుపదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాల వలన ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. నీతోడు మానసిక వికాసకేంద్ర జోనల్ కో ఆర్డినేటర్ ఎస్కె నజ్మా మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొని రావచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇ.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

● కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీఎంఈఎస్ఏ నాయకులు



ఏపీఎంఈఎస్ఏ క్యాలెండర్‌ను యూనియన్ నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

**చిట్టినగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి):** ఒకే క్యాడర్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పలువురు ఏపీఎంఈఎస్ఏ నాయకులు కమిషనర్ ధ్యానచంద్రను కోరారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమిషనర్ ధ్యానచంద్ర చాంబర్‌లో ఆయనను ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్(ఏపీఎంఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మనర్తి నాగేశ్వరరావు, వీఎంసీ యూనిట్ అధ్యక్షుడు శ్యామ్ సుందర బాబు ఇతర కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీఎంఈఎస్ఏ యూనిట్ క్యాలెండర్‌ను కమిషనర్ ధ్యానచంద్ర చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంలో పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఈఎస్ఏ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె. శివరామ ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎ.శ్రీకృష్ణ దేవరాయలు, యూనిట్ జనరల్ సెక్రటరీ సలీం అహ్మద్, ఉపాధ్యక్షుడు రాంబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ గుర్రం ప్రకాష్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఖాళీస్థలాల్లో పార్కులను అభివృద్ధి చేయాలి

**భారతీనగర్:** ప్రజలకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఖాళీ స్థలాల్లో పార్కులు అభివృద్ధి చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు.

మంగళవారం నగర కమిషనర్ ధ్యానచంద్ర ధ్యానచంద్ర ఏపీఐఐసీ కాలనీ, ఆచార్యరంగా రోడ్డు, గురునానక్‌కాలనీ, హైటెన్షన్ రోడ్డు, ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆచార్యరంగా నగరలో అంతర్గత రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఎస్ఈ పి.సత్యనారాయణను ఆదేశించారు. గురునానక్ కాలనీలో డివైడర్ల మధ్య గ్రీనరీని పెంచి కాలుష్యాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్‌ను ఆదేశించారు. హైటెన్షన్‌రోడ్డు విస్తరణకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్‌ను ఆదేశించారు. ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ లో సరైన ఎగ్జిట్, షెడ్యూల్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఎస్ఈ పి.సత్యకుమారిని ఆదేశించారు. మహానాడు రోడు లో డ్రెయిన్లను త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని ఈఈ సామ్రాజ్యంని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఆరోగ్య పెన్షన్ల పునఃపరిశీలన

### కలెక్టర్ లక్ష్మీశ



తుకారాం రాజాను పరామర్శిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, డీఎంహెచ్‌వో సుహాసిని

**కృష్ణలంక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):** ఆరోగ్య పెన్షన్లకు సమాన, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన ప్రయోజనాలు అందించాలనే ఉద్దేశంతో పెన్షన్ల ధ్రువీకరణ, పునఃపరిశీలన ప్రక్రియ చేపడుతున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా చేపట్టిన రూ.15 వేలపెన్షన్ల (వీల్‌చెయిర్, బెడ్‌కు పరిమితమైన/ సివియర్ మస్క్యులర్ డిస్ట్రోఫీ కేసులు, ప్రమాదబాధితులు) ధ్రువీకరణ, పునఃపరిశీలన ప్రక్రియను మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలోని సచివాలయం-1 పరిధిలో పరిశీలించారు. హెల్త్‌పెన్షన్ లబ్ధిదారు తుకారాం రాజాను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక బృందాలతో 358 పెన్షన్ల పునఃపరిశీలన ప్రక్రియను పారదర్శకంగా చేపట్టడం జరుగుతోందని, ఈ ప్రక్రియ పటిష్ట పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జియో ట్యాగింగ్‌తో పాటు పునఃపరిశీలన వివరాలను డిజిటల్ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని తదితరులున్నారు.

## ఉంగుటూరు మాజీసర్పంచ్ పొట్లూరి దుర్గాప్రసాద్ కన్నుమూత



పొట్లూరి దుర్గాప్రసాద్ (ఫైల్‌ఫొటో)

**ఉంగుటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :** ఉంగుటూరు గ్రామ మాజీ సర్పంచ్ పొట్లూరి దుర్గాప్రసాద్(85) సోమవారం రాత్రి హైదరాబాద్, నిజాంపేట్‌లోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. 1981-86లో గ్రామ సర్పంచ్‌గా గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. తొలుత కాంగ్రెస్‌పార్టీ నాయకుడిగా వున్న దుర్గాప్రసాద్ స్వర్గీయ ఎన్టీఆర్ పిలుపుతో టీడీపీలో చేరి పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఆయనకు కుమారుడు పొట్లూరి సీతారామప్రభు, కుమార్తెలు కోగంటి రమాదేవి, తుమ్మల ప్రవీణ వున్నారు. అమెరికాలో వున్న చిన్నకుమార్తె రాగానే ఈనెల 9న ఉదయం 8గంటలకు నిజాంపేట్‌లో అంత్యక్రియలు జరుగుతాయని కుమారుడు సీతారామప్రభు తెలిపారు.

# రైతు బజార్లలో రేట్ల రంకెలు

## జీవో నెం.29 నిబంధన మాయం

## రాజకీయ నేతల అండతో దళారుల దౌర్జన్యం

- లక్షల్లో జేబులు నింపుకుంటున్న వైనం
- వినియోగదారుల జేబులకు చిల్లు
- ఉన్నతాధికారుల దృష్టి అవసరం



**రైతుబజార్లలో కూరగాయల ధరలు రంకెలు వేస్తున్నాయి. దళారులు తమ దౌర్జన్యంతో వినియోగదారుల్ని దగా చేస్తున్నారు. కూరగాయలకు రేట్లు నిర్ణయించే ప్రక్రియలో జీవోను కాలరాసి సపరేట్‌గా అధిక రేట్లు నిర్ణయించుకొంటూ మార్కెట్ మాఫియా విజృంభిస్తోంది. రోజువారీగా లక్షల్లో, నెలవారీగా రూ. కోట్లల్లోనే తమ జేబులు నింపుకొంటున్నారు. ఒక వైపు మార్కెటింగ్ అధికారులు, ఇంకోవైపు రాజకీయ నేతలు, వీరిద్దరితో చేతులు కలిపి దళారులు రైతుబజార్లో కాసులపంట పండించుకొంటున్నారు. అడిగేవారు లేరనే ధైర్యమో, ఏమోగానీ రైతుబజార్లను మాత్రం తమ ఎస్టేట్‌లుగా మార్చుకొని మార్కెటింగ్ మాఫియా నడుపుతున్నారు. - విజయవాడ కల్చరల్, ఆంధ్రజ్యోతి**

రైతుబజార్లో రైతు స్టాల్స్, డ్వాక్రా గ్రూపులు, వీహెచ్‌సీ స్టాల్స్ వంటి మూడు రకాల దుకాణాలుంటాయి. ఈ స్టాల్స్‌లో కూరగాయల ధరల నిర్ణయాన్ని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు విజయవాడ కేంద్రంగా ప్రతిరోజు నిర్ణయిస్తారు. ఒక్కో రైతుబజారుకు చెందిన ఈవో ఒక్కోరోజు ధరలను నిర్ణయిస్తాడు. రాష్ట్ర ప్రభుత్వం 2012 ఫిబ్రవరి 16న ఇచ్చిన జీవో నెం.29 ప్రకారం హోల్‌సేల్ మార్కెట్ కమిటీ రూ.2 అధికంగాను రిటైల్ మార్కెట్ కంటే రూ.2 తక్కువగాను ధరను సమన్వయం చేసి నిర్ణయించాలి. దీంతో వినియోగదారులకు తక్కువ ధరల్లో కూరగాయలు లభించే అవకాశం, రైతులకు గిట్టుబాటయ్యే ధరలు కల్పించడంలోనూ రైతు బజార్లకు మంచి మార్కెటింగ్ వస్తోంది. అందుకే వినియోగదారులు తమ కూరగాయలు రైతుబజార్‌లో కొనుగోలుకే ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. అయితే కొంతమంది దళారులు రాజకీయ నేతల అండదండలతో చెలరేగి ప్రతి రైతు బజారులో ఒక మార్కెట్ మాఫియాగా మారి తమకు అనువుగా మార్చుకొంటున్నారు. మార్కెటింగ్ శాఖ, ఎస్టేట్ అధికారులకు, ముడుపుల ఆశ చూపి రూ.2 కంటే మించి పెట్టకూడని ధరలను రూ. 6 నుంచి రూ.10 వరకు అధికంగా పెంచి బోర్డులో నిర్ణయం చేసి రోజువారీగా రూ.లక్షల్లో సొమ్ము చేసుకొంటున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని 25కు పైగా రైతుబజార్ ధరలు నిర్ణయం విజయవాడ కేంద్రంగా సాగడంతో ఇక్కడి నుంచే మార్కెటింగ్ అధికారులు చక్రం తిప్పుతున్నారు. కూరగాయలు అమ్మే వ్యాపారుల దగ్గర లాభంలో వాటాలను క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర కార్యాలయం వరకు మార్కెటింగ్ అధికారుల్లో కొందరు దళారులతో కలిసి వాటాలు పంచుకుంటున్నారు. మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కార్యాలయాల్లో ఉన్నతాధికారుల వద్ద పనిచేస్తున్న పీఏలు సైతం ఈ ధరల నిర్ణయంలో అండగా ఉంటూ అభయహస్తం అందిస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఒక్కోరోజు ఉల్లిపాయలు 45 టన్నులు, అల్లం 30 టన్నులు, వెల్లుల్లి 30 టన్నులు, క్యారెట్ 20టన్నులు, బీట్రూట్ 5 టన్నులు, కాప్సికం, బీన్స్ కలిపి 4 టన్నులు, టమోటాలు 50 టన్నులు, దుంపలు 30 టన్నులు అమ్ముడుపోతున్నాయి. రోజుకయితే కేజీకి రూ.6 నుంచి రూ.10 వరకు అధిక ధరలు నిర్ణయిస్తున్న అధికారులకు ఈ రకం కూరగాయల అమ్మే వ్యాపారుల నుంచి పెద్దమొత్తంలో మామూళ్లు అందుతున్నాయి. ప్రధానంగా ఇంగ్లీష్ కూరగాయలు విక్రయాల్లో అధిక రేట్లు నిర్ణయిస్తున్నారు. సుమారు రోజుకు 214 టన్నులు అమ్ముతున్న రెండు జిల్లాల కూరగాయల ధరల్లో తక్కువలో తక్కువ రూ.6 అధికం ధర లెక్కవేసినా, వచ్చే లాభాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది అర్థమవుతోంది. రోజుకు రూ.13 లక్షల పైనే అంటే నెలకు రూ.4 కోట్లకు పైగా దండుకుంటున్నారు. దీంతో సీఎం చంద్రబాబు నాయుడు 19 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన రైతుబజార్ల లక్ష్యాన్ని దళారులు తుంగలో తొక్కి భ్రష్టు పట్టిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రస్థాయి మార్కెట్ శాఖలో ఉన్నతాధికారులు ధరల నిర్ణయంపై దృష్టిసారించి మార్కెటింగ్ శాఖలో పటిష్టమైన సవరణలు చేయాల్సి ఉందని వినియోగదారులు ఆకాంక్షిస్తున్నారు.



స్పెషల్ చీఫ్ సెక్రటరీ (హెల్త్) ఎంటీ కృష్ణబాబుని సచివాలయంలో కలిసి సత్కరిస్తున్న ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతలు

## హెల్త్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి సత్కారం

బస్‌స్టేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 2020 జనవరి 1 నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, ఇక ముందు పదవీ విరమణ చేయబోయే ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ అమలు చేస్తూ ఈనెల 6న జీవో జారీ చేసినందుకు హెల్త్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబును ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర శాఖ నేతలు మంగళవారం సత్కరించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు మేలు చేసినందుకు ఆయనకు దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు పుట్టపర్తి వెంకటరమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, ఎన్.వి.రమణ, సంయుక్త కార్యదర్శి ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోండి

- సీఎంకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ విజ్ఞప్తి

లబ్బీపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బకాయిపడిన బిల్లులను సాధ్యమైనంత త్వరగా చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలోని ఒక హోటల్‌లో అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిల్లులు రాక ఆత్మహత్య చేసుకున్న కాంట్రాక్టర్ బి.జనార్దన్ రెడ్డికి అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు. అనంతరం అసోసియేషన్ సభ్యుడు పంకజ్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాక సుమారు 56 మంది కాంట్రాక్టర్లు అప్పుల ఒత్తిడిని భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని వారిలో అనంతపురానికి చెందిన యువ కాంట్రాక్టర్ జనార్దన్ రెడ్డి ఒకరన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్లను ఆదుకోవాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక కొంత వెసులుబాటు కల్పించడం జరిగిందని, మిగిలిన బిల్లుల బకాయిలపై ఆయన తమ బాధలు, కష్టాలను గుర్తించి మంజూరు చేయాలని కోరారు. బి.రాఘవరావు, సిహెచ్. రామకోటయ్య, వల్లభనేని వెంకటేశ్వరరావు, పి.రాజబాబు పాల్గొన్నారు.



వర్షపు నీటిని ఒడిసిపట్టి సద్వినియోగపరిచే వ్యవస్థను ప్రదర్శిస్తున్న సంతబొమ్మాళి ఉన్నత పాఠశాల విద్యార్థులు

## ఘనంగా సైన్స్ ఎక్స్‌పో ప్రారంభం

పెనమలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో పోరంకి మురళీ రిసార్ట్స్‌లో మంగళవారం నుంచి రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన వైభవంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వ్యక్తిగత విభాగం, టీం విభాగం, ఉపాధ్యాయ విభాగాల్లో మొత్తం 156 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ప్రదర్శనలను ప్రదర్శించారు. 40 పాఠశాలల నుంచి 3వేలకు పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ప్రదర్శనను తిలకించేందుకు వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుల్లో వ్యక్తిగత విభాగం నుంచి 15, టీం విభాగం నుంచి 10, ఉపాధ్యాయ విభాగం నుంచి 10 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ఈనెల 20నుంచి 25వరకు పాండిచ్చేరిలో జరిగే దక్షిణ భారత స్థాయి విద్యా ప్రదర్శనకు పంపిస్తామని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. విద్యాశాఖ డైరెక్టర్, కమిషనర్ డాక్టర్ విజయరామరాజు, ఉమ్మడి కృష్ణా జిల్లాల డీఈవోలు యూవీ సుబ్బారావు, విజయరామారావు, గుడివాడ ఉప విద్యాశాఖాధికారిణి పద్మరాణి పాల్గొన్నారు.

## గ్రామాల్లో చెత్తకు చెక్ చెబుదాం

- నూతన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మేంట్‌కు ప్రతి జిల్లాలోని ఒక మండలంలో పైలట్ ప్రాజెక్ట్
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

వన్‌టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వాగతం పలికే చెత్తకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. విజయవాడలో మంగళవారం అన్ని జిల్లాల కన్సల్టెంట్లతో రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్రపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 2047 డాక్యుమెంట్ విడుదల సందర్భంగా చంద్రబాబు చేసిన సూచనలను అమలు చేయాలన్నారు. ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్ర దినోత్సవంగా పాటించాలని సీఎం చెప్పారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టలేదన్నారు. స్వచ్ఛతలో మన రాష్ట్రంలోని ఏ విభాగంలో చూసినా దిగువస్థాయిలోనే ఉందని, దీన్ని మెరుగుపరచుకుని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్మశాన వాటికలో చెత్త డంప్ చేశారన్న కారణంతో నడిరోడ్డుపైనే అంత్యక్రియలు చేశారన్న ఒక కథనం తనను కలిచివేసిందని, ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో సమావేశమైనప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఒక నూతన ప్రక్రియ ద్వారా కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారన్నారు. ఇందుకోసం ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకుని అమలు చేస్తామన్నారు. మిగతా 650 మండలాల్లోనూ ఇదే ప్రక్రియను చేపట్టి మంచి ఫలితాలను రాబట్టేందుకు అడుగులు వేస్తామన్నారు. ఏ గ్రామంలోకి వెళ్లినా తొలుత చెత్తే స్వాగతం పలుకుతుందని, చెత్త ద్వారా సంపదలు సృష్టించవచ్చన్న విషయాలు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. ఇలాంటి పరిస్థితిని మార్చాలని వీలైనంత త్వరగా ఒక మంచి కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు వెళతామన్నారు.




మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న సంఘం నేతలు

ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి

## విద్యాసాగర్‌కు ఘన సత్కారం

ధర్నాచౌక్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఐదేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన ఏ విద్యాసాగర్‌ను గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడారు. విద్యాసాగర్ వంటి వ్యక్తులు రాష్ట్రస్థాయి పదవులో ఉండటం వల్ల సంఘంలోని ప్రతి ఒక్కరికి ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. పెన్షనర్ల ప్రధాన సమస్య అడిషనల్ క్వాంటమ్ విధానాన్ని సీఎం చంద్రబాబు పరిష్కారిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యాసాగర్ మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన పెన్షనర్ల ఆకాంక్షలు నెరవేర్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు టీవీ సుబ్బయ్య, ఉపాధ్యక్షుడు అబ్దుల్ కరీం, రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, పలువురు సభ్యులు, సిటీ అధ్యక్షుడు సీవీఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

## పోలీసులతో అఘోరీ వాగ్వాదం

జగ్గయ్యపేట రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టోల్‌ప్లాజా వద్ద అఘోరీ హల్‌చల్ చేసిన ఘటన మంగళవారం జరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో వస్తున్న అఘోరీ కారును టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు ఆపారు. కారులో నుంచి దిగిన అఘోరీ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీఐ సర్దిచెప్పటంతో సమస్య సద్దుమణిగింది.

## కొత్తూరు తాడేపల్లి నుంచి రాత్రి వేళ్లలో గ్రావెల్ తరలింపు



వన్‌టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కొత్తూరు తాడేపల్లి నుంచి అనధికారికంగా సుమారు 5 రోజుల నుంచి రాత్రివేళల్లో గ్రావెల్ తరలిస్తున్నారు. అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణ లు వినిపిస్తున్నాయి. కొత్తూరు తాడేపల్లికి చెందిన వైసీపీ నాయకుడు టి. రాజు ఆధ్వర్యంలో ఐదు రోజుల నుంచి సుమారు 17 ట్రిప్పులు గుణదలలో ని ఓ వెంచర్‌కు గ్రావెల్‌ను తరలిస్తున్నట్టు సమాచారం. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటున్నారు. గ్రావెల్ టిప్పర్లు తాడేపల్లి నుంచి మెగా రోడ్డు మీదుగా కండ్రిక, భవానీ బార్ సెంటర్, రామవరప్పాడు ఫైఓవర్ మీదుగా గుణదలకు తరలిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

నేటి నుంచి దేవదాయ శాఖ

## మాజీ అసిస్టెంట్ కమిషనర్ శాంతిపై విచారణ

- విచారణ అధికారులుగా చంద్రకుమార్, శోభారాణి

వన్‌టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ మాజీ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతిపై బుధవారం నుంచి విచారణ ప్రారంభం కానుంది. విచారణ అధికారులుగా అడిషనల్ కమిషనర్ -1 తెనాలి చంద్రకుమార్, విశాఖపట్నం కనకమహాలక్ష్మి టెంపుల్ అసిస్టెంట్ కమిషనర్ శోభారాణిని నియమించారు. మాజీ అసిస్టెంట్ కమిషనర్ శాంతి అక్రమాలకు పాల్పడటంతో పాటు అనేక అవినీతి ఆరోపణలు రావటంతో గత ఏడాది ఆమెను సస్పెండ్ చేశారు. ఇప్పుడు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు బుధవారం నుంచి ఆమెపై విచారణ చేపట్టవలసిందిగా ఆదేశించారు.



వాలీబాల్ లీగ్‌లో మధ్యప్రదేశ్‌తో తలపడుతున్న ఆంధ్రా క్రీడాకారిణులు

## ఉత్కంఠగా వాలీబాల్ పోటీలు

- ముగిసిన లీగ్, నేటి నుంచి ప్రీ క్వార్టర్స్

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురంలో పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల వేదికగా జరుగుతున్న జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ బాలికల అండర్-19 లీగ్ మ్యాచ్‌లు రెండో రోజు ఉత్కంఠ భరితంగా సాగాయి. 4 కోర్టుల్లో భారీగా మ్యాచ్‌లను చురుగ్గా నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుగులో నరాల తెగే ఉత్కంఠతో గెలుపు కోసం అలుపెరగక టీమ్‌లు తలపడ్డాయి. రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ భానుమూర్తిరాజు, అసిస్టెంట్ సెక్రటరీలు రాధాకృష్ణ, రాజు, జిల్లా అండర్-19 కార్యదర్శి వీ రవికాంత అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల బ్రహ్మజీరావు పాల్గొన్నారు.

**లీగ్‌లలో ముందంజ:** తుది పోరుకు అర్హతలో నిలబడాలంటే ప్రతి మ్యాచ్ కీలకం కావడంతో జట్లు చెమటోడ్చుతున్నాయి. మధ్యప్రదేశ్.. చండీఘడ్, ఉత్తరాఖండ్‌పైన, ఆంధ్రప్రదేశ్.. ఉత్తరాఖండ్, చత్తీస్‌ఘడ్‌పైన కర్నాటక.. బీహార్, జార్ఖండ్, ఒడిశాపైన, హిమాచల్‌ప్రదేశ్ తెలంగాణ, పంజాబ్‌పైన విజయం సాధించాయి.

## సిద్ధార్థలో మేడసాని సమ్మోహన అవధానం



అవధానంలో పాల్గొన్న మేడసాని మోహన్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ తదితరులు

విజయవాడ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు శాఖ సారథ్యంలో మంగళవారం విజయవాడలోని సిద్ధార్థ కళాశాల సెమినార్ హాలులో డాక్టర్ మేడసాని మోహన్ తన అష్టావధానంతో అందరినీ సమ్మోహనపరిచి వాగ్దేవి వరపుత్రుడిగా మరోసారి నిరూపించుకొన్నారు. నిషిద్ధాక్షరి నిర్వహించిన శతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ మాట్లాడుతూ ఇది సిద్ధార్థ కళాశాలతో పాటు మేడసాని మోహన్ అవధాన స్వర్ణోత్సవంగా పేర్కొంటూ పొగమంచును కందపద్యంలో వర్ణించాల్సిందిగా కోరగా అవధాని వెంటనే శ్రీ హేలామయకాంక్ష అంటూ శ్రీకారం చుట్టారు. న్యస్తాక్షరి అంశాన్ని నిర్వహించిన విశ్రాంత తెలుగు అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు సిద్ధార్థుడి బోధనలను చంపకమాలలో చెప్పాల్సిందిగా కోరుతూనే అవధాని ఇంటిపేరులోని ఒక్కో అక్షరం ఒక్కో పాదంలో వచ్చేట్టు కట్టడి చేయగా జడులనవేయ వాఙ్మయ విశాలురుగా వెలిగించే బుద్ధదేవుడా అంటూ వర్ణించారు అవధాని. విశ్రాంత ఆంధ్రోపన్యాసకుడు పింగళి వెంకట కృష్ణారావు అవధానికి సమస్యను ఇస్తూ స్త్రీలకు మొక్కినన్ కలుగు క్షేమము సౌఖ్యము మోక్షమెపుడున్ అనే పాదం చెప్పగా కాల ప్రవాహము అఖండముగా తనియింపచేసి అంటూ స్పందించారు అవధాని. అధ్యాపకుడు డాక్టర్ జీవీ చలపతి రావు పద్యం, మద్యం, హృద్యం, గద్యం అనే దత్తపది ఇస్తూ శార్దూలంలో భాగవత ప్రాశస్త్యాన్ని చెప్పమనగా పద్యంబుల్ వడి వ్యాసపోతనల వాగ్వ్యాహార విస్ఫూర్తి శ్రీ మద్యం బ్రహ్మల అంటూ దత్తపదిని సమయస్ఫూర్తితో అవధాని పూరించారు. తెలుగు సహాయక ఆచార్యుడు డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ వర్ణన అంశాన్ని ఇస్తూ సంగీ, సాహిత్య వేదికగా బెజవాడను వర్ణించమని కోరగా ఆశువుగా హృద్యంగా పద్యం చెప్పారు అవధాని. పురాణ కావ్య పఠన అంశాన్ని వలివేటి శివరామకృష్ణమూర్తి నిర్వహించగా, కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ అప్రస్తుత ప్రసంగం చేశారు. ఆశువు అంశాన్ని నిర్వహించిన విద్యార్థులు పుస్తక మహోత్సవం, సిద్ధార్థ కళాశాల స్వర్ణోత్సవం తదితర అంశాలపై పద్యాలు కోరగా అవధాని తనదైన మెరుపువేగంతో పద్యాలు చెప్పి అలరించారు. అనంతరం అవధాని డాక్టర్ మేడసాని మోహన్‌తో పాటు పృచ్ఛకులను డీన్ డాక్టర్ రాజేష్ జంపా, ఏవో శ్రీధర్ ఘనంగా సత్కరించారు. తొలుత సహాయక ఆచార్యుడు డాక్టర్ సశ్రీ అవధానిని, పృచ్ఛకులను సభకు పరిచయం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేకా రమేష్, శాఖాధిపతి డాక్టర్ ఎన్.శివకుమార్ పాల్గొన్నారు.

## ఈఆర్సీ ఎదుట శీర్షాసన నిరసన

- వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు తొలగించాలని డిమాండ్

విజయవాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థల 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, వ్యయాల పై ప్రజాభిప్రాయాన్ని సేకరించిన విద్యుత్ నియంత్రణ మండలి ఎదుట ఓ రైతు శీర్షాసనం వేసి నిరసన తెలిపాడు. ముందు, వేదిక బయట వామపక్షాలు నిరసన తెలిపాయి. ఈఆర్సీ తూర్పు ప్రాంత, మధ్యప్రాంత, దక్షిణ ప్రాంత పంపిణీ సంస్థలకు ప్రజాభిప్రాయాన్ని విజయవాడలోని ప్రైవేటు కన్వెన్షన్ హాలులో మంగళవారం నిర్వహించింది. ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్, సభ్యుడు పి.వెంకటరామిరెడ్డికి పంపిణీ సంస్థల సీఎండీలు నివేదికను చదివి వినిపించారు. అనంతరం ప్రజల నుంచి అభిప్రాయాన్ని సేకరించడానికి సిద్ధమవుతుండగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన రైతు సంఘ నేత చెరుకూరి వేణుగోపాలకృష్ణ రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ వేదిక వద్దకు వెళ్లారు. వ్యవసాయ రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశా రు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీట ర్లు అమర్చవద్దని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలెన్ని ఉన్నా రైతులంతా ఒక్కటేనని స్పష్టం చేశారు. ఆయన నినాదాలు చేయడంతో పోలీసులు, విద్యుత్ సిబ్బంది ఆయనను వారించే ప్రయత్నం చేశారు. మహిళా ఉద్యోగి ఆయనను పక్కకు లాగుతుండగా తీవ్రంగా పరిగణించారు. “నేను నిన్ను పట్టుకుంటే తప్పు. నువ్వు నన్ను ఎందుకు పట్టుకుంటున్నావ్” అంటూ కేకలేశారు. అభిప్రాయాన్ని చెప్పడానికి అవకాశం ఇస్తామని ఈఆర్సీ ప్రతినిధులు చెప్పడంతో శాంతించాడు. పోలీసులు ఆయనను అక్కడి నుంచి లాక్కొచ్చి కుర్చీలో కూర్చోబెట్టారు.




శీర్షాసనం వేసి నిరసన తెలియజేస్తున్న రైతు,

### వృద్ధురాలి దారుణ హత్య

ఇబ్రహీంపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు దారుణహత్య గురైన ఘటన కొండపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మైలవరం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కుంచాల ఎస్తేరు అలియాస్ చంచమ్మ (60) కొండపల్లి ఖిల్లా రోడ్డులో సమీపంలోని చంద్రన్న కాలనీలో చర్చి నిర్మాణం చేపట్టింది. ఆమె భర్త పాస్టర్‌గా పని చేస్తూ ఏడాది క్రితం మృతి చెందాడు. చర్చి నిర్మాణ పనుల్ని పర్యవేక్షించి సోమవారం రాత్రి చర్చిలోనే నిద్రించింది. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసి పరారయ్యారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. స్థానికుల సమాచారంతో ఏసీపీ దుర్గారావు అక్కడికి చేరుకొని ఎస్తేరు మృతదేహాన్ని పరిశీలించగా తల వెనుక బలమైన గాయం ఉన్నట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపి కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హైకోర్టు వద్ద హెల్మెట్ వినియోగంపై అవగాహన



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఏపీ న్యాయసేవాధికార సంస్థ నేతలు, తుళ్లూరు పోలీసులు

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాల పై ఏపీ న్యాయ సేవాధికార సంస్థ, తుళ్లూరు పోలీసులు సంయుక్తంగా మంగళవారం హైకోర్టు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయసేవాధికార సంస్థ పలువురు ద్విచక్రవాహనదారులకు ఉచితంగా హెల్మెట్‌లు అందజేసింది. ఈ సందర్భంగా న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి ఎం.బబిత మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవచ్చు అన్నారు. తుళ్లూరు డీఎస్పీ మురళికృష్ణ మాట్లాడుతూ శుభకార్యాలు, పుట్టిన రోజులకు హెల్మెట్ బహుమతిగా ఇవ్వడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. ఇది వారి ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ ఉప కార్యదర్శి అమర రంగేశ్వరరావు, తుళ్లూరు ట్రాఫిక్ సీఐ బి. కోటేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

सत्यमेव जयते
Government of India




# భారతదేశ ఆర్థిక వృద్ధి
## ఇంజిన్‌గా ఆంధ్రప్రదేశ్



**రూ॥ 2 లక్షల కోట్ల పైగా విలువైన**

**ఇంధనం, రైల్వే, రోడ్లు, ఫార్మాస్యూటికల్స్ & ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల**
**శంకుస్థాపన, ప్రారంభోత్సవం మరియు దేశానికి అంకితం చేయనున్న**

గౌరవ భారత ప్రధాన మంత్రి

# శ్రీ నరేంద్ర మోదీ

**బుధవారం, 8 జనవరి, 2025 | సా. గం॥ 17:30 | విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్**

### శంకుస్థాపన

$H_2$

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్, పూడిమడక
ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ పర్యావరణానికి కేంద్రంగా ఏర్పరుచుకుంటూ, సుస్థిర పరిశ్రమల వృద్ధిని ప్రోత్సహించడం

సౌత్ కోస్ట్ రైల్వే (ఎస్‌సీఓఆర్) ప్రధాన కార్యాలయం
ఆంధ్రప్రదేశ్ మరియు పొరుగు రాష్ట్రాలకు కేంద్రీకృత పరిపాలనతో మెరుగైన రైల్వే ఇన్ఫ్రా

రైల్వే లైన్ల డబ్లింగ్ - 3 ప్రాజెక్ట్‌లు - మొత్తం 465 కి.మీ.
రైల్వే లైన్ల నిర్మాణం - 3 ప్రాజెక్ట్‌లు - మొత్తం 48 కి.మీ.
రోడ్డు విస్తరణ 2-లేన్ & 4-లేన్ - 7 ప్రాజెక్ట్‌లు - మొత్తం 294 కి.మీ.
గ్రీన్‌ఫీల్డ్ బైపాస్ నిర్మాణం - 3 ప్రాజెక్ట్‌లు - మొత్తం 26 కి.మీ.
ఆంధ్రప్రదేశ్ మరియు పొరుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ అనుసంధానానికి ప్రోత్సాహం

నక్కపల్లి, అనకాపల్లి వద్ద బల్క్ డ్రగ్ పార్క్ అభివృద్ధి
సరసమైన, అధిక నాణ్యత గల మందులను అందించడం మరియు ఈ రంగంలో భారతదేశాన్ని స్వావలంబనగా మార్చడం

కృష్ణపట్నం ఇండస్ట్రియల్ ఏరియా - క్రిస్ సిటీ
ఉపాధి అవకాశాలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రాంతీయ ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం

### ప్రారంభోత్సవం

రోడ్డు విస్తరణ 2-లేన్ & 4-లేన్ - 5 ప్రాజెక్ట్‌లు - మొత్తం 210 కి.మీ.
గ్రీన్‌ఫీల్డ్ బైపాస్ నిర్మాణం - 2 ప్రాజెక్ట్‌లు - మొత్తం 24 కి.మీ.

### దేశానికి అంకితం

రైల్వే లైన్ల డబ్లింగ్ - 3 ప్రాజెక్ట్‌లు - మొత్తం 323 కి.మీ.

బలమైన ప్రాంతీయ అనుసంధానం | సామాజిక ఆర్థిక అభివృద్ధి పెంపొందించడం | యువతకు ఉపాధి కల్పన

### గౌరవప్రదమైన వీరి సమక్షంలో

**శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్**
గవర్నర్, ఆంధ్రప్రదేశ్

**శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు**
ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

**శ్రీ కె. పవన్ కళ్యాణ్**
ఉప ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

**శ్రీ నితిన్ జైరామ్ గడ్కరీ**
కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి

**శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా**
కేంద్ర రసాయనాలు, ఎరువులు, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి

**శ్రీ మనోహర్ లాల్**
కేంద్ర విద్యుత్, హౌసింగ్ మరియు అర్బన్ అఫైర్స్ మంత్రి

**శ్రీ పీయూష్ గోయల్**
కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రి

**శ్రీ ప్రహ్లాద్ జోషి**
కేంద్ర నూతన పునరుత్పాదక ఇంధన, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ మంత్రి

**శ్రీ అశ్విని వైష్ణవ్**
కేంద్ర రైల్వే, సమాచార, బ్రాడ్‌కాస్టింగ్, ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి

**శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు**
కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

**డా. చంద్ర శేఖర్ పెమ్మసాని**
కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు సమాచార ప్రసారాల శాఖ సహాయ మంత్రి

**శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ**
కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ సహాయ మంత్రి

DD NEWS DD న్యూస్ లో ప్రత్యక్ష ప్రసారం వీక్షించండి

## అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 'నెట్' తప్పనిసరి కాదు

**» యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలు-2025 విడుదల**

న్యూఢిల్లీ, జనవరి 7: అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత ప్రమాణాలను యూజీసీ సవరించింది. ఈ పోస్టులో నియామకానికి ఇకపై జాతీయ అర్హత పరీక్ష (ఎన్ఈటీ)లో ఉత్తీర్ణత తప్పనిసరి కాదని పేర్కొంది. ఉన్నత విద్యాసంస్థల్లో ఫ్యాకల్టీ నియామకాలు, పదోన్నతుల కోసం కనీస విద్యార్హతల ముసాయిదా మార్గదర్శకాలు-2025ను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విడుదల చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న 2018 నాటి నిబంధనల ప్రకారం పీజీ అనంతరం అదే సబ్జెక్టులో నెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు అర్హులు. కొత్త ముసాయిదాలో ఈ నిబంధనను తొలగించారు. తాజా మార్గదర్శకాల ప్రకారం... నాలుగేళ్ల డిగ్రీ లేదా పీజీ పూర్తిచేసిన వారు తమ సబ్జెక్టుకు భిన్నమైన రంగంలో పీహెచ్‌డీ చేసినప్పటికీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి అర్హులే. అలాగే నాలుగేళ్ల డిగ్రీకి భిన్నమైన సబ్జెక్టులో నెట్‌లో గానీ, రాష్ట్ర అర్హత పరీక్ష (ఎస్ఈటీ)లో గానీ అర్హత సాధించినవారు కూడా ఆయా విభాగాల్లో ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్త నిబంధనలపై ఫిబ్రవరి 5లోగా అభిప్రాయాలు చెప్పాలని యూజీసీ కోరింది.

## వీసీల సెర్చ్ కమిటీపై అధికారం గవర్నర్లకా: స్టాలిన్

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వీసీల ఎంపికకు సెర్చ్ కమిటీని నియమించే అధికారాన్ని కులపతి హోదాలోని గవర్నర్‌కు అప్పగించేలా యూజీసీ ప్రకటించిన కొత్త నిబంధనపై తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వీసీల పదవీ కాలాన్ని మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచుతూ యూజీసీ చేసిన సవరణపై కూడా ఆయన మండిపడ్డారు. యూజీసీ తీసుకున్న ఈ నిర్ణయాలకు వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు చేపడతామని, న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. తమిళనాడులో పలు వర్సిటీలకు వీసీలను నియమించేందుకు ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసి గవర్నర్ ఆర్ఎన్.రవి ఆమోదం కోసం పంపింది. గవర్నర్ ఆయా సెర్చ్ కమిటీల్లో యూజీసీ తరపు ప్రతినిధి కూడా ఉండాలని, సెర్చ్‌కమిటీ సభ్యుల సంఖ్య నాలుగుకు పెంచాలని పేర్కొంటూ ప్రతిపాదనలను తిప్పిపంపారు. ఈ నేపథ్యంలో మంగళవారం యూజీసీ వీసీల నియామకానికి సెర్చ్‌కమిటీ ఏర్పాటు బాధ్యతలను పూర్తిగా గవర్నర్‌కే కల్పిస్తూ కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది.

## ఇరాన్‌లో గతేడాది 901 మందికి మరణ దండన

న్యూఢిల్లీ, జనవరి 7: ఇరాన్‌లో మరణ శిక్షల సంఖ్య ప్రతీ ఏటా పెరుగుతుండడంపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. 2024లో 31 మంది మహిళలు సహా 901 మందికి ఇరాన్‌లో మరణ దండన అమలు చేశారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం మంగళవారం ప్రకటించింది. చైనాను మినహాయిస్తే ఒక ఏడాదిలో మరణ శిక్షలను ఈ స్థాయిలో అమలు చేసిన దేశం ఇరాన్ మాత్రమేనని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సహా పలు మానవ హక్కుల సంఘాలు పేర్కొంటున్నాయి.

## భగవద్గీతపై సుహాస్ సుబ్రహ్మణ్యం ప్రమాణం

వాషింగ్టన్, జనవరి 7: అమెరికా కాంగ్రెస్ సభ్యుడుగా సుహాస్ సుబ్రహ్మణ్యం భగవద్గీతపై ప్రమాణం చేశారు. తూర్పు తీర ప్రాంతం వర్జీనియా నుంచి కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి భారతీయ అమెరికన్‌గానే కాకుండా ఇక్కడ నుంచి ఎన్నికై భగవద్గీతపై ప్రమాణం చేసిన తొలి సభ్యుడిగా సుహాస్ చరిత్ర సృష్టించారు. ఈ ఏడాది హిందువుల పవిత్ర గ్రంథంపై ప్రమాణం సభ్యుడిగా కూడా ఆయన గుర్తింపు పొందారు. సుహాస్ ప్రమాణ స్వీకారాన్ని నేరుగా తిలకించడానికి ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వాషింగ్టన్ రావడం విశేషం. గతంలో ప్రతినిధుల సభకు ఎన్నికైన హిందు-అమెరికన్ తులసి గబ్బార్డ్ 2013లో గీతపై ప్రమాణం చేశారు. చట్టసభలో భగవద్గీతపై ప్రమాణం చేసిన తొలి సభ్యురాలిగా ఆమె చరిత్రలో నిలిచిపోయారు.

## ఫెంటనిల్ అక్రమ రవాణా.. భారతీయ సంస్థలపై అమెరికాలో కేసు

వాషింగ్టన్, జనవరి 7 : హెరాయిన్ కంటే 50 రెట్లు, మార్ఫిన్ కంటే 100 రెట్లు శక్తిమంతమైన ఫెంటనిల్ అనే రసాయన పదార్థాన్ని అక్రమంగా దిగుమతి చేసి అమెరికా, మెక్సికోకు సరఫరా చేస్తున్నారంటూ భారత్‌కు చెందిన రెండు సంస్థలపై అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. ఈ మేరకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ ఓ ప్రకటన చేసింది. గుజరాత్‌కు చెందిన రక్సూటర్, అథోస్ అనే రసాయన సంస్థలపై ఈ అభియోగాలు నమోదయ్యాయి. అంతేకాక, ఈ కేసుకు సంబంధించి రక్సూటర్ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ భవేశ్ లథియా(36) న్యూయార్క్‌లో శనివారం అరెస్టు అయ్యారు. నేరం రుజువైతే లథియాకు 53 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశముంది.

## శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లు అర్జున్

**» అండగా ఉంటా.. వైద్య ఖర్చులన్నీ భరిస్తానని భరోసా**

హైదరాబాద్ సిటీ , జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'మీకు జరగరాని నష్టం జరిగింది...మీకు అండగా నేనుంటా. ఇలా జరుగుతుందని అనుకోలేదు. బాబు పూర్తిగా కోలుకునే దాకా బాధ్యత నాదే. వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులన్నీ భరిస్తాను' అని శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌తో సినీ నటుడు అల్లు అర్జున్ అన్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు అల్లు అర్జున్ కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. అక్కడ చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను ఆయన పరామర్శించారు. గతనెల 4న పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ చనిపోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని హుటాహుటిన సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా అప్పటి నుంచి అక్కడే చికిత్స పొందుతున్నాడు. 20 నిమిషాలు అల్లు అర్జున్ ఆస్పత్రిలోనే ఉన్నారు. శ్రీతేజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వివరించారు.

## కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

**» సుప్రీంను ఆశ్రయించిన మాజీ మంత్రి.. కేవియట్ వేసిన సర్కారు**

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ రేసు కేసులో తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు ఆ రాష్ట్ర హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టేసింది. అప్పీలుకు వెళ్లేందుకు పది రోజులపాటు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కేటీఆర్ తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని సైతం తోసిపుచ్చింది. ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో కేటీఆర్‌పై ఉన్న అభియోగాలను పరిశీలిస్తే ప్రాథమికంగా కేసు ఉందని జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం లేకుండా, ఆర్థికశాఖ అనుమతి పొందకుండా హెచ్ఎండీఏ నిధులను భారీ మొత్తంలో విదేశీ కంపెనీకి చెల్లించాలని పిటిషనర్ ఆదేశించారని గుర్తుచేసింది. ఆరోపణలన్నింటిపై దర్యాప్తుకు, ఆధారాలు సేకరించడానికి తగిన అవకాశం, సమయం విచారణ సంస్థకు ఇవ్వాలని.. దర్యాప్తునకు ఆటంకం కలిగించడం తొందరపాటు చర్యే అవుతుందని పేర్కొంది. అరెస్టు చేయరాదన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పును సవాలు చేస్తూ కేటీఆర్ మంగళవారమే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అటు తెలంగాణ ప్రభుత్వం కూడా కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది.

## పోక్సో కేసులో ముద్దాయికి 30 ఏళ్ల జైలు శిక్ష

**» కాకినాడ పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సంచలన తీర్పు**

పిఠాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అక్కాచెల్లెళ్లయిన ఇద్దరు బాలికలను ప్రేమ పేరుతో వంచించిన వ్యక్తికి 30 ఏళ్ల జైలు శిక్ష, రూ.పదివేల జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు స్పెషల్ జడ్జి కె.శ్రీదేవి మంగళవారం సంచలన తీర్పు చెప్పారు. బాధిత బాలికలకు రూ.2లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన అక్కాచెల్లెళ్లను అదే ప్రాంతానికి చెందిన భగవతి హేమంత్ కుమార్ పెళ్లి చేసుకుంటానని ప్రేమ పేరుతో నమ్మించి మోసగించాడు. ఒకరికి తెలియకుండా మరొకరిపై రెండేళ్ల పాటు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత బాలికల తండ్రి ఫిర్యాదు మేరకు 2019లో అప్పటి పిఠాపురం పోలీసులు పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో హేమంత్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి మంగళవారం తుది తీర్పు చెప్పారు.

## టిబెట్-నేపాల్ సరిహద్దుల్లో భారీ భూకంపం

# 128 మంది మృతి

నేపాల్‌లో భూకంపం కారణంగా కూలిన ఓ ఇంటి శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడటానికి ప్రయత్నిస్తున్న సహాయ సిబ్బంది



### మరో 188 మందికి గాయాలు
### 7.1 తీవ్రతతో ప్రకంపనలు

**» వెయ్యికి పైగా ఇళ్లు నేలమట్టం**

**» కంపించిన ఎవరెస్ట్ బేస్ క్యాంప్**

**» భారత్‌లో ఉత్తరాదిపైనా ప్రభావం**

బీజింగ్, జనవరి 7: హిమాలయాల్లోనే మంచు కొండలు, అందమైన లోయలతో పర్యాటకులను ఆకట్టుకునే టిబెట్‌పై ప్రకృతి ప్రకోపించింది. సముద్ర మట్టానికి 16 వేల అడుగుల ఎత్తులో.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఆవాస ప్రాంతంగా పేర్గాంచిన షిజాంగ్‌లో భూమి కంపించింది. ఆ పరిసరాల్లో 20 కిలోమీటర్ల పరిధిలోని 27 గ్రామాలపై పంజా విసిరింది. వెయ్యికి పైగా ఆవాసాలను నేలమట్టం చేసింది. ఈ భూకంపం 128 మందిని పొట్టనబెట్టుకోగా.. 188 మంది క్షతగాత్రులయ్యారు. శిథిలాల కింద ఇంకా పదుల సంఖ్యలో పౌరులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. భూకంప ప్రభావం టిబెట్, నేపాల్‌తోపాటు.. చైనా, భూటాన్, భారత్‌లోని బిహార్, పశ్చిమబెంగాల్, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌పైనా ప్రభావం చూపింది. షిజాంగ్‌లో మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు.. దట్టమైన పొగమంచు సహాయక చర్యలకు ఆటంకంగా మారింది.

### ఉదయం నిద్ర లేస్తూనే..

ఉదయం 6.35 గంటలకు టిబెట్-నేపాల్ సరిహద్దుల్లో.. టిబెట్‌లోని షిజాంగ్ పరిధిలో.. లబుచె వద్ద 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉండగా.. తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదైంది. ఈ ప్రాంతానికి 20 కిలోమీటర్ల పరిధిలో 27 గ్రామాలున్నాయి. వీటిల్లో 6,900 మంది జనాభా ఉంది. తాజా భూకంపం, తదనంతరం చోటుచేసుకున్న ప్రకంపనలతో వెయ్యికి పైగా ఇళ్లు నేలమట్టమైనట్లు చైనా మీడియా పేర్కొంది. పలు భవనాలు పూర్తిగా, పాక్షికంగా ధ్వంసమైనట్లు తెలిపింది. సాయంత్రం వరకు మొత్తం 150 భూప్రకంపనలు నమోదైనట్లు చైనా భూకంపాల కేంద్రం వెల్లడించింది. కొన్ని క్షణాల పాటు తీవ్రస్థాయిలో భూమి కంపించడంతో.. ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద కూడా భారీ ప్రకంపనాలు వచ్చినట్లు చైనా మీడియా పేర్కొంది. ఎవరెస్ట్ యాత్రికులను అధికారులు బేస్ వద్దే ఆపేసినట్లు తెలిపింది. నేపాల్‌లోని కఠ్మాండూ వరకు కూడా ప్రకంపనాల తీవ్ర ఉండడంతో.. అక్కడ కూడా ప్రజలు బయటకు పరుగులు తీశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెనువెంటనే సైన్యం, చైనా వైమానికదళం రంగంలోకి దిగింది. జవాన్లు డ్రోన్ కెమెరాలతో గాలింపు చర్యలను చేపట్టారు. అధికారులు షిజాంగ్‌కు 22 వేల తాత్కాలిక టెంట్లు, ఇతర సామగ్రిని తరలించారు. 340 మంది వైద్య సిబ్బంది, 1,500 మంది అగ్నిమాపక సిబ్బందిని మోహరించారు. 3,400 మంది విపత్తు నిర్వహణ సిబ్బంది శకలాలను తొలగిస్తున్నారు. భూకంపం సంభవించిన ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మైనస్ 18 నుంచి మైనస్ 14 డిగ్రీలుగా ఉండడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలేర్పడుతున్నట్లు చైనా మీడియా పేర్కొంది. కాగా.. భూకంప ప్రకారం భారత్‌పైనా పడింది. ఉత్తరాది రాష్ట్రాలు– పశ్చిమబెంగాల్, బిహార్, ఢిల్లీ-ఎన్‌సీఆర్ సహా.. పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. చైనా, భూటాన్, బంగ్లాదేశ్‌లోనూ ప్రకంపనలు నమోదయ్యాయి.

### లాసాలో భూకంపాలు ఎక్కువే?

ఎవరెస్టు శిఖరానికి 80 కిలోమీటర్ల దూరంలో.. భూ ఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల లోతులో తాజా భూకంప కేంద్రం ఉంది. ఈ ప్రాంతాన్ని లాసా రీజియన్‌గా పిలుస్తారు. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 13 వేల నుంచి 16 వేల అడుగుల ఎత్తులో ఉంటుంది. భారత, యురేషియన్ భూఫలకాల్లో కదలికలు సంభవించినప్పుడల్లా ఈ రీజియన్ తీవ్రంగా ప్రభావితమవుతుంది. అందుకే ఈ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తుంటాయి. ఈ రెండు ఫలకాలు ఒకదానికొకటి ఢీకొనే క్రమంలోనే హిమాలయాలు ఏర్పడ్డాయి.

## లోకం తీరు




## బొగ్గు గనిలోకి ఉప్పొంగిన నీరు.. ముగ్గురు జలసమాధి

**» చిక్కుకుపోయిన మరో 9 మంది**

గువాహటి, జనవరి 7: అసోంలోని ఓ బొగ్గుగనిలో ఊహించని ప్రమాదం సంభవించింది. గనిలోకి ఒక్కసారిగా నీరు వచ్చి చేరడంతో ముగ్గురు కార్మికులు జల సమాధి అయ్యారు మరో 9 మంది కార్మికులు లోపలే చిక్కుకుపోయారు. అయితే సదరు గనికి అనుమతులు లేవని తెలుస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం దిమాహసావో జిల్లాలోని ఓ బొగ్గుగనిలోకి సోమరాత్రి ఒక్కసారికి పెద్దఎత్తున నీరు వచ్చి చేరింది. దాంతో గనిలో ఉన్న వారిలో ముగ్గురు జలసమాధవ్వగా, లోపలే మరో 9 మంది చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నేవీ బృందం కూడా సహాయక చర్యల్లో పాల్గొంటోంది. ఈ ప్రమాదానికి సంబంధించి ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ప్రాథమిక సమాచారం ప్రకారం ఆ గనికి అనుమతులు లేనట్లు తెలిసిందని అసోం సీఎం హిమంత వెల్లడించారు. కాగా, 2019లో మేఘాలయలోనూ ఇలాంటి ప్రమాదంలో 15 మంది చనిపోయారు.

## సమాచార కమిషన్ పదవులను తక్షణమే భర్తీ చేయండి

న్యూఢిల్లీ, జనవరి 7: సమాచార కమిషన్లలో పలు పదవులు ఖాళీగా ఉండడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. వాటిని తక్షణమే భర్తీ చేయాలని మంగళవారం ప్రభుత్వాలను ఆదేశించింది. పదవులు ఖాళీగా ఉంటే ఆ సంస్థలు ఉండి ఏమి ఉపయోగమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. సమాచార కమిషనర్లు లేకపోవడంతో తెలంగాణ, త్రిపుర, ఝార్ఖండ్‌ల్లో సమాచార కమిషన్లు క్రియారహితంగా మారాయని అభిప్రాయపడింది. కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్ పదవుల్లో కేవలం బ్యూరోక్రాట్లను మాత్రమే నియమిస్తుండడంపై ప్రశ్నించింది. అన్ని వర్గాల ప్రముఖులకు అవకాశం కల్పించాలని సూచించింది. కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్ల పదవులు భర్తీ కావడం లేదంటూ అంజలి భరద్వాజ్, మరికొందరు పిటిషన్ దాఖలు చేశారు. వారి తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ కమిషన్లలోని పదవులను భర్తీ చేయడం లేదంటే సమాచార హక్కు చట్టాన్ని హత్య చేయడమేనని అన్నారు. ధర్మాసనం స్పందిస్తూ కేంద్ర సమాచార కమిషన్‌లో పదవుల భర్తీ ప్రక్రియ 2024 ఆగస్టులోనే ప్రారంభించినా ఇంతవరకు ఎందుకు పూర్తి చేయలేదని కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖను ప్రశ్నించింది. కమిషనర్ల పదవుల కోసం 161 మంది దరఖాస్తు చేశారని, వారి వివరాలను వెల్లడించాలని తెలిపింది. అర్హులను ఎంపిక చేసి రెండు వారాల్లో జాబితాను రూపొందించాలని సూచించింది. ఝార్ఖండ్ సమాచార కమిషనర్ పదవులను భర్తీ చేయాలని గత ఏడాది జూన్‌లో ఆదేశాలు ఇచ్చినా, ప్రతిపక్ష నేత లేరన్న సాకుతో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుపట్టింది. కమిషన్లలో ఉన్న ఖాళీలు, అభ్యర్థుల అర్హతలు, ఎంపిక కమిటీల స్వరూపంపై వారం రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. వాటిని భర్తీ చేశాక నివేదిక సమర్పించాలంది.


# బ్యాంకులదే పూర్తి బాధ్యత

### మోసపూరిత లావాదేవీలకు పరిహారం ఇవ్వాలి.. సుప్రీంకోర్టు కీలక తీర్పు

**» నేరం జరిగిన మూడు రోజుల్లోగా ఫిర్యాదు చేస్తేనే ఈ ఊరట**

**» ఎస్‌బీఐ రూ.94 వేలు చెల్లించాలి**

**» గువాహటి బాధితుడి కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలు**



న్యూఢిల్లీ, జనవరి 7: కస్టమర్ కేర్ మోసాలు.. మాల్‌వేర్‌తో ఖాతాలను ఖాళీ చేసే సైబర్ నేరాల విషయంలో బాధితులకు ఊరట కలిగించేలా సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. అనుమతి లేని/మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా తమ ప్రమేయం లేకుండానే ఖాతాలోని డబ్బు పోగొట్టుకున్న బాధితులు మూడ్రోజుల్లో ఫిర్యాదు చేస్తే.. బ్యాంకులు పరిహారం ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. అయితే.. భారతీయ రిజర్వ్ బ్యాంకు(ఆర్‌బీఐ) 2017 జూలై 6న ఇచ్చిన సర్క్యులర్‌లో పేర్కొన్నట్లుగా బాధితులు మూడ్రోజుల్లో ఫిర్యాదు చేస్తే.. థర్డ్‌పార్టీ యాప్, వ్యక్తుల ద్వారా జరిగే మోసాల విషయంలోనూ బాధితులకు ఊరట కలిగించాల్సిన బాధ్యత బ్యాంకులదేనని స్పష్టం చేసింది. గువాహటికి చెందిన పల్లబ్ భౌమిక్ అనే బాధితుడి విషయంలో జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. బాధితుడు 2021లో ప్రపంచ దిగ్గజ గార్మెంట్స్ సంస్థ లూయిఫిలిప్ నుంచి రూ.4 వేలు వెచ్చించి, ఓ బ్లేజర్ కొనుగోలు చేశారు. ఆ తర్వాత.. దాన్ని వాపస్ చేస్తానంటూ లూయిఫిలిప్ వెబ్‌సైట్‌లో కస్టమర్ కేర్‌కు సమాచారం ఇచ్చారు. తనకు రూ.4 వేలను వెనక్కి ఇవ్వాలని కోరారు. అయితే.. 2021లో లూయిఫిలిప్ వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురై.. ఆ సైట్ నియంత్రణ హ్యాకర్ల చేతికి వెళ్లిపోయింది. వెబ్‌సైట్‌లో కస్టమర్‌కేర్‌ను సంప్రదించినట్లు బాధితుడు భావించినా.. దీన్ని సైబర్ నేరగాళ్లు అవకాశంగా మలచుకుని, లూయిఫిలిప్ మేనేజర్ పేరుతో ఫోన్ చేశారు. "తప్పకుండా మీ సొమ్మును తిరిగి ఇస్తాం. అయితే.. మీరు మేము పంపే లింకు ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి" అని సూచించారు. బాధితుడు ఆ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయగానే.. అతని ఎస్‌బీఐ ఖాతాలో ఉన్న రూ.94,204.80 గూగుల్‌పే ద్వారా సైబర్ నేరగాళ్ల ఖాతాకు బదిలీ అయ్యింది. తన ఖాతా ఖాళీ అవ్వడంతో బాధితుడు ఎస్‌బీఐ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి, జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. అయితే గూగుల్‌పే ద్వారా లావాదేవీలు జరిగినందున తాము బాధ్యులం కాదని కస్టమర్‌కేర్ సిబ్బంది సమాధానమిచ్చారు. దాంతో బాధితుడు గువాహటి పోలీసులు, అసోం సీఐడీ సైబర్ క్రైమ్ సెల్, జాతీయ సైబర్ నేరాల నమోదు పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించినా.. న్యాయం జరగకపోవడంతో గువాహటి హైకోర్టును ఆశ్రయించారు. ఈలోగా నిందితుడు ఉత్తరప్రదేశ్‌కు చెందినవాడని సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. నేరం జరిగిన 24 గంటల్లోనే బాధితుడు ఫిర్యాదు చేశారని, ఎస్‌బీఐదే లోపమని హైకోర్టు సింగిల్ బెంచ్ స్పష్టం చేసింది. అతను కోల్పోయిన రూ.94,204.80ని తిరిగి ఇచ్చేయాలని తీర్పునిచ్చింది. ఆ తీర్పుపై ఎస్‌బీఐ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. బాధితుడు గూగుల్‌పే ద్వారా డబ్బును బదిలీ చేశాడని, అతనికి ఓటీపీ కూడా వచ్చిందని బ్యాంకు తరఫు న్యాయవాదులు వాదనలను వినిపించారు. అయితే.. బాధితుడి పక్షానే న్యాయం ఉండడంతో.. ఎస్‌బీఐ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. తాజాగా ఈ కేసును విచారించిన జస్టిస్ జేబీ పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం ఎస్‌బీఐనే తప్పుబట్టింది. "ఎస్‌బీఐ వద్ద అధునాతన సాంకేతికత ఉంటుంది. అనుమతి లేని/మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీలను గుర్తించి, నియంత్రించే అవకాశాలుంటాయి. బాధితుడి ప్రమేయం లేకుండానే ఆయన ఖాతాలోని సొమ్ము బదిలీ అయ్యింది. కాబట్టి.. ఎస్‌బీఐ అతనికి పరిహారంగా మొత్తం సొమ్మును తిరిగి ఇవ్వాల్సిందే" అని తీర్పునిచ్చింది. అదే సమయంలో బ్యాంకు ఖాతాదారులు కూడా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఓటీపీని ఇతరులకు చెప్పినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. ఖాతాదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

### ఆశారాంనకు మధ్యంతర బెయిల్

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైల్లో ఉన్న ఆధ్యాత్మికవేత్త ఆశారాం బాపు(86)నకు మంగళవారం సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్య కారణాల దృష్ట్యా మార్చి 31 వరకు బెయిల్ ఇస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈ సమయంలో అనుయాయులు ఎవర్నీ కలుసుకోవద్దని షరతు విధించింది. ఆశ్రమంలోని శిష్యురాలిపై అత్యాచారం కేసులో ఆశారం యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నారు.

## ఎక్కడ దాక్కున్నా పట్టిచ్చే 'భారత్ పోల్'

**» సీబీఐ రూపకల్పన..ఆవిష్కరించిన షా**

న్యూఢిల్లీ, జనవరి 7: మనదేశంలోని దర్యాప్తు సంస్థలు, రాష్ట్ర పోలీసు విభాగాల మధ్య సమన్వయానికి కీలకంగా దోహదపడే 'భారత్ పోల్' పోర్టల్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మంగళవారం ఇక్కడ ఆవిష్కరించారు. కేసుల విషయంలో అంతర్జాతీయంగా పనిచేస్తున్న మన దర్యాప్తు సంస్థల పనిని ఈ పోర్టల్ సులభతరం చేస్తుందని, ఇంటర్‌పోల్ సహకారం వేగంగా అందుకోగలుగుతామని ఆయన అన్నారు. 'భారత్ పోల్'ను సీబీఐ రూపొందించింది. "అంతర్జాతీయ పోలీసుల సహకారం ఇప్పటిదాకా సీబీఐ మాత్రమే తీసుకుంటోంది. 'భారత్ పోల్' రాకతో మన దేశానికి చెందిన అన్నీ దర్యాప్తు సంస్థలూ, చివరకు రాష్ట్ర పోలీసు విభాగాలు సైతం ఇంటర్‌పోల్ సాయం తీసుకొనగలుగుతాయి. అంతర్జాతీయంగా మనదేశం చేపట్టే విచారణ ప్రక్రియను కొత్త శకంలోకి ఇది నడిపిస్తుంది. వేర్వేరు సంస్థల మధ్య సమన్వయం, సంబంధాల్లో తలెత్తుతున్న సమస్యలు తొలగించి..నేరగాళ్ల కట్టడికి బాగా పనిచేస్తుంది" అని అమిత్‌షా అన్నారు.

## రూ.25,700 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా.. ఏడాదిలో 20 లక్షల మందికి ఏఐ నైపుణ్యాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏడాది ముగిసే సమయానికి ఆ అంచనాలను మించి.. 24 లక్షల మందికి శిక్షణ ఇవ్వగలిగింది. వారిలో 65 శాతం మంది మహిళలు కాగా.. 74% మంది ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలవారే! ప్రపంచవ్యాప్తంగా ఏఐ నైపుణ్యాలను నేర్చుకుంటున్నవారిలో భారతీయ నిపుణులు ఎక్కువగా ఉంటున్నారని మైక్రోసాఫ్ట్ సంస్థ పేర్కొంది. ఈ క్రమంలోనే 'ఎడ్వాంటైజ్ ఇండియా' రెండో విడత పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ దిశగా మైక్రోసాఫ్ట్ రిసెర్చ్ (ఎంఎస్ఆర్) ల్యాబ్ ఇప్పటికే ఏఐ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ పేరుతో ఫిజిక్స్‌వాలా, రెమిడియో, సాఫ్ట్‌ఎక్స్ వంటి స్టార్టప్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. దేశీయ భాషల్లో లాంగ్వేజ్ లెర్నింగ్ మోడల్స్ రూపొందించడం, ప్రాంప్ట్ ఆప్టిమైజేషన్ వంటివాటిలో శిక్షణ ఇస్తోంది.

# ఫిబ్రవరి 5న ఢిల్లీ ఎన్నికలు




**» అమల్లోకి ఎన్నికల కోడ్**

న్యూఢిల్లీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల నగారా మోగింది. వచ్చేనెల 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ) మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు ఢిల్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 10న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు వివరించింది. ఆ తర్వాత నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. 17వ తేదీ వరకు నామినేషన్లకు అవకాశం ఉంటుంది. 18న నామినేషన్ల పరిశీలన(స్క్రూటినీ) ఉంటుంది. 20వ తేదీలోపు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 5న పోలింగ్‌ను నిర్వహిస్తామని, 8న కౌంటింగ్, ఫలితాలు ఉంటాయని స్పష్టం చేసింది. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఢిల్లీలో 2 లక్షల మంది కొత్త ఓటర్లను కలుపుకొని 1.55 కోట్ల మంది ఓటర్లున్నట్లు ఈసీఐ వెల్లడించింది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 12 సీట్లు ఎస్సీ రిజర్వ్ క్యాటగిరీలో ఉన్నాయి. "ఢిల్లీలో మోడల్ కోడ్(ఎన్నికల నియమావళి) అమల్లోకి వచ్చింది. 85 ఏళ్లకు పైగా వయసున్న ఓటర్లకు ఇంటి వద్ద నుంచే ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నాం" అని ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ తెలిపారు. కాగా, ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో "పెద్ద ఎత్తున ఎన్నికలకు సిద్ధం కండి" అని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ తమ పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. "ఫిర్ లాయింగే కేజ్రీవాల్(కేజ్రీవాల్‌ను మళ్లీ తీసుకొస్తాం)" అనే పాటను తమ ప్రచార గీతంగా ఆప్ ప్రకటించింది.

### కేంద్రం నా అధికారిక నివాసాన్ని లాక్కుంది: అతిశీ

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తన అధికారిక నివాసాన్ని లాక్కుందని ఢిల్లీ సీఎం అతిశీ మంగళవారం ఆరోపించారు. తనకు కేటాయించిన అధికారిక నివాసాన్ని ప్రజాపనుల శాఖ రద్దు చేయడంతో ఆమె ఈమేరకు ఆరోపించారు. అధికారిక నివాసం తనకో సమస్య కాదని, ఢిల్లీ ప్రజల కోసం వీధుల్లో ఉండయినా పనిచేయగలనని అన్నారు. అయితే, బీజేపీ ఈ ఆరోపణను తోసిపుచ్చింది. ఇచ్చిన గడువులోగా ఢిల్లీ సీఎం ఆ నివాసంలో చేరకపోవడం రద్దుకు ఒక కారణం కాగా.. సీబీఐ, ఈడీ విచారణలు మరో కారణమని తెలిపింది.

## దేశంలో ఏడుకు చేరిన హెచ్ఎంపీవీ కేసులు

న్యూఢిల్లీ, జనవరి 7: దేశంలో మరో రెండు హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య ఏడుకు పెరిగింది. మంగళవారం నాగ్‌పూర్‌లో ఇద్దరికి ఈ వైరస్ సోకినట్లు గుర్తించారు. ఇంతవరకు బెంగళూరులో రెండు, సేలం, అహ్మదాబాద్, చెన్నైల్లో ఒక్కొక్క కేసు చొప్పున నమోదయింది. బాధితులంతా మూడు నెలల నుంచి 13 ఏళ్లలోపు ఉన్న పిల్లలే. ఇది కొత్త వైరస్ ఏమీ కాదని, 2001లోనే గుర్తించారని ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా చెప్పారు. ఫ్లూ లక్షణాలతో ఉన్న జ్వరం వస్తుందని, దీనికి ఎలాంటి యాంటీ బయోటిక్స్ వాడాల్సిన పనిలేదని తెలిపారు. తగినన్ని నీళ్లు తాగాలని, పారాసిటమాల్ మాత్రలు, జ్వరం, వళ్లు నొప్పులు నివారించే మందులతో ఇది తగ్గుతుందని తెలిపారు.

## ఢిల్లీలో ప్రణబ్ స్మారక స్థూపం

న్యూఢిల్లీ, జనవరి 7: దివంగత రాష్ట్రపతి, భారత రత్న అవార్డు గ్రహీత ప్రణబ్ ముఖర్జీ స్మారక స్థూపాన్ని ఢిల్లీలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్‌ఘాట్ కాంప్లెక్స్ పరిధిలోని రాష్ట్రీయ స్మృతి స్థల్‌లో దీన్ని నెలకొల్పనుంది. ఈ సమాచారాన్ని తెలియజేస్తూ కేంద్ర గృహనిర్మాణ-పట్టణాభివృద్ధి శాఖ అధికారులు తనకు లేఖ పంపారని ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ తెలిపారు. అనూహ్యంగా ఈ కృప లభించిందని పేర్కొంటూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెప్పారు. ప్రణబ్ చనిపోయినప్పుడు సంతాపం తెలిపేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేకంగా భేటీ కాలేదంటూ ఇటీవల శర్మిష్ఠ విమర్శలు చేయడం గమనార్హం.



రాష్ట్ర బీజేపీ సంస్థాగత ఎన్నికలపై విశాఖపట్నంలో మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్రంలోని 26 జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించడానికి ఇద్దరేసి చొప్పున ఎంపిక చేశారు. ఈ నెల 15లోగా కొత్త నాయకులను ప్రకటించనున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి స్వగృహంలో జరిగిన సమావేశంలో జాతీయ సహసంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, బీజేపీ ఎంపీలు సీఎం రమేశ్, ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరి, విష్ణుకుమార్‌రాజు, ఆదినారాయణరెడ్డి, ఎన్.ఈశ్వరావు, సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కాశీవిశ్వనాథరాజు పాల్గొన్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

## సర్టిఫికెట్లు ఆపితే అఫిలియేషన్ రద్దు

- అడ్మిషన్ వద్దంటే కట్టిన ఫీజు వెనక్కివ్వాలి
- ఉన్నత విద్యామండలి చైర్మన్ కీలక ఆదేశాలు

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఫీజులు కట్టలేదని సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం, అడ్మిషన్ల సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోవడం, ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిడి చేయడం తదితర ఘటనలపై ప్రభుత్వం సీరియస్ అయింది. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి భారీగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కాలేజీలకు హెచ్చరికలు చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి మంగళవారం కీలక ప్రకటన జారీ చేశారు. అదనపు ఫీజులు వసూలు చేయడం, రీయింబర్స్‌మెంట్ వర్తించే విద్యార్థులను ఫీజులు డిమాండ్ చేయడం వర్సిటీలు, ప్రభుత్వం ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటువంటి విద్యాసంస్థల అఫిలియేషన్ రద్దుచేసి, న్యాయపరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

### కాలేజీలు పాటించాల్సిన నిబంధనలివీ...

అడ్మిషన్ తీసుకున్న తర్వాత విద్యార్థి అడ్మిషన్ వద్దనుకుంటే మొత్తం ఫీజులో 5శాతం (గరిష్ఠంగా రూ.5వేలు దాటకూడదు) మించకుండా మినహాయించుకుని 15 రోజుల్లోగా వారు కట్టిన ఫీజులు వెనక్కి చెల్లించాలి. రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థులను ఫీజులు చెల్లించాలని అడగటం నిషేధం. అడ్మిషన్ సమయంలో విద్యార్థుల నుంచి మార్కుల షీట్లు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోకూడదు. వ్యక్తిగతంగా నిర్ధారించి రాసిచ్చిన కాపీలు మాత్రమే తీసుకోవాలి. ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి, తిరిగి ఇచ్చేయాలి. ఏమైనా అనుమానాలుంటే వాటిని జారీచేసిన అథారిటీ ద్వారా ధ్రువీకరించుకోవాలి. ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఖరారు చేసిన ఫీజు కంటే అదనంగా వసూలు చేయకూడదు.

## జగన్ పాస్‌పోర్టుకు హైకోర్టు ఎన్‌వోసీ

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి హైకోర్టులో ఉపశమనం లభించింది. ఐదేళ్ల కాలపరిమితితో ఆయనకు పాస్‌పోర్టు ఇవ్వాలని కోర్టు పాస్‌పోర్టు అధికారులను ఆదేశించింది. ఆయన తాజాగా పాస్‌పోర్టు పొందేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని(ఎన్‌వోసీ) జారీ చేసింది. యూకేలో ఈ నెల 16న జరగనున్న కుమార్తె స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అనుమతి ఇచ్చింది. పాస్‌పోర్టు జారీ విషయంలో స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నాయని, తమముందు హాజరై రూ.20వేల స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందేనంటూ.. ఎన్‌వోసీ కోసం జగన్ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ విజయవాడ ప్రత్యేక కోర్టు (ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే న్యాయస్థానం) ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం తీర్పు వెలువరించారు.

# నవ్యాంధ్రకు నవశకం

(మొదటి పేజీ తరువాయి)

పూడిమడకలో ఏర్పాటుచేసే గ్రీన్ హైడ్రోజన్ హబ్ విలువే రూ.1.85లక్షల కోట్లు. రహదారులు, రైల్వే పనుల అంచనా రూ.19.5వేల కోట్లు. వీటితోపాటు మరో 10కిపైగా ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. అలాగే.. కొత్తగా నిర్మించిన, విస్తరించిన ఆరు రహదారులు, రైల్వే లైన్లు జాతికి అంకితం చేస్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఆయన రాష్ట్రానికి రావడం ఇదే మొదటి సారి. ప్రధాని వెంట సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. ఈ మేరకు రాష్ట్ర యంత్రాంగం, పోలీసు విభాగాలను సీఎస్ విజయానంద్, డీజీపీ ద్వారకా తిరుమల రావు అప్రమత్తం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఈ మార్గంలోని రహదారిని ప్రత్యేక బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 1.5లక్షల మందిని సమీకరిస్తున్నారు. సభ వేదికపై మోదీతో పాటు గవర్నర్ అబ్దుల్ నజీర్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యుడు సుందరపు విజయకుమార్ ఉంటారు. ప్రధానికి కుడి వైపున గవర్నర్, ఎడమ వైపున ముఖ్యమంత్రికి సీట్లు కేటాయించారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు ప్రసంగించిన తరువాత ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలు ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తారు. ప్రధాని ప్రసంగాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అనువదిస్తారు.

### చిన్నపొరపాటు కూడా జరగొద్దు: సీఎస్, డీజీపీ

ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాని పర్యటనలో ఏ చిన్న పొరబాటుకూ ఆస్కారం లేకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ వీసీలో డీజీపీ ద్వారకా తిరుమలరావు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఎస్పీజీ సమన్వయంతో పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. రోడ్ షో కోసం, సభ కోసం చేస్తున్న ఏర్పాట్లను విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వివరించారు.



విశాఖలో ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రులు అచ్చెన్న, కొల్లు, అనిత, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కొండ్రు మురళి, పుల్లారావు, ఎంపీ సీఎం రమేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

### ఇంధన క్షేత్రంలో మైలురాయి.. గ్రీన్ హైడ్రోజన్ హబ్

భారతదేశ గ్రీన్ ఎనర్జీ రంగంలో ముఖ్యమైన మైలురాయి గ్రీన్ హైడ్రోజన్ హబ్. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్- న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) కలిసి దీనిని ఏర్పాటు చేస్తున్నాయి. బుధవారం ప్రధాని శంకుస్థాపన చేయనున్న ఈ ప్రాజెక్టుకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది ప్రభుత్వ రంగంలోనే మొట్టమొదటిది. ప్రాజెక్టు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 300ఎకరాల విస్తీర్ణంలో 25 పారిశ్రామిక మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు, ఇంకో 300 ఎకరాల్లో యుటిలిటీస్, సౌకర్యాలు, లాజిస్టిక్స్ రోడ్లు, పారిశ్రామిక కేంద్రాలు, విద్యుత్తు, నీటి సౌకర్యం, డీశాలినేషన్ ప్లాంట్లు, ఓడరేవు తదితర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. దీనిపై సీఎస్ విజయానంద్ మంగళవారం విద్యుత్తు వినియోగ సంస్థలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.



### శంకుస్థాపన చేసే ప్రాజెక్టులు..

ప్రధాని మోదీ విశాఖ సభా వేదికగా 12కుపైగా ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ఆరుకుపైగా రహదారులను జాతికి అంకితం చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పనుల విలువ దాదాపు రూ. రెండు లక్షల కోట్ల పైమాటే. వేదికపై కూటమి పార్టీల నేతలంతా కనిపించనున్నారు. సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు ఐటీ శాఖ మంత్రి లోకేశ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంద్వేశరి పాల్గొననున్నారు.

- అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఎన్‌టీపీసీ రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు. 57 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్రాజెక్టును 1,600 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు.
- అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కుకు శంకుస్థాపన.
- కృష్ణపట్నానికి సంబంధించిన ఇండస్ట్రియల్ నోడ్.
- విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన.
- ఆదోని పట్టణం నుంచి ఎన్‌హెచ్-167ను కలుపుతూ బైపాస్ రహదారి
- కొండమోరు నుంచి పేరేచర్ల రహదారి విస్తరణ
- సంగమేశ్వరం నుంచి ఆత్మకూరు వరకు రహదారి విస్తరణ
- వేంపల్లి నుంచి చాగలమర్రి వరకు ఎన్‌హెచ్-440 నాలుగు లేన్లకు విస్తరణ
- ఎన్‌హెచ్-516 నుంచి పాడేరు బైపాస్ రహదారి నిర్మాణం
- గుంటూరు నుంచి బీబీ నగర్ వరకు రైల్వే లైన్ డబ్లింగ్
- మహబూబ్ నగర్ నుంచి కర్నూల్ మీదుగా డోన్ రైల్వే లైన్ డబ్లింగ్
- గుత్తి-పెండేకల్లు రైల్వే లైన్ డబ్లింగ్.
- రూ.19,500 కోట్ల విలువైన రహదారులు, రైల్వే ప్రాజెక్టులు.. ఇంకా ఇతర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు.

### షెడ్యూల్ ఇలా..

బుధవారం సాయంత్రం 4.15 గంటలకు ప్రధాని మోదీ విశాఖకు చేరుకుంటారు. సాయంత్రం 4.45 గంటల నుంచి 5.30 గంటల వరకు వెంకటాద్రి వంటిల్లు రెస్టారెంట్ ప్రాంతం నుంచి సుమారు కిలోమీటరు మేర రోడ్డు షోలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 నుంచి 6.45 వరకూ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా వేదిక వద్ద నుంచి వర్చువల్‌గా పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం సభలో మాట్లాడతారు. సాయంత్రం 6.50 గంటలకు సభా వేదిక నుంచి బయలుదేరి విమానాశ్రయానికి చేరుకుని 7.15 గంటలకు భువనేశ్వర్‌కు బయలుదేరి వెళతారు.

## నాలుగు నెలలుగా 'ఉక్కు'లో జీతాల్లేవు

- తక్షణమే చెల్లించేలా చొరవ తీసుకోండి
- అమరావతి, పేదల ఇళ్ల నిర్మాణంలో వైజాగ్ స్టీల్‌ను వినియోగించండి
- సీఎస్ విజయానంద్‌కు ఉక్కు అధికారుల సంఘం వినతి

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'గత నాలుగు నెలలుగా విశాఖ ఉక్కు ఉద్యోగులకు జీతాలు, వితంతువులకు పెన్షన్లు అందడం లేదు. తక్షణమే వాటిని చెల్లించేలా చర్యలు తీసుకోవాలి' అని ఉక్కు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలిసి, వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ ఉక్కు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, ప్రభుత్వం తక్షణమే చేయవలసిన సాయం గురించి సీఎస్‌కు ఆ వినతిపత్రంలో వివరించారు. పెద్ద ఎత్తున చేపట్టిన అమరావతి నిర్మాణానికి, పేదల ఇళ్లకు నాణ్యమైన విశాఖ ఉక్కును వినియోగించేలా చూడాలని కోరారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నెలకు రూ.500 కోట్లు చొప్పున నాలుగు నెలలు అడ్వాన్సుగా ఇచ్చేట్లు ఒప్పించాలని విన్నవించినట్లు ప్రసాద్ తెలిపారు. ఉక్కు సమస్యలపై త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని, పరిష్కారం దిశగా పని చేస్తామని సీఎస్ చెప్పారని పేర్కొన్న సంఘం నేత ప్రసాద్.. మంత్రి లోకేశ్, ఫైనాన్స్ సెక్రటరీ కార్యాలయాల్లోనూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

### కేంద్రం పరిశీలనలో జీతాల సమస్య: పురందేశ్వరి

విశాఖపట్నం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'విశాఖ ఉక్కును కష్టాల నుంచి గట్టెక్కించడానికి కేంద్రం మంచి ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని ఆలోచన చేస్తోంది. ఉద్యోగులు ఆందోళన చెందవద్దు' అని ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించడానికి ఆమె మంగళవారం సాయంత్రం ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానానికి వచ్చారు. అక్కడ విలేకరులతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు సమస్యను ప్రస్తావించారు. ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు లేవని విలేకరులు చెప్పగా, ఆ విషయం కూడా కేంద్ర మంత్రి పరిశీలనలో ఉందన్నారు. తెలంగాణాలో బీజేపీ కార్యాలయంపై దాడి దారుణమని, కారకులను గుర్తించి వారిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పురందేశ్వరి కోరారు.

### ఉమ్మడి నెల్లూరుకు భాగ్యరేఖ.. క్రిస్ సిటీ

క్రిస్‌సిటీ(కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ)...ఉమ్మడి నెల్లూరు జిల్లాకు భాగ్యరేఖ. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. సముద్రతీర ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక కారిడార్‌లను నెలకొల్పుతోంది. ఇందులో భాగంగా సీబీఐసీ (చెన్నై- బెంగళూరు ఇండ్రస్ట్రియల్ కారిడార్) ఏర్పాటుకు 13వేల ఎకరాలు సేకరించేందుకు చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్ట్ విలువ దాదాపు రూ.37,500కోట్లు. తొలివిడతగా రూ.2,139.44కోట్లతో 2500 ఎకరాల్లో క్రిస్‌సిటీని అభివృద్ధి చేయనున్నారు. బీవీఎస్ఆర్ సంస్థ ఇప్పటికే పనులు మొదలుపెట్టింది. ఈ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ బుధవారం అధికారికంగా శంకుస్థాపన చేస్తారు.

## అర్జీలూ ఆన్‌లైన్‌లో!

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయ ఆవరణలో ప్రజల నుంచి సుమారు 1,090 అర్జీలను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. '8 సార్లు గెలిపించిన కుప్పం నియోజకవర్గానికి నేను చేయాల్సింది చాలా ఉంది. ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత నాది. ఎమ్మెల్యే హోదాలో ఇక్కడ సమస్యల పరిష్కారానికి జననాయకుడు పోర్టల్‌ను ఏర్పాటు చేసుకున్నాను. అరాచక పాలనకు వైసీపీ పరాకాష్ఠ. నాతో సహా మా శ్రేణుల మీద కేసులు పెట్టారు. రాజకీయ కక్షతో ఐదేళ్లలో మీడియాపై పెట్టిన కేసులను కూడా తొలగించేస్తాం' అని చెప్పారు. టీడీపీ చరిత్రలో ఎప్పుడూ కోటి సభ్యత్వం నమోదు కాలేదని.. నేడో రేపో ఆ లక్ష్యాన్ని చేరుకోనున్నామని తెలిపారు. కార్యకర్తల్లో ఆమోదయోగ్యమైన వారికే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పదవులిస్తామన్నారు. ప్రభుత్వ పదవులతోపాటు పార్టీలో ఇచ్చే పదవులు కూడా ముఖ్యమైనవేనని.. మే నెలలోగా అన్నిరకాల పదవులనూ భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

### 'ఎనీవేర్' మంచిదే కానీ..

ఎనీవేర్ రిజిస్ట్రేషన్ మంచిదేనని.. కానీ గత ఐదేళ్లలో రికార్డులను తారుమారు చేసి ఇష్టానుసారం రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని సీఎం ధ్వజమెత్తారు. వాటన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. అందుకే రెవెన్యూ సదస్సులు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. గోదావరి-పెన్నా అనుసంధానం, పోలవరం-బనకచర్ల అనుసంధానం.. రాష్ట్రానికి గేమ్ చేంజర్ లాంటివి. వేల టీఎంసీలు సముద్రంలో కలిసిపోతున్నాయి. బనకచర్లకు నీళ్లు తెస్తే రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులకు నీళ్లు సరిపోతాయి. రాష్ట్రంలో కరువు అనేది ఉండదు' అని తెలిపారు.

### శంకుస్థాపనలు..

ఎన్టీఆర్ స్టేడియంలో మదర్ డెయిరీ, శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, కడా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ల నిర్మాణానికి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. చివరిగా ద్రవిడ వర్సిటీలోని అకడమిక్ బ్లాక్ కొత్త భవనాన్ని ప్రారంభించారు. రాత్రి కుప్పం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బస చేసిన ఆయన.. బుధవారం కుప్పం నుంచి బయల్దేరి ప్రధాని పర్యటనలో పాల్గొనేందుకు విశాఖపట్నం వెళ్లనున్నారు.

## 'నాడు-నేడు'పై ఆడిట్

(మొదటి పేజీ తరువాయి)

రెండు విడతల్లో కలిపి రూ. 8,230 కోట్లు నాడు-నేడు పథకానికి ఖర్చు చేయగా, ఆ స్థాయిలో ఫలితాలు బడుల్లో కనిపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపై తనిఖీలు అవసరమని కొందరు ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీంతో మొత్తం పథకంపై ఆడిట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ తర్వాత వాస్తవ అవసరాల మేరకు మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

### ప్రగల్భాలే మిగిలాయి

నాడు- నేడు పథకంలో మూడు విడతల్లో మొత్తం 45 వేల ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేస్తామని అప్పట్లో వైసీపీ ప్రగల్భాలు పలికింది. ఐదేళ్లలో రెండో విడత పనులు కూడా పూర్తిచేయలేకపోయింది. పైగా ప్రారంభించిన పనులను సగంలోనే వదిలేసింది. ఈ పథకానికి సమీకరించిన రుణాలను పక్కదారి పట్టించింది. కాగా తొలి విడతలో 15,713 పాఠశాలల్లో పనులు చేపట్టి, అందుకోసం రూ.3,870 కోట్లు ఖర్చుచేసింది. రెండో విడతలో 22,311 పాఠశాలల్లో పనులకు రూ. 4,360 కోట్లు ఖర్చు చేసింది.

### రేటింగ్‌తో బట్టబయలు

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, అకడమిక్ అంశాలపై ప్రభుత్వం ఇటీవల వేర్వేరుగా స్టార్ రేటింగ్ ఇచ్చింది. మౌలిక సదుపాయాలపై 5 స్టార్, అకడమిక్‌పై 5 స్టార్ రేటింగ్ ఇచ్చింది. అన్ని పాఠశాలల్లో సదుపాయాలపై అంచనా వేసి ఈ రేటింగ్ ఇవ్వగా రాష్ట్రంలో ఒక్కటంటే ఒక్క పాఠశాల కూడా 5 స్టార్ రేటింగ్ సాధించలేదు. కనీసం 30 శాతం సదుపాయాలు కూడా లేక 87 పాఠశాలలు జీరో రేటింగ్‌తో సరిపెట్టుకున్నాయి. 1,958 పాఠశాలలు ఒక స్టార్, 16,816 పాఠశాలలు 2స్టార్లు, 19,438 పాఠశాలలు 3 స్టార్లు, 6,788 పాఠశాలలు 4 స్టార్ల రేటింగ్ సాధించాయి. ఒక్క పాఠశాల కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేదు. దీంతో పాఠశాలల్లో చేసిన వేల కోట్లు ఖర్చు ఏమైందనే అనుమానాలున్నాయి.

### అవసరం లేకపోయినా పనులు

నాడు- నేడు పథకం అంచనాల్లోనే వైసీపీ ప్రభుత్వం తప్పటడుగులు వేసింది. ఏ పాఠశాలలో మౌలిక సదుపాయాలు అవసరం? ఎక్కడ అవసరం లేదు? అనే విషయంలోనే పొరపాట్లు చేసింది. అనేక ప్రాథమిక పాఠశాలల్లో పథకం అమలుచేసిన తర్వాత విద్యార్థులు లేని పరిస్థితి ఏర్పడింది. అలాగే వేల సంఖ్యలో పాఠశాలల్లో పనులు చేశాక అక్కడి 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది.

### దారిమళ్లిన నిధులు

రెండో విడత నాడు-నేడు పనులకు రూ.8 వేల కోట్లు అవసరమవుతాయని వైసీపీ ప్రభుత్వం అంచనా వేసింది. నాబార్డు నుంచి రూ.3,025 కోట్ల రుణం, కేంద్ర పథకం ఎస్ఎస్ఏపై నుంచి రూ.3,561 కోట్లు గ్రాంట్ పొందింది. ప్రపంచ బ్యాంకు ఈ పథకం కోసం రూ.425 కోట్లు రుణంగా ఇచ్చింది. ఈ మొత్తం రూ.7,011 కోట్లు కాగా, సార్వత్రిక ఎన్నికల నాటికి వైసీపీ ప్రభుత్వం రూ.4,177 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. దాదాపు రూ.3 వేల కోట్లను ఇతరత్రా పథకాలు, బిల్లుల చెల్లింపులకు మళ్లించింది.



### అప్పుడు వారు.. ఇప్పుడు వీరు!

వైసీపీ హయాంలో ప్రభుత్వ భవనాలకు ఆ పార్టీ రంగులు వేశారు. దీనిపై అప్పట్లో నానా యాగీ చేసిన టీడీపీ.. ఇప్పుడు ఆ దారిలోనే వెళుతోంది. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో మెప్మా కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనానికి టీడీపీ రంగు వేశారు. - నరసరావుపేట, ఆంధ్రజ్యోతి

## విచారణకు సహకరించండి

- వైసీపీ నేత పిన్నెల్లికి హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని మాచర్లలోని టీడీపీ కార్యాలయాన్ని తగులబెట్టడంతో పాటు ఆ పార్టీ కార్యకర్తలపై దాడి చేసిన కేసులో పోలీసుల విచారణకు సహకరించాలని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. సంక్రాంతి సెలవులు ముగిసేవరకు రామకృష్ణారెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను ఈ నెల మూడోవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఒ. మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందని, అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తే పోలీసు విచారణకు ఆటంకం కలుగుతుందన్నారు.

### 'పేర్ని' ఖాతాకే బియ్యం సొమ్ములు

- బెయిల్ ఇస్తే విచారణపై ప్రభావం: అడ్వకేట్ జనరల్

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గోదాములో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని మాయం చేయడంలో వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని కీలకపాత్ర పోషించారని, దీనికి సంబంధించి ఆధారాలు ఉన్నాయని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. గోడౌన్ మేనేజర్, కేసులో రెండో నిందితుడైన మానస తేజ బ్యాంకు ఖాతా నుంచి పేర్ని నాని బ్యాంకు ఖాతాకు బదిలీ అయిన విషయం దర్యాప్తులో తేలిందన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయించింది ఎన్నికల సమయంలోనేనని పేర్కొన్నారు. నాని గతంలో మంత్రిగా పనిచేశారని బెయిల్ ఇస్తే దర్యాప్తును ప్రభావితం చేస్తారని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి నాని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 20న విచారణ జరుపుతామని తెలిపారు. అప్పటివరకు ఆయనపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పొడిగించారు. పేర్నినాని సతీమణి జయసుధ మచిలీపట్నంలోని తన గోడౌన్‌ను పౌరసరఫరాల శాఖకు లీజుకిచ్చారు. దీనిలో నిల్వ చేసిన రేషన్ బియ్యం మాయం అయ్యాయంటూ చింతం కోటిరెడ్డి ఫిర్యాదు చేశారు.

## బ్యాగ్ బరువు తగ్గిద్దాం

- కొన్ని సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకం
- ప్రాథమిక స్థాయిలో అన్నింటికీ ఒక్కటే
- మార్చి నాటికి వీసీల నియామకం పూర్తి
- విద్యాశాఖపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. బరువు తగ్గించి, నాణ్యత పెరిగేలా నూతన పాఠ్య ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యాశాఖలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. 'ఏపీ మోడల్ ఎడ్యుకేషన్' లక్ష్యంగా సంస్కరణలు తీసుకురావాలని ఆదేశించారు. పాఠశాల విద్యలో ఓఎంఆర్ షీట్ల స్థానంలో డిజిటల్ అసెస్‌మెంట్ చేస్తే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందని చెప్పారు. జీవో 117కు ప్రత్యామ్నాయం విషయంలో ఎమ్మెల్యేలు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల అభిప్రాయాలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు రెండు సెమిస్టర్లకు వేర్వేరుగా పుస్తకాలు ఇస్తున్నారు. ఇకపై ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేకంగా పుస్తకం అక్కర్లేకుండా, కొన్ని సబ్జెక్టులను కలిపి ఒకే పుస్తకంగా తీసుకొచ్చే విధానాన్ని అధికారులు వివరించారు. ప్రాథమిక స్థాయిలో మొత్తం సబ్జెక్టులు ఒకే పుస్తకంలో ఉండాలని, పైతరగతుల్లో ప్రస్తుతం ఉన్న పుస్తకాలను సగానికి తగ్గించి, రెండు, మూడు సబ్జెక్టులు ఒకే పుస్తకంలోకి తేవాలనే ప్రతిపాదనలు చేశారు. దీనిని మరోసారి పరిశీలించి, నిర్ణయించాలని మంత్రి ఆదేశించారు. విమర్శలకు తావులేకుండా పారదర్శకంగా డీఎస్సీ పూర్తిచేసేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటర్ విద్యలో గత పదేళ్లుగా ఎలాంటి సంస్కరణలు తీసుకురాలేదన్నారు. ప్రీఫైనల్ పరీక్షలు జనవరి నాటికి పూర్తిచేసేలా అకడమిక్ క్యాలెండర్ రూపొందించాలని ఆదేశించారు. సంస్కరణలు ప్రవేశపెట్టే ముందు విద్యారంగ నిపుణులు, తల్లిదండ్రుల సలహాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గణితంలో ఒకే పేపర్, బోటనీ, జువాలజీ కలిపి ఒకే పేపర్ నిర్వహించడంపైనా చర్చించారు. సీబీఎస్ఈ తరహాలో ఇం టర్నల్ మార్కుల విధానం అమలుపై అధ్యయనం చేయాలని లోకేశ్ సూచించారు. యూనివర్సిటీల వీసీలు, సలహా మండలి సభ్యుల నియామకాలు మార్చి నాటికి పూర్తికావాలన్నారు. ఉన్నత విద్యలో స్థూల ప్రవేశాల నిష్పత్తి(జీఈఆర్)ను 36 శాతం నుంచి 50 శాతానికి పెంచేలా చర్యలుండాలని ఆదేశించారు.

### పాలిటెక్నిక్ శిక్షణలో మార్పులు: మంత్రి లోకేశ్

విజయవాడ(ఆటోనగర్): మేక్ ఇన్ ఇండియాకు అనుగుణంగా పాలిటెక్నిక్ శిక్షణలో మార్పులు తీసుకొస్తామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో 2 రోజులపాటు నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్-2025 ముగింపు వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. తొలుత పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన 243 వైజ్ఞానిక ఆకృతులను తిలకించి, వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో రూ.8వేల కోట్ల విలువైన పరిశ్రమల స్థాపన దిశగా అడుగులేస్తున్నామన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రతి నగరంలో విద్యార్థుల నుంచి వినూత్న ఆలోచనలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి జిల్లాకు ఒక్కో ప్రాజెక్టు తీసుకొచ్చే విధంగా పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు.



మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలతో స్వనీతి, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు

## పవన విద్యుత్‌పై 12 వేల మందికి శిక్షణ

- కాలేజీల్లో ల్యాబ్‌లు, ఎక్స్‌లెన్స్ సెంటర్లు
- సుజ్లాన్, స్వనీతి కంపెనీలతో ఒప్పందాలు
- మంత్రి లోకేశ్ సమక్షంలో సంతకాలు

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఇంధన రంగంలో యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం కీలక ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రంలో భారీగా పవన విద్యుత్‌పై నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్‌తో, గ్రీన్ ఎనర్జీలో యువతకు ఉపాధి కల్పన కోసం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందాలు చేసుకుంది. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో మంగళవారం ఈ ఒప్పందాలు జరిగాయి. పవన విద్యుత్ రంగంలో యువతకు అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా సుజ్లాన్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని లోకేశ్ అన్నా రు. ఈ ఒప్పందం ద్వారా మెకానికల్, ఎలక్ట్రికల్, బ్లేడ్ టెక్నాలజీ, సివిల్, లైజనింగ్ రంగాల్లో 12 వేల మందికి శిక్షణ ఇస్తారు. 3 నుంచి 12 నెలల కాల వ్యవధితో శిక్షణ కార్యక్రమాలు చేపడతారు. పవన విద్యుత్ రంగం అవసరాలకు తగ్గట్టుగా ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ కాలేజీల్లో వృత్తి విద్య కోర్సులు ప్రవేశపెడతారు. కాలేజీల్లో స్కిల్ ల్యాబ్‌లు ఏర్పాటుచేసి పరిశోధన, ఆవిష్కరణ, శిక్షణ కోసం ఎక్స్‌లెన్స్ సెంటర్లు నిర్వహిస్తారు. ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేస్తారు. రాష్ట్రంలో పవన విద్యుత్ కార్యక్రమాలు చేపట్టే సుజ్లాన్ కంపెనీకి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారం అందిస్తుంది. స్వనీతి ఇనిషియేటివ్ సంస్థ గ్రీన్ స్కిల్లింగ్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపడుతుంది. వచ్చే 4 నెలల్లో పునరుత్పాదక ఇంధన రంగంలో నైపుణ్యాభివృద్ధికి ముసాయిదా ప్రణాళికను సిద్ధంచేస్తుంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్వనీతి బృందానికి సహకారం అందిస్తుంది. నైపుణ్య గణన, ఇన్‌సైట్ సమాచారం, గ్రీన్ స్కిల్లింగ్‌పై సమాచారం ఆ కంపెనీకి అందజేస్తుంది. అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లోని గ్రీన్ ఎనర్జీకి సంబంధించి ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసి, ఇతరత్రా సమాచారం ఇస్తుంది. ఇందులో భాగంగా స్వనీతి సంస్థ పలు కార్యక్రమాలు చేపడుతుంది. అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో గ్రీన్ ఉద్యోగాల కల్పనకు అవకాశాలను అంచనా వేసేందుకు బేస్‌లైన్ సర్వే చేపడుతుంది. కార్యక్రమంలో సుజ్లాన్ కం పెనీ సీఈవో జేపీ చలసాని, సీహెచ్ఆర్ ఒ.రాజేంద్ర మెహ తా, స్వనీతి కంపెనీ ట్రస్టీ ఉమా భట్టాచార్య పాల్గొన్నారు.

## ఓఎన్‌జీసీకి 'బూడిద'!

(మొదటి పేజీ తరువాయి)

గడిస్తున్నారు. బెరైటీస్ బెనిఫిసియేషన్ ప్లాంట్లలో భారీగా వ్యర్థాలు ఉంటాయి. ప్రతి నెలా ఇవి టన్నుల కొద్దీ మిగిలిపోతాయి. కడప జిల్లాకు చెందిన ఓ వైసీపీ నేత తనుకున్న తెలివితేటలతో బెనిఫిసియేషన్ ప్లాంట్లలో మిగిలిపోతున్న టన్నుల కొద్ది వ్యర్థాలు, డోలమైట్ పౌడర్, బూడిదరంగు మిశ్రమం, ఇంకా కొంత నాసిరకం బొగ్గును సేకరించి క్రషింగ్ చేసి పౌడర్‌గా మారుస్తున్నారు. దాన్నే సీగ్రేడ్ బెరైటీస్ బ్యాగుల్లో కలుపుతున్నారు. 45 కేజీల సామర్థ్యం ఉండే బ్యాగులో 30కేజీలమేర ఈ కల్తీ మిశ్రమ పౌడర్, మిగిలిన 15కేజీలు సీ గ్రేడ్ ముగ్గురాయి పౌడర్‌ను కలుపుతున్నారు. ఇలా మిక్స్ చేసిన బ్యాగులనే సీగ్రేడ్ బెరైటీస్‌గా ఓఎన్‌జీసీకి సరఫరాచేస్తున్నారని తెలిసింది.

### ఇంటి దొంగల తీరు ఇంతింతై..

ఓఎన్‌జీసీకి పంపించే బెరైటీస్‌కు నాణ్యతా పరీక్ష ఉంటుంది. అయితే.. ఇక్కడ కూడా సిండికేట్ ముఠా నయవంచన చేస్తున్నట్టు తెలిసింది. సాధారణంగా ప్రతి 250 టన్నుల లోడ్‌కు సంబంధించి ఓఎన్‌జీసీ నాణ్యతా విభాగం సదరు బ్యాగులను పరిశీలన చేయాలి. వాటిలోని పౌడర్ నాణ్యతను పరీక్షించాలి. అయితే, వైసీపీ నేత నకిలీ సరుకును కాకుండా.. పరీక్షలకోసం నాణ్యమైన సీగ్రేడ్ పౌడర్‌ను అందిస్తున్నారు. దీంతో నాణ్యతా పరీక్షల్లో ఎలాంటి తేడా కనిపించడం లేదు. అనంతరం.. వీటి మాటున కల్తీ ముగ్గురాయి సూపర్ సక్సెస్ అయిపోతోంది. దీనికి సంబంధించిన సెటిల్‌మెంట్ మొత్తం కోడూరులోనే జరుగుతున్నట్టు తెలిసింది. ఇక.. ఈ వ్యవహారమంతా కేంద్ర సంస్థలోని ఇంటిదొంగలకు తెలిసే జరుగుతుండడం విశేషం. సీగ్రేడ్ ట్రాన్సిట్‌లతో వచ్చే ముగ్గురాయిని బీగ్రేడ్‌గా నమోదు చేయడంలోనే వారి 'అవినీతి పనితీరు' ఉండడం గమనార్హం. ఇక, కల్తీ మిశ్రమం బెరైటీస్‌లో కలపడాన్ని వారు ఏమాత్రం కనిపెట్టే అవకాశమే లేదు. అంటే, అన్ని స్థాయిల్లో కేంద్ర సంస్థ అయిన ఓఎన్‌జీసీ ఇంటిదొంగల సహకారంతో కడప వైసీపీ నేత నేతృత్వంలోని సిండికేట్ నయవంచన చేస్తోంది.

### పొంచిఉన్న ప్రమాదం

నిజానికి ఇలాంటి కల్తీ మిశ్రమాలను తయారు చేయడమే పర్యావరణానికి హానికరం. అలాంటిది, దాన్ని బెరైటీస్‌లో కలిపి ఆయిల్ డ్రిల్లింగ్ బావుల్లో లక్షల టన్నులు వినియోగించడం మరీ ప్రమాదకరం. పర్యావరణాన్ని పణంగా పెట్టడమే అవుతుంది. అంతేకాదు, ఏదైనా ప్రమాదాలు జరిగితే ఊహకందని నష్టం జరిగే అవకాశం కూడా ఉంటుంది. మంటలను అదుపు చేయలేని పరిస్థితి వస్తుంది.

## కేఎన్‌ఆర్, సునీల్‌రెడ్డి బెదిరించారా?

- ఎన్ని ఆస్తులు అక్రమంగా రిజిస్టర్ జరిగాయి?
- వైరల్ అవుతున్న మీ లేఖ సంగతేంటి?
- రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్‌కు కస్టడీలో ఏసీబీ ప్రశ్నలు
- 'బాబునే లోపల వేశాం.. ఇక నీవెంత' అని బెదిరించారని ధర్మ సింగ్ వెల్లడి
- తన ఆరోపణలకు ఆధారాలిచ్చేందుకు అంగీకారం
- వాటిని చూశాక శ్రీకాంత్‌కు నోటీసు!

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'అక్రమంగా భూములు రిజిస్టర్ చేయాలంటూ ఎవరు బెదిరించారు. ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా ఎన్ని రిజిస్ట్రేషన్లు అక్రమంగా చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మీరు రాసిన లేఖ సంగతేంటి? అందులోని ఆరోపణలకు ఆధారాలు ఏమైనా ఉన్నాయా?' అంటూ ఏసీబీ అధికారులు అప్పటి సబ్ రిజిస్ట్రార్ లాలా బాలనాగధర్మ సింగ్‌ను ప్రశ్నించారు. చంద్రబాబునే జైల్లో వేశామని, ఇక నీవెంత అని వైసీపీ నేతలు అక్రమ రిజిస్ట్రేషన్ల కోసం తనపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారని ఆయన వెల్లడించినట్లు తెలిసింది. విజయవాడ ఏసీబీ అధికారులు సింగ్‌పై 2023 అక్టోబరులో ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసు నమోదు చేశారు. ముందే తెలియడంతో సింగ్ పరారయ్యారు(ఇందుకు ఓ వైసీపీ ఎమ్మెల్సీ సాయం చేసినట్లు సమాచారం). ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టి ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక.. ఇటీవల పాత కేసుల సమీక్షలో భాగంగా.. 2023లో నమోదు చేసిన కేసు (ఎఫ్ఐఆర్ 05/ఆర్‌పీసీ/సీఐయూ/ఏసీబీ)లో నిందితుడు సింగ్‌ను ఇంతవరకూ ఎందుకు అరెస్టు చేయలేదని అధికారులను ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దలకు సన్నిహితంగా ఉండే వారితో నిందితుడికి సంబంధాలు ఉండడం ఒక కారణం కాగా.. గత ఏడాది జూన్‌లోనే సింగ్ రిటైరైనందున దృష్టిపెట్టలేదని వారు బదులిచ్చారు. వెంటనే అరెస్టు చేయాలని ఆయన ఆదేశించడంతో రంగంలోకి దిగిన సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ అధికారులు.. గత నెల 31న ధర్మ సింగ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాలతో జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఏసీబీ కోర్టులో పిటిషన్ వేసి.. ఆయన్ను కస్టడీలో ప్రశ్నించేందుకు అనుమతి కోరడంతో నాలుగు రోజుల కస్టడీకి న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీంతో మంగళవారం ఉదయం విజయవాడ జైలులో సింగ్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గత నాలుగు రోజులుగా ధర్మ సింగ్ వ్యవహారంపై వస్తున్న వార్తలకు సంబంధించి ప్రశ్నలు సంధించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖపైనా ఆరా తీశారు. మాజీ సీఎం జగన్ పీఏ కేఎన్ఆర్, జగన్ సోదరుడు వైఎస్ సునీల్‌రెడ్డి మిమ్మల్ని బెదిరించారా..? ఎన్ని భూములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారు..? అవి ఎక్కడెక్కడ ఉన్నాయి..? వాటి విలువెంత.. అని ప్రశ్నించారు. విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో రిజిస్టర్ చేసిన భూముల విలువ.. ప్రభుత్వ విలువ ప్రకారం సుమారు రూ.109 కోట్లు ఉంటుందని, ఇప్పుడు విజయవాడ, విశాఖలో భూముల మార్కెట్ విలువ రూ.700 కోట్ల దాకా ఉంటుందని ధర్మ సింగ్ బదులిచ్చినట్లు సమాచారం. ఆధారాల్లేకుండా నమ్మలేమని అధికారులు చెప్పగా.. ఆధారాలు అందిస్తానని సింగ్ చెప్పినట్లు తెలిసింది. చీమకుర్తి శ్రీకాంత్‌తో జరిపిన సంభాషణ ఆడియోలు, శ్రీకాంత్ రెండో భార్యగా చెబుతున్న వనం దివ్య(రీతూ చౌదరి) వ్యవహారంపైనా ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఆమె గురించి తనకు పూర్తిగా తెలియదని, గోవాలో ఎంజాయ్ చేసేందుకు శ్రీకాంత్ తీసుకొచ్చే అమ్మాయిల్లో ఆమె కూడా ఉందని చెప్పినట్లు సమాచారం. ఈ నాలుగు రోజుల్లో ధర్మ సింగ్ చెప్పే వివరాలు, వాటికి లభ్యమైన ఆధారాలతో వైసీపీ నేతలకు, చీమకుర్తి శ్రీకాంత్‌కు నోటీసులిచ్చి పిలిపించాలని ఏసీబీ యోచిస్తున్నట్లు తెలిసింది.

## నందిగం సురేశ్‌కు సుప్రీం షాక్

- మరియమ్మ హత్య కేసులో బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరణ
- నేర చరిత్రను దాచిపెట్టడంపై ఆగ్రహం



న్యూఢిల్లీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు సుప్రీంకోర్టులో భారీ షాక్ తగిలింది. మరియమ్మ హత్య కేసులో సురేశ్‌కు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. 2020లో ఎస్సీల్లోని రెండు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ నేపథ్యంలో తుళ్లూరు మండలం, వెలగపూడికి చెందిన ఎస్సీ మహిళ మరియమ్మ ఇంటిపై అప్పటి వైసీపీ ఎంపీ నందిగం సురేశ్ అనుచరులు దాడి చేశారు. ఈ క్రమంలో ఆమె మరణించారు. దీనిపై ఆమె కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసులో నాటి ఎంపీ సురేశ్‌ను నిందితుడిగా గుర్తించిన పోలీసులు ఆయనను అరెస్టు చేసి జైలుకు తరలించారు. దీంతో బెయిల్ కోసం సురేశ్ తొలుత హైకోర్టును ఆశ్రయించారు. కేసు తీవ్రతను గుర్తించిన హైకోర్టు బెయిల్ నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. మంగళవారం ఈ పిటిషన్ జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌ల ద్విసభ్య ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేసినప్పుడు సురేశ్ తనపై ఎలాంటి నేరచరిత్ర లేదని చెప్పారని, కానీ అప్పటికే ఆయనపై ఐదు కేసులు ఉన్నాయని ప్రభుత్వం తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోర్టు దృష్టికి తెచ్చారు. సురేశ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. బెయిల్ మంజూరుకు నేరచరిత్రతో సంబంధం లేదన్నారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ధర్మాసనం నేరచరిత్రను దాచిపెట్టడం గమనించదగ్గ అంశమని పేర్కొంది. పాత కేసుల వివరాలను దాచిపెట్టారన్న కారణంతో ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేయనందున తాము కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోబోమని ధర్మాసనం పేర్కొంది. హత్య కేసులో చార్జిషీటు కూడా దాఖలైనందున బెయిల్ కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని నందిగంకు సూచిస్తూ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

## సజ్జల కబ్జాపై అటవీశాఖ హ్యాండ్సప్

- కలెక్టర్ ఆగ్రహం.. జేసీ నేతృత్వంలో సర్వే.. 52.40 ఎకరాలు ఆక్రమణ

కడప, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబం కబ్జా చేసిన భూమి తమది కాదంటూ అటవీ శాఖ చేతులెత్తేసింది. కడప నగర శివార్లలో సజ్జల కుటుంబానికి 160 ఎకరాలకుపైగా పట్టాభూములు ఉన్నాయి. ఇక్కడ రిజర్వు ఫారెస్టుకు చెందిన 52.40 ఎకరాల భూమిని సజ్జల కుటుంబం ఆక్రమించింది. 'రిజర్వు ఫారెస్టులో సజ్జల సామ్రాజ్యం' శీర్షికన ఈ విషయాన్ని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై విచారణ చేయాలంటూ అటవీశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కడప కలెక్టర్ శ్రీధర్‌ను ఆదేశించారు. అటవీశాఖ అధికారులు చేతులెత్తేయడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీ అదితిసింగ్ పంపి మంగళవారం సర్వే చేయించారు. మొత్తానికి సజ్జల ఫ్యామిలీ సుమారు 52.40 ఎకరాలు ఆక్రమించిందని అధికార యంత్రాంగం నిర్ధారించింది. పూర్తి నివేదికను ప్రభుత్వానికి పంపనుంది.

## మంత్రి నిమ్మల సమక్షంలో చర్చలు సఫలం

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారుల పదోన్నతులకు మార్గం సుగమమైంది. విజయవాడలోని జల వనరుల శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో ఇంజనీరింగ్ అధికారుల సంఘాలు నిర్వహించిన సమావేశంలో పదోన్నతులపై ఏకాభిప్రాయం కుదిరింది. డిప్యూటీ ఇంజనీరు నుంచి చీఫ్ ఇంజనీరు దాకా పదోన్నతులకు మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. త్వరలోనే ఈ పదోన్నతులపై కీలక చర్యలు చేపట్టనున్నారు.

## కోడిపందాలను అడ్డుకోండి: హైకోర్టు

సంక్రాంతి నేపథ్యంలో కోడిపందాలు నిర్వహించకుండా చూడాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. .ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## అవినాష్‌రెడ్డి పీఏ బెయిల్ పిటిషన్ కొట్టివేత

- సోషల్ మీడియాలో అనుచిత పోస్టుల కేసు..

అమరావతి/పులివెందుల టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కడప వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డికి హైకోర్టు షాక్ ఇచ్చింది. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మంగళవారం కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప జిల్లా పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ రాఘవరెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. కాగా, ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో రాఘవరెడ్డిని మంగళవారం మధ్యాహ్నం పోలీసులు పులివెందుల పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. 41ఏ నోటీసులు ఇచ్చి, 10న విచారణకు రావాలని చెప్పి పంపించేశారు.

## కాంతి రాణా, విశాల్ గున్నీకి జెత్వానీ కేసులో ముందస్తు బెయిల్



అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, విశాల్ గున్నీకి హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరుచేసింది. అప్పటి విజయవాడ ఏసీపీ హనుమంతరావు, దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లుకూ ఇదే ఊరట కల్పించింది. దర్యాప్తు అధికారి సంతృప్తి మేరకు పిటిషనర్లు ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని స్పష్టం చేసింది. ప్రయాణ వివరాలను ముందుగా దర్యాప్తు అధికారికి తెలియజేయాలని, అవసరమైనప్పుడు దర్యాప్తుకు అందుబాటులో ఉండాలని.. దర్యాప్తునకు సహకరించాలని తేల్చిచెప్పింది. సాక్షులతో మాట్లాడవద్దని, వారిని ప్రభావితం చేయరాదని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం తీర్పు ఇచ్చారు.

## ఇంటర్ పరీక్షల్లో సంస్కరణలు

- ఫస్టియర్‌కు పబ్లిక్ పరీక్షలు అవసరమా?
- నేటినుంచి ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధం

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పరీక్షల్లో కీలక సంస్కరణలు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. సీబీఎస్ఈ తరహాలో రెండేళ్ల కోర్సులో ఒక్కసారే పబ్లిక్ పరీక్షలు నిర్వహించడంపై కసరత్తు ప్రారంభించింది. సీబీఎస్ఈలో 11వ తరగతికి పబ్లిక్ పరీక్షలు లేవు. 12వ తరగతిలో మాత్రమే ఉంటాయి. జాతీయ ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలకు కూడా 12వ తరగతి మార్కులనే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. దీంతో ఇంటర్ రెండో సంవత్సరంలో పబ్లిక్ పరీక్షలుంటే చాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే దీనిపై ఏకపక్షంగా కాకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేసి తుది నిర్ణయం ప్రకటించనుంది. బుధవారం (నేడు) నుంచి ఈ నెల 26వరకు దీనిపై అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించింది. ఒక్కసారే పరీక్షలు పెట్టడం వల్ల విద్యార్థులకు చదువుకునేందుకు ఎక్కువ సమయం లభిస్తుందని, ఒత్తిడి తగ్గి ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని ప్రభుత్వం యోచిస్తోంది. అలాగే వచ్చే ఏడాది నుంచి సిలబస్‌లో భారీగా మార్పులు తెచ్చి, పాఠ్యాంశాలను తగ్గించనుంది. అదేవిధంగా విద్యా సంవత్సరంలోనూ కీలక మార్పులు తేవాలని ఇంటర్ విద్యామండలి కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జూన్ 1 నుంచి మార్చితో విద్యా సంవత్సరం ముగుస్తోంది. ఏప్రిల్, మే నెలలు కాలేజీలకు సెలవులు ఇస్తున్నారు. ఇకపై వేసవి సెలవులను విద్యా సంవత్సరం మధ్యలోకి తేవాలని బోర్డు భావిస్తోంది. అంటే మార్చితో విద్యా సంవత్సరం ముగిస్తే, ఆ వెంటనే ఏప్రిల్ 1 నుంచి తర్వాత విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. ఏప్రిల్‌లో 1 నుంచి 24 వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత వేసవి సెలవులు ఇచ్చి, తిరిగి జూన్ 1న కాలేజీలు తెరుస్తారు. వేసవి సెలవులకు ముందు పూర్తిచేసిన సిలబస్ నుంచి బోధన కొనసాగిస్తారు.

## ఆవిష్కరణలు నూతన ఆలోచనలకు నాంది

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలు సైన్స్ ఫెయిర్లపై ఆసక్తిని పెంచుతాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. విద్యార్థుల ఆవిష్కరణలు నూతన ఆలోచనలకు నాంది పలుకుతాయని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌ను మంగళవారం విజయవాడలో ఆయన ప్రారంభించారు. దీనిలో 26 జిల్లాల విద్యార్థులు రూపొందించిన 156 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ఫెయిర్‌లో టాప్‌లో నిలిచిన 15 వ్యక్తిగత ప్రాజెక్టులు, 10 గ్రూప్ ప్రాజెక్టులు, 10 టీచర్ ఎగ్జిబిట్లను సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శిస్తారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## 80 కోట్ల ఆస్తిపై గద్దల కన్ను

- 12 ఏళ్ల క్రితమే స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం
- నాడే నిషేధిత జాబితాలో చేర్చిన రెవెన్యూశాఖ
- ఏడాది క్రితం అనూహ్యంగా ఆ జాబితా నుంచి తొలగింపు
- బేరసారాలు పూర్తి.. రిజిస్ట్రేషన్‌కు సర్వం సిద్ధం

(కందుకూరు-ఆంధ్రజ్యోతి)



రియల్ గద్దలు కన్నేసిన కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఇదే

నెల్లూరు జిల్లా కందుకూరు నడిబొడ్డున సుమారు రూ.80 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిపై అక్రమార్కులు కన్నేశారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా 12 సంవత్సరాల క్రితం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆస్తి అది. అందులోని భవనాలను కూడా సీజ్ చేసి, 22ఏ జాబితాలో చేర్చారు. ఆ ఆస్తిని 22ఏ జాబితా నుంచి తొలగించడం, అక్రమార్కులు ఆ భూమిని అమ్మగా, కారుచౌకగా వస్తోందని కొందరు పెద్దలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్‌కు అన్నీ సిద్ధం చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ఆస్తిపై అవగాహన ఉన్న స్థానిక రిజిస్ట్రేషన్ అధికారులు తటపటాయించటంతో ఇతర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. కందుకూరులోని కనిగిరి రోడ్డులో కోర్టు భవనాల ఎదురుగా ఉన్న 8.70 ఎకరాల ఫాదర్ బంగ్లా వ్యవహారం ఇది. బ్రిటిష్ హయాంలో సేవా కార్యక్రమాలు, క్రైస్తవ మతప్రచారం కోసం డబ్ల్యూబీ బాగస్ దొర సర్వే నెం.232లో కొంత భూమి కొనుగోలు చేసి బంగ్లా నిర్మించారు. ఇదే ఫాదర్ బంగ్లాగా ప్రాచుర్యం పొందింది. సర్వే నెం.232లో 9.14 ఎకరాలు ఉండగా, ఆర్ఎస్ఆర్, రిజిస్టర్ ఆఫ్ హోల్డింగ్స్ ప్రకారం ఆ ఆస్తి డబ్ల్యూబీ బాగస్, పోరూరి జనార్ధనయ్యలకు చెందినది. స్వాతంత్ర్యానంతరం బాగస్ దొర దేశం విడిచి వెళ్లిపోగా కొందరు ప్రైవేటు వ్యక్తులు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామంటూ ఈ బంగ్లాలోకి ప్రవేశించి .....మెర్సీ పేరుతో ఓ ఉన్నత పాఠశాలను స్థాపించారు. 1980లో 9.14 ఎకరాలలో 44 సెంట్ల భూమిని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు దారికోసం ప్రభుత్వం తీసుకుంది. కాగా, పోరూరి జనార్ధనయ్య వారసులు అందులో సగం తమకు చెందుతుందని కోర్టును ఆశ్రయించారు. మిగిలిన సగం వాటాదారుడైన బాగస్ దేశం విడిచి వెళ్లినందున ఆ ఆస్తి ప్రభుత్వానిదేనన్నవాదన వచ్చింది. దీంతో అందులో పాఠశాల నడుపుతున్న ప్రైవేటు వ్యక్తులకు, ప్రభుత్వానికి మధ్య దశాబ్దంపాటు న్యాయపోరాటం జరగ్గా, మొత్తం ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని 2010లో హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో జిల్లా విద్యాశాఖాధికారులు స్కూల్‌ను సీజ్ చేయగా, రెవెన్యూ అధికారులు 8.70 సెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. దాన్ని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు.

అయితే తమ సగం వాటా కోసం పోరూరి జనార్ధనయ్య వారసులు జిల్లా కోర్టులో వేసిన వాజ్యం ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. కాగా, ఏడాది క్రితం వరకు నిషేధిత జాబితాలో ఉన్న ఆ ఆస్తిని ప్రస్తుతం అనూహ్యంగా ఆ జాబితా నుంచి తొలగించారు. రెవెన్యూ అధికారులే తొలగించారా? జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో మతలబు చేసి ఆ జాబితా నుంచి తీసివేయించారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో ఇప్పటికే లక్షల రూపాయలు చేతులు మారగా, కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని సొంతం చేసుకునేందుకు కొందరు వ్యక్తులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ఆస్తులు వెనక్కే

- పిల్లల హక్కులు రద్దు చేసే అధికారం ఆర్డీవోకి
- ఆదేశాలు జారీ చేసిన రిజిస్ట్రేషన్ల శాఖ

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వారిచ్చిన ఆస్తులను మాత్రం అనుభవిస్తున్న వారికి ప్రభుత్వం పెద్ద ఝలక్ ఇచ్చింది. తల్లిదండ్రులను పట్టించుకోని పక్షంలో వారిచ్చిన ఆస్తులపై పిల్లల హక్కులను రద్దు చేసి తిరిగి తల్లిదండ్రులకు ఆ ఆస్తులపై హక్కులు కల్పించేలా నిర్ణయం తీసుకుంది. పిల్లలకు తల్లిదండ్రులు గిఫ్ట్‌డీడ్ కింద, సెటిల్‌మెంట్ కింద ఆస్తులు ఇస్తున్నారు. తర్వాత తల్లిదండ్రులను పిల్లలు వదిలేస్తున్న పలు ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇకపై ఇలాంటి రిజిస్ట్రేషన్లకు సెటిల్మెంట్లు, గిఫ్ట్‌డీడ్లు రద్దుచేశారు. తల్లిదండ్రులు, పిల్లలు ఇద్దరూ వస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. తల్లిదండ్రుల సంరక్షణ చట్టం 2007లోని సెక్షన్ 23 ప్రకారం తల్లిదండ్రులను జాగ్రత్తగా ఉంచడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పిల్లల నిర్లక్ష్యంపై తమ దృష్టికి వచ్చిన కేసులను విచారించి నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఆర్డీవోకి అప్పజెప్పారు. విచారణ తర్వాత ఆ ఆస్తిపై పిల్లల హక్కును రద్దు చేసి తల్లిదండ్రులకు అప్పజెప్పే అధికారం ఆర్డీవోకి ఉంటుంది. ఆర్డీవో ఆదేశాలను రిజిస్ట్రేషన్ల శాఖ తమ కార్యాలయాల్లోని సాఫ్ట్‌వేర్ రికార్డుల్లోనూ పొందుపర్చాలి. ఆర్డీవో ఆదేశాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ హక్కులు మార్చాల్సి ఉంటుంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

## సంక్రాంతికి పోదాం.. చలో చలో!

- 7,200 ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 7,200 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై నుంచి అదనపు సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకూ పొరుగు రాష్ట్రాల నుంచి ఏపీకి వచ్చేందుకు.. అదేవిధంగా తిరిగి 16 నుంచి 20వ తేదీ వరకు తిరుగు ప్రయాణానికి ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండబోవని, పండగకు వచ్చే ప్రయాణికులు ఓకేసారి తిరుగు ప్రయాణ టికెట్ కూడా రిజర్వేషన్ చేసుకుంటే.. చార్జీలో 10 శాతం రాయితీ ఉంటుందన్నారు. బుధవారం నుంచి ఈ నెల 13 వరకూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఆర్టీసీ 3,900 బస్సులు నడుపుతోంది. హైదరాబాద్ నుంచి ఏపీలోని పలు ప్రాంతాలకు 2,153 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా బెంగళూరు నుంచి 375, విజయవాడ నుంచి 300, విశాఖపట్నం 250, రాజమహేంద్రవరం 230, తిరుపతి 50, చెన్నై నుంచి 42 అదనపు బస్సులు నడుపుతున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ వివరించింది. సంక్రాంతి తర్వాత తిరుగు ప్రయాణానికి జనవరి 16 నుంచి 20 వరకు 3,300 బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపింది. రాష్ట్రంలోనే పెద్ద పండగ అయిన సంక్రాంతికి నగరాలు, పట్టణాల నుంచి సొంతూళ్లకు వెళ్లేందుకు లక్షలాది మంది సిద్ధమవుతున్నారు. ఎలాంటి అదనపు చార్జీల్లేకుండా సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి గమ్యం చేరాలని వారిని ఆర్టీసీ కోరింది. ఆన్‌లైన్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపింది. కాల్ సెంటర్ నెంబర్ 149 లేదా 0866-2570005 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించింది.

### తెలుగు రాష్ట్రాల మధ్య ప్రత్యేక రైళ్లు

సంక్రాంతి సందర్భంగా దక్షిణమధ్య రైల్వే తెలుగు రాష్ట్రాల మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడ, నర్సాపురం, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు అదనపు ట్రైన్లు అందుబాటులో ఉన్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ నెల 11, 15 తేదీల్లో కాచిగూడ నుంచి శ్రీకాకుళం రోడ్(07615)కు సాయంత్రం 5.45కు ప్రత్యేక రైళ్లు బయలుదేరి విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం మీదుగా మరుసటి రోజు ఉదయం గమ్యానికి చేరుకుంటాయి. అవే రైళ్లు ఈ నెల 12,16తేదీల్లో శ్రీకాకుళంరోడ్ నుంచి మధ్యాహ్నం 2.45కు తిరిగి వెళతాయి. మరో రైలు చర్లపల్లి నుంచి జనవరి 8న రాత్రి 7.20కు బయలుదేరి మరుసటి ఉదయం గమ్యం చేరుతుంది. అదే రోజు(9న) మధ్యాహ్నం 2.45కు తిరిగి వెళుతుంది.

## ఆర్టీసీ రిటైర్డ్ సిబ్బందికి ఈహెచ్ఎస్

- వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన వైద్య సేవలు పునరుద్ధరణ

ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ సిబ్బందికి కూటమి ప్రభుత్వం సంక్రాంతి ముందు తీపికబురు చెప్పింది. విలీన సమస్యల్లో ఒకటైన ఈహెచ్ఎస్ ద్వారా వైద్య సేవలు పొందే అవకాశం కల్పించింది. 2020 జనవరిలో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన వైసీపీ ప్రభుత్వం.. అంతకు ముందున్న వైద్య సదుపాయాన్ని రద్దు చేసింది. ఎన్ఎంయూ, ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, కార్మిక పరిషత్ అసోసియేషన్లు కూటమి ప్రభుత్వానికి తాజాగా కలిసి దీనిపై విన్నవించాయి. స్పందించిన ప్రభుత్వం పాత పద్ధతిని పునరుద్ధరిస్తూ అత్యవసర వైద్య సేవలకు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కూడా కల్పించింది. ప్రభుత్వ నిర్ణయంపై రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, అసోసియేషన్ల నాయకులు పీవీ రమణారెడ్డి, పలిశెట్టి దామోదర్ రావు, శేషగిరి, చల్లా చంద్రయ్య హర్షం వ్యక్తం చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar**, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.